
"కదళి అనేది శరీరం
కదళి అనేది మనస్సు
కదళి అనేది విషయాలు
కదళి అంటే సంసారమనే ఘోరారణ్యం!
కదళి అనే దాన్ని గెలిచి తాను బ్రతికి వచ్చి
కదళీవనంలో శివుణ్ణి చూశా!
భవాన్ని వీడి వచ్చిన కూతురని
కరుణతో పట్టి బిగుతుగా
కౌగిలించుకుంటే -
చన్నమల్లికార్జునుని
హృదయంలో అమరిపోతాను"

# అక్క మహాదేవి

కన్నడ మూలం:

డా॥ సిద్ధయ్య పురాణిక్



ప్రచురణ:
**తెలంగాణ బసవ పరిషత్**
హిరేమఠ సంస్థానం, భాల్కి, బీదర్ జిల్లా, కర్ణాటక

# అక్క మహాదేవి

తెలంగాణ బసవ పరిషత్ ప్రచురణ సంఖ్య : 28

# అక్క మహాదేవి



కన్నడ మూలం:

**డా॥ సిద్ధయ్య పురాణిక్**

తెలుగు అనువాదం:

**డా॥ కె. సుధాకర రావ్**

ఎం.ఏ. (తెలుగు), ఎం.ఏ. (సంస్కృతం), పిహెచ్.డి.

విశ్రాంత డిప్యుటీ డైరెక్టర్, దూరదర్శన్ హైదరాబాద్

ప్రచురణ:

**తెలంగాణ బసవ పరిషత్**

హిరేమఠ సంస్థానం, భాల్కి, బీదర్ జిల్లా, కర్ణాటక

# అక్క మహాదేవి

కన్నడ మూలం:

**సిద్ధయ్య పురాణిక్**

తెలుగు అనువాదం:

**డా॥ కె. సుధాకర రావ్**

ఎం.ఏ. (తెలుగు), ఎం.ఏ. (సంస్కృతం), పిహెచ్.డి.

బళ్ళారి

ప్రచురణ: తెలంగాణ బసవ పరిషత్

ప్రథమ ముద్రణ : మార్చి, 2023

ప్రతులు : 1000

పుటలు : 130

వెల : రూ. 120/-

ప్రతులకు :

బసవ ధర్మ ప్రసార సంస్థ

హిరేమఠ సంస్థానం, భాల్కి

బీదర్ జిల్లా, కర్ణాటక

ముద్రణా పర్యవేక్షణ

షకీల్ అహ్మద్ (9959652570)

ముద్రణ:

కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్-500044

తెలంగాణ. ఫోన్: 040-27618261





# మనవి

కర్ణాటక విశ్వవిద్యాలయంలో 'బసవ పీఠం' ఆవిర్భవించడం ఒక చారిత్రాత్మక మైన అవసరం తీరడమే! ప్రస్తుతం డా॥ ఎం. ఎం. కలబుర్గి గారి నేతృత్వంలో ఆ అవసరం తీర్చేందుకు ప్రయత్నం జరిగింది. కోరిక మూర్త స్వరూపాన్ని దాల్చడం చాలా సంతోషకరమైన సంఘటన.

'పీఠం'లో మొదటి వరుసలో బసవ, ప్రభుదేవ, అక్క మహాదేవి– వీరి జీవితం సందేశాల గురించిన చిన్న పుస్తకాలు ప్రచురించాలని పీఠ సంపాదక సమితి నిర్ణయించింది. అక్క గురించి నేనే రాయాలని నిర్ణయించింది. రాసేందుకు అంగీకరించాను. కాని రాయడం చాలా కష్టమని అనిపించింది రిటైరైన తర్వాత మరింత పని చేయాలనుకున్న నాకు! చివరకు భద్రావతిలో కూతురైన భారతి ఇంట్లో కూర్చుని వ్రాసి ముగించాల్సి వచ్చింది.

నాకీ అవకాశాన్నందించిన అల్లుడు మృత్యుంజయప్ప, కూతురు భారతి వీరిరువురికి ఈ కృతి వల్ల కల్గే శ్రేయస్సులో కొంత భాగం లభించాలి. డా॥ ఎం.ఎస్. సుంకాపుర, డా॥ ఎస్. ఎం. వృషభేంద్రస్వామి, డా॥ బి.బి. హెండి, డా॥ ఎం. ఎం. కలబుర్గి గారల సలహాలకు, సహకారాలకు వారికి హృత్పూర్వకాభినందనలను అందిస్తున్నా.

అక్క ఆరాధకుల, అభిమానుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వాళ్ళందరి అభిరుచికి ఇది నచ్చుతుందనే శుష్క ప్రతిష్ఠ నాకు లేదు. అయితే పూర్తిగా కృతి నచ్చక పోయినా, అక్క ఆలోచనామృతం మాత్రం నేను మథించి వెలికి తీశాను. ఇది తప్పక నచ్చుతుంది, రుచిస్తుందని విశ్వసిస్తున్నా.

శ్రీగిరి 4/5 ఎ

అలి అస్కర్ రోడ్

బెంగుళూరు – 560 052

**సిద్ధయ్య పురాణిక్**

# విన్నపం

కన్నడ అధ్యయన పీఠంలో 'శ్రీ బసవేశ్వర పీఠం' ఆవిర్భావం ఒక మహత్తర సాధన. బసవణ్ణ గారి లోకోత్తర సిద్ధాంతాలకు, ఆచారాలకు లోకవిస్తార క్షితిజాన్ని కల్పించడమే పీఠం ఉద్దేశం.

దీనికోసం "శ్రీ బసవేశ్వర అధ్యయన డిప్లొమా కోర్స్" ప్రారంభం, "వీరశైవ కేంద్ర గ్రంథ భాండార స్థాపన" ఇవే కాకుండా పరిశోధన, సంపాదన, విమర్శ, అనువాదం – ఈ నాల్గు రకాల కార్యాలకు అవకాశం కల్పించబడింది. బసవణ్ణ గారి గురించి కన్నడలో, సంస్కృతంలో, తెలుగులో, తమిళంలో, మరాఠీలో చాలా సాహిత్యముంది. దేశంలోపల, వెలుపల బసవేశ్వరుని గురించి అనేక వదంతులు వినవస్తున్నాయి. అనేక అవశేషాలు అజ్ఞాతవాసాన్ని అనుభవిస్తున్నాయి. వీటిని బాగా పరిశీలించి, తద్వారా అధికారిక విషయాన్ని రాగద్వేష రహిత దృష్టితో చూసి, ప్రచురించే కార్యక్రమం నడవాల్సి ఉంది. దీన్ని వివిధ భాషల ద్వారా దేశవిదేశాల్లో వ్యాపింపజేయాలి.

ఈ లక్ష్యం నెరవేరాలనే ఉద్దేశంతో అనేక పథకాలున్నాయి. వాటిలో శరణుల చరిత్రల్ని కన్నడంలో రాసి ప్రచురించటం, తర్వాత వీటిని ఇంగ్లీష్, హిందీ మున్నగు వేరే భాషలలో అనువదించడం – దీనికై "శరణుల జీవన చరిత్ర మాలె" అస్తిత్వంలోకి వచ్చింది. ఈ మాల కోసం మహాదేవి గారి గురించి చక్కని కృతిని రచించి మాకు అందించిన విఖ్యాతకవులు, వీరశైవ విద్వాంసులైన డా॥ సిద్ధయ్య పురాణిక్ గారికి ధన్యవాదాలు. బసవేశ్వర పీఠం కార్యకలాపాలన్నిటిలో బాగా ఆసక్తి చూపుతున్న మా విశ్వవిద్యాలయం కులపతులు డా॥ డి.ఎం. నంజుండప్ప మరియు వారి సలహా సమితి సదస్యులందరికి వందనాలు. విశ్వవిద్యాలయం ప్రసారంగ ముద్రణ విభాగాల అధిపతులకు ధన్యవాదాలు.

**డా॥ ఎస్.ఎం. వృషభేంద్ర స్వామి**
కన్నడ అధ్యయన పీఠాధిపతి

**డా॥ ఎం. ఎం. కలబుర్గి**
శ్రీ బసవేశ్వర పీఠం అచార్యులు





# తొలిపలుకు

అత్యంత సౌందర్యం, పరమవైరాగ్యం ఇవి రెండూ దుర్లభమైనవి. అయితే ఇవి రెండూ ఒకరిలోనే ఉండడం చాలా అపూర్వం. అలాంటి అపూర్వ వ్యక్తియే అక్క మహాదేవి. కౌశిక రాజు వెంటబడినా తిరస్కరించి, భౌతిక సుఖాల్ని త్యాగం చేసిన వనిత. మల్లికార్జునుడే తన పతి అని భావించి శ్రీశైలం సమీపం లోకదళీవనం చేరి అక్కడ శివానుభూతుల్ని పొందిన శరణురాలు. ఆమె చరిత్రను శ్రీ సిద్ధయ్య పురాణిక్ చక్కని కన్నడంలో రచించారు. బసవసాహిత్యాన్ని కన్నడం నుండి తెలుగులోకి అనువదింప చేసేందుకు నడుంబిగించిన బసవలింగ పట్టదేవరు గారి పట్టుదల ప్రశంసనీయం. దీన్ని తెలుగులోకి అనువదించే మహద్భాగ్యాన్ని నా కందించి నందుకు వారికి ధన్యవాదాలు. హిరేమఠ సంస్థాన్‌లోని పెద్దలందరికీ వందనాలు

**– డా॥ కె. సుధాకరరావ్**
తెలుగు అనువాదకులు

## విషయ సూచిక


మనవి

విన్నపం

తొలిపలుకు

- ★ మహాదేవి గారి మహాజీవనం
- ★ అసాధారణమైన విజయాలు
- ★ అక్క ఆలోచనామృతం
- ★ అక్క వ్యక్తిత్వం






# మహాదేవి గారి మహాజీవనం

నేటికి మహాదేవి అక్క ఒక గొప్ప వ్యక్తి మాత్రమే కాదు; భక్తి, జ్ఞాన, వైరాగ్య జనితమైన ఆత్మశక్తి మాత్రమే కాదు; మహిళా విముక్త ప్రచార కార్యక్రమానికి తొలి నిదర్శనం మాత్రమే కాదు; వచన సాహిత్యమనే పవిత్ర పర్వతం అత్యున్నత శిఖరం మాత్రమే కాదు; ఆమె సముజ్వల జీవన దర్శనానికి సంబంధించిన సజీవ సామర్థ్యం; సాన్నిధ్యం'. ఆమె సాన్నిధ్యంలోని దైవీశక్తికి, కిరణ ప్రసారాల ప్రభావానికి లొంగని కన్నడిగులు లేరు; విద్యావంతులైనా, నిరక్షరకుక్షులైనా అక్కమహాదేవి ఉపస్థితిలోని సమ్మోహకత్వానికి ఆకర్షితులు కావలసిందే! ఆకర్షితులౌతూనే ఉన్నారు. అలాగే పేరు – ఊరు తెలియని గ్రామీణుల నుండి మొదలుకొని హరిహరాది మహాకవులదాకా, ఆంగ్లవిద్యాభూషితులైన వారు మొదలుకొని, సంస్కృత పాండిత్యగౌరీశంకరశిఖరాన్ని అధిరోహించిన గౌరీశంకర మహాస్వాముల వారి దాకా అందరూ ఆ దేవి పై ఎన్నో పాటల్ని రచించారు. కావ్యాల్ని, నాటకాల్ని, చరిత్రల్ని, ప్రబంధాల్ని రచించారు. ప్రవచనాలు చేశారు. శివకథలు వివరించారు. లావణి పాడారు. ప్రతి ఏటా అక్క మహాదేవి సాహిత్యం మరింత ప్రస్ఫుటమవుతోంది! ప్రబలమవుతోంది. ఇదంతా ఆమె అమోఘమైన, అనుపమ వ్యక్తిత్వానికి సాక్షి.

ఇలాంటి అద్భుత వ్యక్తిత్వం వికసించాలంటే దాని తగిన పరిసరంలోనే జరిగి ఉండాలి కదా ! 'మలెనాడు నాకు తల్లి గృహం వనం దేవుని నిలయం'

అని పాడి పొగిడించుకున్న మలెనాడుకు కిరీటతుల్యం బనవసలోని పనిర్భాసిర ప్రాంతానికి చెందిన బళ్ళియగావి ప్రదేశం. మన దేశంలోనే ఇది ఒక ప్రాచీన శైవకేంద్రం. చిన్నకళ్యాణంగా ప్రసిద్ధికెక్కిన ఈ బళ్ళిగావె సమీపంలోనే ప్రకృతి సౌందర్యవాతావర ణంలో నిద్రపోయే ఉడుతడి అనే గ్రామం ఉంది. ఇది ప్రాచీన కాలంలో రాజధాని. అక్కడ నేడు లభ్యమైన అవశేషాల ఆధారంగా ఇది ఒకప్పుడు రాజధాని అయి ఉండవచ్చని చెప్పవచ్చు. ఇక్కడ అక్క జన్మించినపుడు కౌశికుడు రాజుగా ఉన్నాడు. ఏ కౌశికుడనేది ఖచ్చితంగా తెలియదు.

ప్రఖ్యాతుడైన కసపయ్యయే కౌశికుడు కావచ్చని డా॥ ఎం. చిదానందమూర్తి గారు తర్కించారు. కౌశికుడు నివసించిన రాజహర్మ్యం ఉన్న స్థలమిదే అని నేడు ఒక అవశేషాన్ని చూపిస్తారు. పరదేశి మల్లప్ప గుడి కూడ ఉంది. ఈ కారణాల వల్ల కలబుర్గి తాలూకాలోని మహాగావ్ కన్న ఈ ఉడుతడియే అక్కగారి జన్మస్థలం అయ్యే సాధ్యతలు ఎక్కువ అని విద్వాంసులు తీర్మానించారు. పిడుపర్తి సోమనాథుడు చెప్పినట్లుగా ఉదతడి అనే (నీటి తడి ఉన్న స్థలం అని అర్థం) తొలి పేరు ఉడుతడిగా మారిందే నిజమైతే శిరాళకొప్పకు 3 మైళ్ళ దూరంలో ఉండే ఈ ఉడుతడియే అక్క పుట్టిన ఊరనే వాదానికి మరింత పుష్టి లభిస్తుంది. ఎందుకంటే– నేటికీ ఇక్కడ ఒక సుందరమైన సరస్సుంది. అక్క విద్యాభ్యాసం చేసిన మఠాన్ని నేటికీ 'గురువాడి మఠం' అని పిలిచేవారట. ఇది కాకుండ, హరిహరుడు, పాల్కురికి సోమనాథుడు, చామరసుడు, సిద్ధనంజేశ ఘనమఠం

---

* కర్ణాటక భారతి సంపుటం 8. సంచిక 2

1. చూడు: హరిహరుని మహాదేవి యక్కనరగళె తొలి, చివరి పద్యాలు; పండితారాధ్యచరిత్ర ఆ 2, పద్యం 88; గురురాజ చరిత్ర సం. 9, పద్యం 88: ప్రభులింగ లీలెగర్తి పద్యం 2; భక్తిసుధాసారపద 139; తెలుగుకవి పిడుపర్తి బసవుడు ఉడంతడి అనే చెప్పాడు.





శివయోగులు అక్కను ఉడుతడి మహాదేవి అనే పిలిచారు.[1]

మొత్తానికి ఉడుతడికి అక్క జన్మస్థలమనే గౌరవం, గొప్పతనం లభించాయి. అక్కడ భక్తిసంపన్నులైన కుటుంబంలో పుట్టిందామె. ఆమె తల్లిదండ్రుల పేర్ల విషయంలో పాత పుస్తకాల్లో ఏకాభిప్రాయం లేదు. అనేక శరణుల శరణురాంద్ర పై రగళెలను వ్రాసే అవసరంలో ఉన్న హరిహరుడు 'శివభక్తుడు, శివభక్తురాలు' అని చెప్పి ముందుకు సాగుతాడు. ఇలా పేరు తెలియనివారికి హరిహరుల 'శివభక్తుడు, శివభక్తురా'లని 'పేరు' పెట్టడం క్రొత్తదేం కాదు. కీర్తి శేషులైన శరణుల అంతరంగంలోని భావాల చిత్రణే ప్రధానం. బాహ్య సంఘటనల వివరాలు ఇవ్వడం జరగదని తేల్చి ఉండాలి. స్వయంగా సాధకవరేణ్యుడై ఉన్నాడు ఆ మహాకవి.

అక్క గురించి రాసిన వేరే కృతికర్తలలో చామరసుడు, ఎళందూర హరీశ్వరుడు, చెన్న బసవాంకుడు, అక్కగారి తల్లిదండ్రుల పేర్లు నిర్మల, సుమతి అనీ, రాచకవి ఓం కార శెట్టి లింగమ్మ అనీ, పిడుపర్తి బసవ మరియు బాల పాషాంబా కవులు విమల కుటిలాల అని చెప్పారు. ఎక్కువమంది చెప్పిన నిర్మల సుమతి గారు అనే పేర్లే ఇప్పటి దాకా అంగీకరింపబడిన నామధేయాలు. 'విమల' 'నిర్మల' రెండూ సమానార్థక శబ్దాలు కావడం వల్ల తండ్రి పేరు నిర్మలుడు అనడమే ఖచ్చితమని అనిపిస్తుంది. అయితే తల్లి పేరు మాత్రం సుమతి, లింగమ్మ, కుటిలాల అని పరస్పరం సంబంధంలేని మూడు పేర్లు ఏర్పడేందుకు అవకాశమిచ్చింది. ఇది ఒక విడదీయరాని చిక్కుముడిగా మిగిలింది. 'సుమతి' అనే నామాన్ని అనేకులంగీకరించడంతో దాన్నే ఒప్పుకుని ముందుకు సాగడం మేలు అని అనిపిస్తుంది.

పేరేదైనా కానీ! ఖ్యాతి గాంచిన భక్తులు వారు; శివాచార సాధకులు వారు; గురు– లింగ – జంగమ – రూపమైన శివతత్త్వారాధకులు వారు. ఇలాంటి వారికి త్వరగా సంతానం కల్గలేదు. వీరి ప్రార్థనతో ప్రీతులైన శివుడో, పార్వతియో

వీరికి కొడుకునో, కూతురినో ప్రసాదించడం, వారి అంశయే ఆ మహిమాన్వితుల ఉదరంలో గర్భంగా కారణ జన్మురాలైన శిశువుగా ఎదిగి ఆ ఆ కాలంలోని పుణ్యం పరిపక్వమైనంతనే శరణసంతానోదయం కావడమూ అనేక కావ్యాల్లో మనం విన్న మాటలే! అక్కమహాదేవి జననం విషయంలోనూ ఈ మాటలు ఆమె గురించి రాయబడిన కృతులన్నింటిలో కన్పిస్తున్నాయి. "పార్వతీదేవి ఆజ్ఞతో నరలోకానికి దిగివచ్చి భక్తికి పుణ్యోదరగత విశుద్ధ విభ్రమ గురుతరముఖమైన గర్భం" అని హరిహరుడు వర్ణించనీ! "నీ నిర్మల సాత్విక సంపన్న కళను తొలగించుకుని ధరలో బంగారంగా నిలిచేందుకు పుట్టి నిష్కామ భక్తిలో నిలిచావు" అని చామరసుడు అభివర్ణించనీ! "శివుని జటాజూటంలోని చంద్రకళాతుల్యంగా ఈ రుద్రకన్య భువిలోకి అవతరించిందని" చెన్నబసవాంకుడు రాయనీ!

"మృడుని అంశమే ధరణిలో ఉడుతడిలో విరాజిల్లుతూ పట్టణంలో జనించగా" అని విరూపాక్ష పండితుడే వివరించనీ – అందరూ పార్వతి అంశయే సుమతి పుణ్యగర్భంలో ముత్తెపు చిప్పలోని ముత్యంలా ఎదిగి మహాదేవిగా మారిందనే కల్పననే కల్పలతలా పెంచారు.

పవిత్రమూర్తి అక్క పేరు మీద ఎలాంటి వివాదాలు లేవు. లేవని చెప్పడానికీ వీలులేదు. పండితారాధ్య విరచిత సంస్కృత గణసహస్రనామావళిలో "ఉడుతడియ మహాదేవి తథైవ కమలవ్వా' అని చెప్పబడింది. దీంతో మహాదేవి అక్కకు కమలవ్వ అనే మరో పేరు ఉండిందని కొందరు తర్కించేందుకు అవకాశం కల్గింది. అయితే ఈ ముడిని విప్పారు డా॥ ఆర్.సి. హిరేమఠగారు అక్కవచనాలకు తామువ్రాసిన ప్రస్తావనలో! పాల్కురికి సోమనాథ కృత కన్నడ గణసహస్ర నామావళి మరియు పండితారాధ్య విరచిత సంస్కృత గణసహస్రనామావళి రెండింటిలోనూ అమరగణాల సంఖ్య 236. అయితే





సంస్కృత గణ సహస్ర నామావళిలో 'మహాదేవి', 'కమలవ్వా' ఈ రెండూ ఒక్కరి పేరే అని భావిస్తే సంఖ్య సరిపోతుంది. అందువల్ల కమలవ్వ నుండి మహాదేవి వేరే అని తేలుతుంది. హరిహరుడు "తండ్రి ప్రీతితో.. పార్వతి పేరు పెట్టి 'మహాదేవి' అ పిలిచి మూడు సార్లు చెవిలో ఊదారు" అని మహాదేవి అక్క రగళెలో స్థల 2 లో చెప్పి ఉండడం స్థిరపడుతుంది.

కన్నడ కావ్యాల్లో బాల్య లీలల వర్ణనలకు కొదవేముంది? అయినా హరిహరుడు చేసిన మహాదేవి బాల్యలీలల వర్ణన మనోహరమైనది. కొన్ని పంక్తులైనా చదవకుండా ముందుకు సాగడం సరికాదనిపిస్తుంది.

"తల్లి ఒడిలో చల్లగా ఎత్తుకునే వారి భుజాలపై, ఆడించే వారి స్కంధాలపై, స్పర్శించేవారి మోహంలో, తాకేవారి సుఖంలో, ఓలలాడించేవారి కౌగిలిలో, కలువలో చిక్కిన ఆడతుమ్మెద ఎగిరినట్లొక్కొక్కసారి ఏడుస్తూ తామరపూవు రేకులా ఒక్కొక్క సారి నవ్వుతూ, కలువలు ముకుళించి నట్లొక్కొక్కసారి కనులు మూస్తూ శివ భక్తికి మూతను తెరిచినట్లు కళ్ళు తెరవడం మందమారుతానికి చలించే లతలా చేతుల్ని అల్లాడిస్తూ, జీవ రత్నం లేచినట్లుగా ప్రకాశిస్తూ, నిష్ఠ పెరిగినట్లు నిద్రిస్తూ, సుఖం సుళ్ళు తిరిగినట్లు నడుస్తూ, వీణ మ్రోగినట్లు మాట్లాడుతూ... చంద్రకళలా కళలతో దినదిన ప్రవర్ధమానమౌతూ ఆమె అందంగా పెరుగుతుంది.

ఈ బాల్యక్రీడావర్ణన ఏమో బావుంది. అయితే తర్వాత బాల్యం నుండి యౌవనోదయం దాకా సాగిన పురోగతిని "ఈ విధంగా నాలుగు, ఐదు, పది సంవత్సరాలు ఎదిగిన నియమాల కామినికి, భస్మం పెట్టుకునే భామినికి, రుద్రాక్షలు ధరించే రుద్రకన్యకకు, తనువులో బాల్యం సదలి యౌవనం మెల్లగా ఆలింగించుకొనగా" అని ముగిస్తాడు! పుణ్యానికి ఆ పురంలోని సర్వగుణ సంపన్నులైన శైవాగమాచార్యుల వల్ల గురుకారుణ్యాన్ని

పెంపొందింపజేయడా"న్ని, అక్క "సాహిత్యనిధిగా సకల కళాకోవిద"గా మారిందనీ ఉల్లేఖిస్తాడు. ఆ శైవాగమాచార్యుల పేరేమి? హరిహరుడు చెప్పలేదు. లోపల దొరికిన ఆధారాల ద్వారా "గురులింగ దేవరు" అనేది అక్కగారి గురువు పేరుండవచ్చని లింగైక్య 'శివసుతు'లు, మరి కొందరూ ఊహించారు. ఇదేమైనా ఉండనీ! ఒక గురువు గారి కరుణవల్ల అక్క "లింగపాణిగా, సదా సన్నిహిత చరిత్రురాలిగా, భక్తి భరితగా, శివజ్ఞాన సంపన్ను రాలుగా మారటంలో సందేహమే లేదు. వేరేవాళ్ళెవరూ అనుకరించేందుకు సాధ్యంకాని అక్కగారి కన్నడ రూపం రూపుదాల్చింది ఉడుతడిలోనా? కళ్యాణంలోనా? ఆమె కన్నడ భాష అధికారాన్ని సంపాదించుకున్నది ఉడుతడిలోనే జరిగి ఉండాలి.

బాల్యయౌవనాల మధ్య ఉన్న రోజుల్లో విద్యాభ్యాసం కాకుండా ఇంకేమి సాధిస్తూండింది అక్క మహాదేవి? ఊహ అనే ఊతకర్రను పట్టుకుని అక్క వచనోద్యానంలో విహరించినప్పుడు మనకొక్కటి జాడ తెలుస్తుంది. అక్కడ !

"తన బృందాన్ని వదలి వచ్చిన గజం
తన వింధ్యపర్వతాన్ని తలచుకున్నట్లు తలచుకుంటానయ్యా
బంధనంలో చిక్కుకున్న చిలుక
తన బంధువును తలచుకున్నట్లు తలుస్తానయ్యా!
బిడ్డా! నీవిటురా అని మీరు మీ అందాన్ని చూపించయ్యా
చెన్నమల్లికార్జునా!"

ఇది ఒక పరకీయత్వానికి చెందిన హృద్యచిత్రం. దీని అనుభవం ఉడుతడిలోనే అయి ఉండాలి అక్కకు! అయితే ఎన్నో సంవత్సరంలో జరిగి ఉండవచ్చు అనేది కుతూహలాన్ని కల్గించే ప్రశ్నయే. ప్రజ్ఞాప్రభాతంలోనే అయి ఉండాలి. లేదంటే ఈ వచనానికి వేరే ఏ ఆధారాన్ని చూపించాలి?

"అక్క ! విను! అక్క నేనొక కల కన్నా





బియ్యం, వక్క తాంబూలం, టెంకాయ చూశా
చిన్న చిన్న జడలున్న తెల్లటి గొరవయ్య
భిక్షకై ఇంటికి రావడం చూశా నమ్మా!
మితి మీరి అతని వెంటబడి చేయి పట్టుకున్నా-
చెన్నమల్లికార్జునుని చూచి కనులు తెరిచాను!

కన్య జీవితంలో తనకు కాబోయే భర్త ఎలాంటి వాడై ఉండాలని మనసులో నెమరు వేసే, కలలుగనే కాలం ఒకటి వస్తుంది. ఆ కాలానికి అప్పుడే అక్క-

"నా మనసును చూరగొన్నాడమ్మా
నా తనువును వశీకరించాడమ్మా
నా సుఖాన్ని ఆలింగనం చేసుకున్నాడమ్మా
నా ఉనికిని చేతబట్టుకున్నాడమ్మా
నేను చెన్నమల్లికార్జునుని ప్రియురాలిని"

అని చాటే స్థితికి చేరుకుని ఉండాలి. చెన్నమల్లికార్జునుని సగుణోపాసనకు సంబంధించిన వచనాలన్నీ అక్క అనుభవ మంటపంలో అడుగిడటానికన్న ముందు రాసినవి; నిర్గుణోపాసనకు చెందిన వచనాలు తరువాత రాసినవై ఉండాలని తీర్మానించేందుకు నిశ్చయించాను.

మెరిసే ఎరుపు జడల మణికిరీటాలతో
ప్రకాశించే సుడులు తిరిగిన మందహాసంతో
కూడిన ముఖంతో
హాసంతో కాంతివంతమైన కళ్లతో
పదునాల్గు భువనాల్ని ప్రకాశింపచేసే
దివ్యస్వరూపుణ్ణి చూశా నేను !
చూచాక నాకళ్లలోని కరువు తీరింది.
గండర గండడు లాంటి వాళ్ళందరిని

స్త్రీలుగా భావించి పరిపాలించే
గర్వభరిత పురుషుణ్ణి చూశాను.
జగదాది శక్తిలో కలిసి మాట్లాడే
పరమగురువు చెన్న మల్లికార్జునుని
రూపం చూసి జీవించాను'

ఈ ఐక్యస్థల వచనాన్ని చదివాక అక్క సాకారం నుండి నిరాకారానికి, నిరాకారం నుండి సాకారానికి సరళంగా లీలామాత్రంగా విహరిస్తుండేదని తెలుస్తోంది. ఇదే త్రివిధ లింగ పూజా రహస్యం.

"నా చేతి నిండా, మనస్సు నిండా
నా భావం నిండా - నీ ఉనికిలోని
మధురమైన కళల్ని ఎక్కడ చూడగల్గుతానయ్యా
అని అక్కే పాడి ఉండలేదా?

తల్లిదండ్రుల, చెలికత్తెల నడుమ కూడ అక్కకు లభించింది ఏకాకితనపు అనుభవం. 'ఆత్మ సంగమాని'కి మల్లికార్జునుడున్నా బాహ్యజీవితంలో సమానధర్ములైన వారి కొరత సహజంగానే, క్లిష్టకరంగానే పరిణమించి ఉండాలి – అక్కకు! లౌకికమైన, విలువల పరిసరాల్లో ఉన్న అక్కకు తన అలౌకిక మౌల్యాల్ని సర్వాత్మకుడైన శర్వునికి స్వాత్మ సమర్పణ గావించే మౌల్యాన్ని సమర్పించుకోవాల్సి వచ్చింది. తగిన వరుణ్ణి చేతిని పట్టుకుని సాంసారిక జీవనాన్ని సాగించడమే స్త్రీగా పుట్టినందుకు గమ్యమనీ వాదించిన వాళ్ళందరికీ క్రింది వచనం ఒక జవాబు –

"కొండల్లో కాకుండా గడ్డిలో నెమలి నాట్యం చేస్తుందా?
కొలనులో కాకుండా కాల్వలోకి దిగుతుందా హంస!
మామిడి చెట్టును కాకుండ కోకిల వేరే చెట్టును





ఆశ్రయిస్తుందా?
సుగంధ రహిత పుష్పానికి తుమ్మెద ఆకర్షింపబడుతుందా?
నా దేవుడైన చెన్నమల్లికార్జునికి కాకుండా
వేరే వాళ్ళకు వశమౌతుందా నా మనస్సు?
వినండోయ్ - చెలికత్తె లారా !"

ఇది మహాదేవిగారి మహత్తరకాంక్ష, కోరిక ఆశయం– కోరింది, ఆశించింది. ఇన్నే గొప్ప ఆదర్శాలున్న అక్కమహాదేవి వేరే ఇంకేమైనా ఆశించి ఉంటే– ఈ అత్యున్నతమైన ఆదర్శం ఎలా ఈడేరేది?

"కళ్ళతో చూడలేనని చీకట్లోకి వెళ్ళడం ఎలాంటిదయ్యా?
కొండ చివరన దిగాలని ఎక్కడో
గుంటలలో కాల్వలలో దిగితే ఎలాగయ్య
నీవిచ్చిన మధుర దానాన్ని తీసుకోక
వేరే దాన్ని కోరితే ఎలాగయ్యా!
చెన్నమల్లికార్జునుని మహిమను తెలిసేందుకు
వివాదానికి పాల్పడితే ఎలాగయ్యా!

వివాదాల కోసం మహాదేవి అసలు పుట్టనేలేదు. అన్నిటా, అంతటా చన్నమల్లి కార్జుననే దర్శించి, రాత్రింబగళ్ళు అతని విశ్వపూజలోనే లీనమైపోయిందామె!

"దృశ్యుడైన రవి వెలుగు, ఆకాశపు విస్తీర్ణం
గాలి చలనం, తరుగుల్మలతాదుల్లోని లేత పుష్పాదులు
ఆకులలములన్నీ పగటి పూజ;
చంద్రుని వెన్నెల, నక్షత్రాలు, అగ్ని
విద్యుత్తు మున్నగునవి కాంతిమయ మైనవన్నీ రాత్రి పూజ !
రాత్రింబగళ్ళు నీపూజలో
నన్ను నేను మరిచానయ్యా! చెన్నమల్లికార్జునా!

సౌందర్యానికి నిలయమైన మలెనాడులోని రమ్యప్రకృతిలో కళ్ళు తెరిచిన మహాదేవి మహాచైతన్యం భూమ్యాకాశాల పొడవున, వెడల్పులో విస్తరించి వాటితో అర్థపూర్ణమైన స్నేహాన్ని పొంది, అంతరంగపు అనంతవికాసానికి ప్రాకులాడుతున్నందుకు నిదర్శనం ఈ వచనం. ఇందులో వ్యక్తీకరించబడిన ప్రకృతి చైతన్యం, భూమ్యాకాశాలకు వ్యాపించిన బృహద్దర్శనం, విశ్వపూజకు సంబంధించిన చింతనలు ముమ్ముందు పరిపూర్ణంగా ప్రకాశించాయి. శ్రీశైల మార్గంలో ప్రాణవంతమైన వర్ణన ఈ వచనంలో

**"వనమంతా నీవే**
**వనంలోని దేవవృక్షాలన్నీ నీవే**
**తరువులో ఆడుకునే ఖగాలు**
**మృగాలన్నీ నీవే**
**చెన్నమల్లికార్జున, సర్వభరితుడవై**
**నాకు ముఖం చూపించు"**

పోలికలివ్వడంలో, సాదృశ్యాన్ని సామెతల్ని ఒదిగించడంలో మాత్రమే మిగిలిన వచనకారుల్లో కన్పించీ కన్పించకుండా ఉండే ప్రకృతి అక్క వచనాల్లో స్వేచ్ఛగా ప్రవేశించడం ఆమె పుట్టి పెరిగిన సుందర ప్రదేశానికి లభించిన గౌరవమై ఉంది. అది అక్క బృహత్తరానుభూతికి సాక్ష్యంగా ఉంది. ఇలాంటి ఆత్మ, వివాదాలకు అంగీకరిస్తుందని భావించిన వాళ్ళే భ్రాంతులు అని చాలా తొందరగా నిరూపించబడింది, అక్క వివాహ సందర్భంలో!

అక్క ఏమో తనను తాను దేవునికి అర్పించుకుంది. తన ఆదర్శపతికి తన్ను అర్పించుకుంది. అయితే దాన్ని రాగ ద్వేష భరిత సమాజం అంత త్వరగా అంగీకరిస్తుందా? ఇటు ఒక ఆడశిశువు జన్మించినంతనే దానికి తగిన మగశిశువు ఎక్కడో ఇప్పటికే పుట్టి ఉండాలని విశ్వసించిన సమాజం, దేవుడితో





నా పెళ్లి అయిందని మహాదేవి చెప్పినంతనే అంగీకరిస్తుందా? కన్పించని దేవునితో కన్పించే కన్యక వివాహం ఎక్కడైనా ఉంటుందా?

అక్కమహాదేవి చూడడానికి సౌందర్యాధిదేవతలా ఉండింది. ఆ అక్క రూపాతిశయం ఎలాంటిదో తెలుసుకునేందుకు మనం మళ్ళీ హరిహరుణ్ణి శరణువేడాలి. అక్కగారి 'సాహిత్య భూషణు'లు అనిపించుకున్న తల్లి దండ్రులకు ఈ కన్య వయః సంధికాలం చాలా ఆశ్చర్యకరం, నవీనం! ఇది ఏ దేవుని చిత్తాన్ని ఆకర్షిస్తుందో ఏమోనని చూసి చూసి చూడడం చేతకాక, గగనాంగన శరత్కాల మేఘాల చాటున చంద్రకళను సాకినట్లు ధవళారవిందం (తెల్ల తామర) కాకుండా కాపాడేవారట! అయినా అగ్నిపరీక్షాకాలం రానే వచ్చింది.

ఇటు ఉత్తరోత్తరలావణ్య రసభరితాలైన సుకుమారావయవాలతో, విలాసంగా విరాజిల్లుతూ, కదలని అద్భుతసుఖంలా, చెక్కు చెదరని మనోరథంలా, ఒక చోట కూడిన అమృతంలా, ముద్రించబడిన పుణ్యంలా, రూపుదాల్చిన భక్తిలా, పరిపక్వమైన పూజలా, వసంతుని వశీకరణంలా, వరలక్ష్మి సౌభాగ్యంలా, మలయానిల మదంలా ఉన్న మహాదేవి వసంతమాసంలో ఒక రోజు నివాసంలో వేదికాస్తంభాల నడుమ పెట్టబడిన స్వర్ణపీఠం పై కూర్చుని చెలికత్తెలచే ప్రశంసింపబడుతూ ఉండింది.

కర్మధర్మసంయోగం కొద్దీ ఆ సమయానికి వ్యాహ్యాళి నుండి వెనుదిరిగిన ఊరిదొర కౌశికుడు అదే మార్గంలో వచ్చి "మహాదేవిని చూచి ఓడిపోనివాడెవడు, నిలిచిపోనివాడెవడు, మదం అణగని వాడెవడు - ఎవడున్నాడు?" అన్న పొగడ్తను పొందిన మహాదేవిని చూచాడు. "చూచి, ఆమె శరీరం చూచి, నడక చూచి, అలా చూస్తూంటే - చూస్తుంటే చూడ చూడగా విచిత్రమౌతున్నట్లు" గా చూచాడు. తన పైన పడిన చూపు అని గ్రహించని మహదేవి... ఆ రాజు కౌశికుని మనసును తీసుకునిపోకుండా నివాసంలోనే ప్రవేశించింది.

మహాదేవి కౌశికుల పెళ్ళి అయిందా? కాలేదా? అనేది ఇంతవరకూ చిక్కు వీడని సమస్య. ప్రాచీనుల్లో హరిహరుడు తన మహాదేవి అక్కన రగళె (స్థలం 4 చరణం 88-110) లోనూ, చన్న బసవాంకుడు తన మహాదేవి అక్క పురాణం (స్థల 23) లోనూ, కెంచవీరణ్ణొడెయరు తమ శూన్య సంపాదన (మై.ఓ.లై, కె.ఎ.006 పూట 192) లోనూ పెళ్ళయిందని చెప్పారు. పెళ్ళి కాలేదని చెప్పిన వాళ్ళు చామరసుడు (ప్రభులింగ లీలె; గతి 10) విరూపాక్ష పండితుడు (చెన్న బసవ పురాణ సం. 57; ప 63), ఎళందూర హరీశ్వరుడు (ప్రభుదేవర పురాణం, సం : 8: ప 64-65) గుబ్బియ మల్లణార్యుడు (గణ భాషితరత్నమాలె) హాలగెయ దేవరు (శూన్యసంపాదనె) గూళూర సిద్ధ వీరణ్ణొడెయరు (శూన్యసంపాదను) మున్నగు వారు.

ఇది స్థూలమైన వర్గీకరణం. వీరి వివరాల్లో అభిప్రాయ భేదాలు లేవు. ఉదాహరణకు హరిహరుని ప్రకారం రాజు కౌశికుడు కోరినంతనే అతనిని పెళ్ళాడమని మహాదేవిని ఆమె తల్లిదండ్రులు చెబుతారు. అయితే చెన్న బసవాంకుని ప్రకారం తల్లిదండ్రులు దీనికి అంగీకరించరు. హరిహరుడు చెప్పినట్లుగా మహాదేవి వివాహానికి అంగీకరించనప్పుడు కోపించిన కౌశికుడు మహాదేవి తల్లిదండ్రులకు మరణదండన విధిస్తాడు. చెన్న బసవాంకుడు తమ కూతురిని ఇవ్వడానికి అంగీకరించని మహాదేవి తల్లిదండ్రుల్ని కౌశికుడు హింసించనారంభించాడని చెబుతాడు. హరిహరుడు రాసినట్లుగా శివభక్తుల్ని, తన తల్లిదండ్రుల్ని రక్షించడం తన కర్తవ్యం అని భావించి మహాదేవి మూడు షరతులతో వివాహానికి అంగీకరిస్తుంది. చెన్న బసవాంకుడు రాసిన ప్రకారం తల్లిదండ్రులకు ఏర్పడే హింసను తొలగించేందుకు రాజునుంచి లిఖితమైన వచనాన్ని పొంది పెళ్ళికి అంగీకరిస్తుంది.

హరిహరుని ప్రకారం పెళ్ళి అయిన తర్వాత మహాదేవి కౌశికునితో విషయ





సంసారం నడుపుతూ అతడు మూడు నియమాల్ని ఉల్లంఘించినంతనే మహాదేవి అతణ్ణి విడిచిపెడుతుంది. చెన్నబసవాంకుని ప్రకారం పెళ్ళయ్యాక రాజ్యాధికారమంతా మహాదేవి చేతికి చిక్కుతాయి. అక్క రాజభవనంలో రతిసుఖానికి అవకాశమివ్వకుండా నివసిస్తుంది. రాజు మూడు తప్పులు చేసినంతనే అతణ్ణి వదలి వేస్తుంది.

ఇక పెళ్ళి జరగనేలేదని చెప్పే వారి వివరాల్లో ఉన్న వైవిధ్యాన్ని గమనించాలి. చామరసుని ప్రకారం కౌశికుడు స్వయంగా మహాదేవి అక్క ఇంటికి వచ్చి "నీ కోరికను అంగీకరిస్తాను; నీ అంగీకారం లేకుండా రాజ్యాధికారబలంతో బలాత్కారం చేయను. ఇది సత్యం" అని ప్రమాణం చేసి చెబుతాడు. దానికి మహాదేవి "నేను చెప్పిన ఏ మాటనైనా వినని తక్షణం నిన్ను విడిచి పెట్టి వెళతా" అని చెబుతుంది. దీనికి కౌశికుడు అంగీకరిస్తాడు. అప్పుడు మహాదేవి తన చెలికత్తెలతో రాజమందిరానికి వెళుతుంది. పెళ్ళి ప్రసక్తే లేదు. అక్కడ ఏకాంతంలో కామాతురుడైన కౌశికుడు మహాదేవిని కౌగిలించుకోబోతాడు. మహాదేవి జరిగి, నిలిచి, "నీవు మాట ఇచ్చినట్లు మొదట నా కోరిక తీర్చు; తర్వాత నన్ను స్పర్శించు" అని అంటుంది. కౌశికుడు ప్రక్కకు జరిగి నిలబడి "నీ కోరిక ఏమిటి?" అని అడుగుతాడు. "నీవు శివభక్తుడవైతే నీతో పెళ్ళి. లేకుంటే సాధ్య లేదు" అంటుంది – మహాదేవి. దీనికి "నీకు శివభక్తి చేసేందుకు సమయం దొరకదు" అని కౌశికుడు ఖచ్చితంగా చెబుతాడు. అపుడు "అలాగైతే నాకు, నీకు వివాహం పొసగదు" అని అక్కమహాదేవి అంతే నిష్ఠూరంగా చెబుతుంది. తన దారిన తాను వెళుతుంది.

ఎళందూర హరీశ్వరుని ప్రభుదేవర పురాణంలో దాదాపు ఇవే వివరాలు ఉన్నాయి. విరూపాక్షపండితుని చెన్నబసవపురాణం నుండి "కౌశికుని చేపట్టనిచ్చగించక తిరస్కరించి కౌశికుణ్ణి" అనే వివరాలు దొరుకుతున్నాయి.

శివగణప్రసాది మహాదేవయ్యగారి, గుమ్మళాపురం సిద్ధ లింగదేవర గారి శూన్యసంపాదనె గ్రంథాల్లో మహాదేవి భవిసాంగత్యాన్ని విడిచి లింగసాంగత్యం చేసిందన్న అంశం మాత్రం వ్యక్తమైంది. అదే గూళూరు సిద్ధవీరణార్యుని శూన్యసంపాదనలో "లింగధారణం చేయనని చెప్పిన భవిని కలవక, అతడితో శరీరసాంగత్యమును వదల లింగ సంగమంలో నిరంతరం నిమగ్నురాలై "అని ఉల్లేఖించబడింది.

ప్రాచీన విద్వాంసుల్లోలాగే ఆధునిక విద్యాంసుల్లో కూడ మహాదేవి పెళ్ళి విషయంలో అభిప్రాయ భేదాలున్నాయి. ఈ మత భేదాలకు అక్కగారి వచనాల్లోనూ మనకు ఆంతరంగికమైన ఆధారాలు లభిస్తున్నాయి.

"ఎనుముకు ఒక చింత సమగారునికి ఒక చింత
ధర్మికొక చింత కర్మికొక చింత;
నాకు నా చింత, తనకు తన కామం చింత
వద్దు వెళ్ళు నా చెరగును వదులు
నాకు చన్న మల్లికార్జున దేవుడు
వలచునో వలచడో అన్న చింత"

"లోపల భర్త అమ్మా, బయట మిండగాడమ్మా
ఇద్దరినీ నడిపించడం కుదరదమ్మా!"

ఇలాంటి ఒకటి రెండు వచనాలో పెళ్ళి జరిగిందని తర్కించేందుకు అవకాశం దొరుకుతూంటే -

"చావు లేని కీడులేని రూపంలేని
అందగాణ్ణి నేను వలచానమ్మ!
సాటిలేని, అంతులేని, అనికేతనుడైన, గుర్తులేని
అందగాణ్ణి నేను వలచానమ్మ!





భవం లేని, భయంలేని అందగాణ్ణి వలచాను
కులసీమలు లేని నిస్సీముడైన అందగాణ్ణి
నేను వలచానమ్మ
ఇదేకారణం, చెన్నమల్లికార్జునుడే
నా అందాల మొగుడు
చనిపోయే, కుళ్ళిపోయే ఈ
భర్తలందరినీ పొయ్యిలోకి తోసేయ్ తల్లీ"

"ఇహలోకంలో ఒక భర్తా?
పరలోకానికొక పతియా?
నా పతి చెన్నమల్లికార్జునుణ్ణి మినహాయిస్తే
మిగతా భర్తలంత మబ్బుల
చాటున ఉండే బొమ్మల్లాంటి వాళ్ళు"

ఇలాంటి వచనాల్లో, తన తల్లితో చెప్పిన మాటల్లో... క్రింది వచనంలో పెళ్ళి అయి ఉండదనే నిర్ణయానికి రావడానికి ఆధారం లభిస్తుంది.

'ఇంటి ఇంటిలో మగవాళ్లను చూసి అనుభవించేందుకు
నా మనస్సు ఒప్పదు - నామనస్సు ఒక చోట నిలువదు
అమ్మా! నీవు మాయలో పడ్డావా?
నా దేవుడు చెన్నమల్లికార్జునయ్యను
ప్రేమించి ఒక్కసారిగా వశీకృతురాలనయ్యాను.
నీ తాయెత్తు నా కక్కరలేదు పోరా?'

పెళ్ళైనా మహాదేవి గౌరవానికి కొరత లేదు; పెళ్ళి కాకున్నా ఆమె గరిమకు కొదవ లేదు; ఇక్కడ గమనించాల్సిన అంశం ఒకటుంది :

"పురుషుని ఎదుట మాయ స్త్రీ అనే అభిమానమై పీడిస్తుంది.
స్త్రీ ముందు మాయ పురుషుడనే అభిమానమై పీడిస్తుంది "

అని అక్క చాటింది. ఉడుతడిలో పుట్టిన అక్కమహాదేవి ఎదుట మాయ కౌశికుడనే పురుషుని అభిమానమై పీడించింది. దగ్గరలోని తీగలోంచి పుట్టిన అల్లమ ప్రభువు ఎదుట మాయ కామలత మాయాదేవి అనే స్త్రీ అభిమానంగా పీడించింది. ఇద్దరూ ఈ మాయకు వశం కాకుండా మాయా కోలాహలు రయ్యారు. ఇది లోకంలోని వారికి విచిత్రమని అనిపించి ఉండవచ్చు. దీనికి అక్కగారి ఈ వచనంలోనే సమాధానం సిద్ధంగా ఉంది.

"లోకమనే మాయకు శరణుల చారిత్ర్యం వ్యర్థంగా గోచరిస్తుంది. చన్నమల్లికార్జునుడు వలచిన శరణునికి మాయలేదు, మరుపు లేదు, అభిమానమూ లేదు!"

పుట్టిన ఊరిని, పుట్టిన ఇంటిని, కన్న తల్లిదండ్రుల్ని, తనంతట తానే లభించిన కౌశికుని సిరిసంపదల్ని, అన్నిటినీ వదలి ఎక్కడికి వెళ్ళింది అక్క మహాదేవి? నేరుగా శ్రీశైలానికి వెళ్ళిందని అంటాడు హరిహరుడు. కల్యాణంలో, అనుభవమంటపంలో- అక్కడ జరిగిన అల్లమ ప్రభువు - అక్క మహాదేవి గారల వాదవివాదాల గురించి అతడు ప్రస్తావించడు. బహుశః మరొక రగళెను రచించేందుకు ఆతురపడే అతడు అక్కను ఉడుతడి నుండి ఒక్కసారిగా శ్రీశైలానికి పంపిస్తాడు. అటు అక్కమహా దేవి వెళ్ళిపోగా, ఇటు కామపీడను సహించలేక దొంగ భక్తుడి వేషం ధరించి, తనలాంటి భక్తులు నలుగురితో కూడి, బయలుదేరి శ్రీశైలంలో మహాదేవిని చూసి "నేను భక్తుడనయ్యాను మహాదేవి కరుణించు నన్ను, యుక్తి లేని ఈ సేవకుణ్ణి నన్ను కరుణించు" అని మరీమరీ వేడుకుంటాడు. దానికి అక్కమహాదేవి, "ఓరీ కౌశికా! వెళ్ళు, నీ వెందుకు, నాకెందుకు? చీకటి ఎక్కడ? వెలుగెక్కడ, అగ్ని ఎక్కడ? చలి ఎక్కడ?" అని పలికి చన్నమల్లికార్జునుని ధ్యానంలో లీనమైపోతుంది.





ఇక మిగతావాళ్ళంతా అక్క కల్యాణానికి వెళ్ళడాన్నే ఉల్లేఖించారు. హరిహరుడు, చామరసుడు మున్నగు వాళ్ళల్లో సమానాంశమేమిటమే - అక్క దిగంబరావస్థలో ఉడుతడి నుండి బయట పడడం. నేటికి శిష్టాచార విదూరమైందని అని పిస్తుంది. సంప్రదాయబద్ధులైన శరణులలో ప్రతిఘటనను కల్గించేది. అక్క దిగంబరత్వానికి ఆమె వచనాల్లో యోగాంగ త్రివిధిలో అసందిగ్ధమైన ఆధారాలు లభిస్తున్నాయి. వాటి కవి కల్పనలు అని అనేందుకు వీలు లేదు. "దిగంబరమే నాకు దివ్యాంబరం" అని నిర్భయంగా, నిస్సంకోచంగా చాటిన అక్క విప్లవాత్మకమైన మనోధర్మానికి మూలాధారమేది? ఇక్కడ ఈ క్రింది వచనం గమనించదగింది!

**"ఆడది ఆడదైనపుడు మగాడి సూతకం**
**మగాడు మగాడైనపుడు ఆడదాని సూతకం**
**మనస్సు సూతకం ఆరిపోయాక**
**శరీరసూతకం పోతుందా?**
**అయ్యా, ఆదిలేని సూతకానికి**
**ప్రపంచమంతా వశీకృతమైంది.**
**నా దేవుడు చెన్నమల్లికార్జునుడనే గర్వానికి -**
**జగమంతా స్త్రీ చూడు అయ్యా!**

ఆడం మరియు ఈవ్ మొదలుకుని ఇప్పటిదాకా మనం అంతా ఆది లేని సూతకానికి వశీభూతులమయ్యాం!

సభ్యత తన మూలంలో అసభ్యతను ఆరోపించడం కొత్తదేంకాదు. ఇది అలా ఉండనీ! శరణసతి, లింగపతి తత్త్వాన్ని అంగీకరించిన వాళ్ళల్లోనైనా ఈ స్త్రీ పురుషుల ఆది లేని సూతకం ఉండకూడదంతే! జ్ఞాపకముండనీ! "నా దేవుడు చన్నమల్లికార్జునుడనే దేవునికి ప్రపంచమంతా స్త్రీ చూడయ్యా !" పైగా-

"కప్పుకునే నూలు సరియా
సిగ్గుపడడం చూడు మగవాడు, స్త్రీ
అనే జాతి!
ప్రాణపతి నీవు జగత్తులో
అవకాశం లేని వేళ సిగ్గుపడడం ఉందా చెప్పు
చన్నమల్లికార్జున జగమంతా కన్నై చూస్తుండగా
ఇక దాపరికాలెందుకయ్యా?"

ఇదీ కాకుండ -

కళ్ళను త్రుంచి మమకారాల్ని కూల్చి
కాముని ముక్కు కోసి
చిరిగే బట్టల భవాన్ని గెలిచిన ఆమెకు
అంగం ఎక్కడుంది చెప్పు!"

"కుళ్ళిన శవంలా, కానరాని బొమ్మలా
నీళ్ళు ఇంకిన సరస్సులా, కాలిన పోగులా
మళ్ళీ వెనుదిరిగి చూడడమనేది ఉందా అన్న
మల్లికార్జునుడు శరీరమే లేనివాడే
ఆశ్రయమైన ఆమెకు ?"

అక్కగారి పరుంజవనంలోనే ఈ వచనాలన్నీ రచింపబడి ఉండవచ్చు. అయితే ఈ వచనాల్లో వ్యక్తం చేయబడిన ఆలోచనలు అక్క ఏ సాత్వికంతో, ఏ శక్తితో తయారైన వ్యక్తి అనే అంశాన్ని విశదీకరిస్తున్నాయి. మల్లికార్జునుణ్ణే పతిగా స్వీకరించే నిర్ణయం, కౌశికుడు లాంటి రాజునే నిరాకరించే నిశ్చయం, తల్లిదండ్రుల్ని, బంధువుల్ని వదలిపెట్టే నిర్ణయం, దిగంబరత్వాన్నే దివ్యాంబరంగా చేసుకునే నిర్ణయం - మానవచరిత్రలోనే అద్భుతమనిపించే ఈ నిర్ణయాలన్నిటినీ తీసుకునే వేళ అక్కలో ఉన్న ఈ ఇనుము లాంటి దృఢత్వం ముమ్మందు ఆమెకు





పరమశాంతి నందించే సువర్ణంగా మారిందని గ్రహించాం.

కొండపైన ఒక గృహం కట్టి
మృగాలకు భయపడితే ఎలాగయ్యా
సముద్రతీరంలో ఒక ఇల్లు కట్టి
అలలకు, నురగలకు భయపడితే ఎలాగయ్యా,
సంతలో ఒక ఇల్లు కట్టి
శబ్దానికి సిగ్గుపడితే ఎలాగయ్యా!
లోకంలో పుట్టాక
నిందాస్తుతులు ఎదురైతే
మనస్సులో కోపం నింపుకోక
శాంతిగా ఉండాలి!"

స్తుతికి చెందిన ఆశ, నిందలోని భయం ఇవి రెండూ చేయరాని పనుల్ని చేయిస్తాయి. అంతేకాక మంచిది చేయాలనే మానసిక నిర్ధారాన్ని కూడ సడలిస్తాయి. ఈ రెండింటికి మించిన సమాధాన స్థితికి చేరింది అక్క. అయినప్పటికీ ప్రజల విచిత్రమైన వాక్యాల్ని ఎవరాపగలరు? చెడు వాక్యాన్ని విని విని ఒక్కసారైనా చెడిపోని వారెవరు? అదీకాకుండ దుష్టుల్ని వదలి శిష్టుల్నే నిందకు, అవమానాలకు, మిథ్యారోపాలకు కారణ విహీనదూషణలకు, శీలనాశానికి బలిచేశాక ఒకింత చలించకుండా ఉండడం ఎలా సాధ్యం? ఒక్కోసారి మంచితనం ప్రదర్శించి ఇబ్బందుల పాలు కావడంకన్న దుష్టులతో, దుష్టులుగా ఉంటూ ఎందుకు సుఖించరాదు? అనే ఆలోచన మెదడులో మెదలక మానదు. ఎలాంటి వారి అంతరంగంలోనైనా! అలాంటి అగ్ని పరీక్షకు గురి అయిన వేళలో కూడ అక్క తన మనస్సును సంతృప్తి పరచుకున్న రీతి సజ్జనకులానికి శోభాయమానమైనది; సన్యాసి వర్గంలోనూ అపూర్వమైనది!

బెదరకు మనసాభయపడకు శరీరమా
నిజాన్ని తెలుసుకుని నిశ్చింతగా ఉండి
ఫలించే వృక్షాన్ని రాతిలో పెట్టేవాళ్ళు కోటి;
ఫలించని వృక్షాన్ని రక్షించేవారెవ్వరూ లేరు.
భక్తి ఉన్న వాళ్ళ నిందించేవారు ఒక కోటి
భక్తి లేనివాళ్ళను నిందించేవారొక్కరూ లేరు.
మీ శరణుల వాక్యాలే నాకు గతి.
సోపానం - చెన్నమల్లికార్జునా!

ఇది ఈ విశ్వం రీతి; లోకంలోని వాళ్ల నీతి. దుర్జనులకు మొదట నమస్కరించి సజ్జనుల్ని నిందించడం; ఏమీ చేయని వారి విషయంలో మౌనం వహించి, మంచి చేసేవారిలోనే లోపాల్ని వెదకడం, ఇలా నిష్కారణ నిందకు వివేకరహిత దోషారోపణకు బుద్ధిలేని చారిత్ర్యవధకు గురయ్యే లక్షలాది సజ్జనులకు సాంత్వన సందేశాన్ని అందించేది అక్కగారి ఈ అనుపమ వచనం.

దీన్ని బోధించి తృప్తి చెందలేదు. సాధించి చూపించింది అక్క. కళ్యాణం వైపు ప్రయాణం కొనసాగాక కాముకుల నుండి ఇబ్బదులు ఎదురయ్యాయి. ఆమె స్త్రీ అయినా ధైర్యం నిండిన మగధీర రూపం ఆమెది. ఆమె ఏమాత్రం అధైర్యపడలేదు. పాపదృష్టితో చూచినవారి గర్వం అణగిపోయేలా గర్జించింది.

చూసే కళ్ళకు రూపం అందంగా ఉండగా
మీరు మనసులో సిగ్గు పడకుండా వచ్చారన్నా !
విన్న స్తోత్రాల సొగసులకు మీరు వశీభూతులై వచ్చారన్నా !
నారి అనే రూపాన్ని ప్రేమించి మీరు వచ్చారన్న !
మూత్ర బిందువులు ప్రవహించే
నాళమని తెలుసుకోలేక బుద్ధి చెడి వచ్చారన్న !
బుద్ధి మాంద్యంతో పారమార్థిక సుఖాన్ని





నిర్మూలించుకుని ఇది ఏ కారణమో తెలుసుకోకుండా
మీరు నరకహేతువని తెలిసి మనసులో
అసహ్యించుకోకుండా వచ్చారన్న!
చన్నమల్లికార్జునుడు తప్ప
మిగతా పురుషులంతా నాకు సోదరులు
ఛీ! వెళ్ళండి పిచ్చివాళ్లల్లారా!

రాజ మందిరంలోని కౌశికుడు మొదలుకొని మామూలు దారినపోయే కామ పిశాచాలకు అందరికి ఒక్కటే కొరడా దెబ్బ కొట్టింది అక్క – 'పోండిరా పిచ్చి వాళ్ళల్లారా!'. చివరకు కళ్యాణం బయటి వలయంలో కిన్నరి బ్రహ్మయ్యకు ఇలాంటి అవస్థే వచ్చిందని కెంచవీరణ్ణొడెయరు రాసిన శూన్యసంపాదనె సూచిస్తోంది. వేరే శూన్యసంపాదనలలో "చన్న మల్లికార్జునుడు మన్మథుణ్ణి చంపి మనసిజుడుగా మిగలగా మనసిజుని తలవ్రాతనే తుడిచాడు" అని ఆత్మ విశ్వాసంతో చాటిన అక్క "కామసంహారి అనే అంశాన్ని ప్రమథులందరికీ ప్రత్యక్షంగా చూపించాలని" ప్రభుదేవులే కిన్నరయ్య గార్లను ఒప్పించి పంపించారని చెప్పబడింది. హరిహరుడైతేనో, "వచ్చిన కిన్నరి బొమ్మ తండ్రిని చూస్తూ, వచ్చినందుకు పాటను పాడుతూ" అని చెప్పి వారిద్దరి కలయిక ఆకస్మికమని సంకేతాలిలిస్తాడు. మొత్తానికి చెప్పాలంటే – ఉడుతడి నుండి కళ్యాణం దాకా సాగిన సుదీర్ఘమైన, ఆటంకాలతో కూడిన పయనంలో అక్క ప్రదర్శించిన ధైర్య స్థైర్యాలు, దౌర్జన్య దమన, దుష్ట మర్దన శక్తులు, అచంచల నిష్ఠ, శ్రమను సహించే గుణం – ఇవన్నీ అనిర్వచనీయమైనవి, అసమానమైనవి.'

చివరికోసారి కళ్యాణం ముందు నిలిచిన వేళ –

కళ్యాణ కైలాసమనే మాట సుందరం!
లోపలాకల్యాణం! బయటా కల్యాణం!

దీని రహస్యాన్ని ఎవరెరుగుదురయ్యా?
మా సత్యశరణుల జాడ తెలుస్తోందయ్యా!
మీ శరణుడు బసువణ్ణి చూస్తాననే
ఆశ నాలో కల్గింది విను చెన్నమల్లికార్జునా!

అనే మాటలు అక్క ముఖం నుండి తనంతట తానే విరజిమ్మాయి. ఆలస్యం చేయక, లోపలికి ప్రవేశించి ప్రమథనాయకుడైన బసవణ్ణ గారిని చూచే ఆతురత ఎక్కువైనా వివేకం హెచ్చరిస్తూ ఉండింది.

కళ్యాణానికి వెళ్లడం ఇంకెవరూ
చేయరాదు. అసాధ్యమయ్యా!
ఆశలు, వాంఛల్ని నియంత్రించకుండా
కళ్యాణం వైపు కాలుపెట్టడం సాధ్యం కాదు!
లోపల, వెలుపలా పరిశుద్ధులు
కాకుండా కళ్యాణానికి వెళ్లరాదు!
లోపలి జ్ఞానం పొంది చెన్నమల్లికార్జునుని వలచి,
ఉభయ లజ్జల్ని తొలగించుకున్నా
కళ్యాణాన్ని చూసి నమోనమో అని అంటున్నాను!-

కళ్యాణం గురించి ఎంతటి అనుపమానమైన కల్పన ఇది! అక్కగారి ఒక్కో వాక్యానికి తల వంచాలనిపిస్తోంది. అదంతా ఒక నూతనత్వం! అదంతా ఒక స్వచ్ఛత ! ఒక రకమైన తాజాతనం అక్క వాక్యాల్లో వెల్లుతున్నాయి.

'ఉభయలజ్జల్ని' తొలగించుకునే వచ్చినా, కిన్నరి బొమ్మయ్యతో వాగ్వాదంలో ఉత్తీర్ణురాలై వచ్చినా ప్రభుదేవుల పరీక్షకు గురికావడం అక్కగారికి తప్పలేదు. అనుభవ మంటపంలోనూ అక్క ఈ అగ్ని పరీక్షలో అపరంజిగా ప్రకాశించిందని ప్రస్తావిస్తే చాలనిపిస్తుంది. ఈ అగ్ని పరీక్షలో ఆమె విజయం పొందాక అనుభవమంటపమంతా ఏకగ్రీవంగా అక్కను ప్రశంసించింది.





అన్న రాజమందిరంలో నీలమ్మ గారి ముద్దుల కూతురు, బసవణ్ణ గారి మానస పుత్రిక, నిష్కలంక సద్గురు ప్రభుదేవుల నిజమైన కోడలు, చిక్కయ్య ప్రియసిద్ధ లింగయ్యకు సోదరి, చెన్నమల్లికార్జునుని భార్య అక్కమహాదేవి లింగ పతిత్వం, శరణసతిత్వ సాధన అనుకరణీయ రీతిలో సాగింది. ఇష్టలింగమే పతి అనే జ్ఞానం పొంది చక్కగా పాడింది.

అయ్యా, దూరంలో ఉన్నానని
నోరెండి బాధపడుతున్నానయ్యా నేను!
అయ్యా ఈ సారి నీవు వచ్చి నా కర
స్థలంలో ఆవిర్భవిస్తే
ఇక ఆ ఆసక్తి అంతా లింగమే !
అపుడు మీలో నెలకొంటాడు చూడయ్యా
చెన్నమల్లికార్జునుడు. మిమ్మల్ని నా
కరస్థలంలో తిలకించి తిలకించి
కన్నులే ప్రాణమై పోయానయ్యా!!

ఇక ముమ్ముందు చేతిలోని లింగాన్ని పూజిస్తూ... కళ్ళ చూపు, స్థిరమైన భావం, తనివి తీరని మోహం - అవకాశమే లేని... పూజ అనుకూలమైంది అక్కకు! లింగపతి ఇపుడు చాలా సమీపంలో; తన చేతిలోనే. అయినా ఎంత దూరం ఇంకా ! దీన్ని సహించడం ఎలా? అంతకు ముందు మల్లికార్జునుడు దూరంలో ఉన్నాడనే కారణమైనా ఉండింది. ఆ విరహాన్ని సహించడం ఎలా ఇప్పుడు?

"తాను దండు మండలానికి వెళ్ళాడంటే
నేను ఊరకుండను
తాను నా చేతిలో ఉండి;

నా మనసులో నిండి
మాటలాడకుంటే నేనెలా భరిస్తానమ్మా?

అని ఆక్రోశిస్తుంది అక్క. దీనికి లింగపతి జవాబివ్వకుంటే తన అంతరంగాన్ని శోధించుకుంటోంది; తన అంతరంగాన్నే అగ్ని పరీక్షకు గురిచేసుకుంటోంది; తన కోరికల్ని గుర్తించి బయటికి చెబుతోంది;

తనువు కరిగించని వాళ్ళ అభిషేకాన్ని
స్వీకరించవయ్యి నీవు!
మనసు కరగని పుష్పాన్ని వాళ్ళ
తీసుకోవయ్యి నీవు !
భక్తులు కానివారి నుండి గంధాక్షతల్ని
స్వీకరించవయ్యి నీవు !
జ్ఞానం వికసించని వారి నుండి
ఆరతిని గైకొనవయ్యి నీవు !
భావశుద్ధి లేనివారి నుండి
ధూపాన్ని స్వీకరించవయ్యి నీవు!
త్రికరణశుద్ధి లేని వారి నుండి
తాంబూలాన్ని స్వీకరించవయ్యి నీవు!
మార్పులు లేనివారి నుండి
నైవేద్యాన్ని స్వీకరించవయ్యి నీవు !
హృదయ కమలం వికసించని వారిలో
ఉండజాలవయ్యి నీవు!
నాలో ఏముందని కరస్థలంలో వ్యాపించియే చెప్ప
మల్లికార్జునా!

అపుడు, హరిహరుడు వర్ణించినట్లు "గురువా రావయ్య ! పరమతత్వమా రా ! వరమా రా! దేవదేవా! రా ! ఫలమా, ఫలరసమా! రసంలోని తీపి





సుఖమా రా" అని రకరకాలుగా పిలిచి మల్లికార్జునుడు మౌనంగా ఉండడంలోని రహస్యం తెలుస్తుంది అక్కకు! వారి ఆత్మనివేదన వెలువడుతోంది.

అష్టవిధార్చన చేసి మురిపించనా అయ్యా!
నీవు బహిరంగ వ్యవహారానికి
దూరంలో ఉన్నవాడివి.
అంతరంగంలో ధ్యానం చేసి నిన్ను
మురిపించనా అయ్యా
నీవు వాక్కుకు, మనస్సుకు గోచరించవు
జపస్తోత్రాలలో నిన్ను ప్రీతి గొలుపనా?
నీవు నాదాతీతుడివి !
భావజ్ఞానంతో నిన్ను వలపించనా అయ్యా!
నీవు బుద్ధికి అతీతుడివి!
హృదయ కమల మధ్యలో నిన్ను
స్థాపించుకోనా అయ్యా
నీవు సర్వాంగ పరిపూర్ణుడివి!
అయ్యా, నిన్ను మురిపించడం
నాకు సాధ్యం కాదు
నీవు ప్రేమించడం సుఖమయ్యి,
చెన్నమల్లి కార్జు నయ్య !'

"నీవు ప్రేమించడమే సుఖమయ్యా" అన్నదేమో సరి; అయితే ఇక్కడ సకామ భక్తి వాసనలు గోచరిస్తున్నాయికదా?

తనువులోని తాపత్రయానికి అడవిలోకి దూరాను
సంకోచించకుండ నా శరీరానికి అని వేడాను;
అవి ఇచ్చాయి తమ లింగానికని
నేను వేడి భవినయ్యాను.

వాళ్ళు ఇచ్చి భక్తులయ్యారు!
ఇక వేడుకుంటే - చన్నమల్లికార్జునయ్యా, నీ మీద ఒట్టు!

అని ఉడుతడి నుండి కళ్యాణానికి వచ్చేవేళలోనో, కళ్యాణం నుండి శ్రీశైలానికి వెళ్ళే సమయంలోనో పాడిన సకామభక్తికి మనసు పారేసుకుంటుందా? కాదు!

అయ్యా, నీవు వింటే విను! వినకుంటే మాను
నేను నీ గురించి పాడకుండ ఉండలేనయ్యా!
అయ్యా, నీవు మెచ్చుకుంటే మెచ్చుకో
మెచ్చకుంటే మాను
నేను నిన్ను కౌగిలించకుండా ఉండలేనయ్యా!
అయ్యా, నీవు చూస్తే చూడు! చూడకుంటే మాను
నేను నిన్ను చూసి, సంకోచించి,
శుభం కోరకుండా ఉండలేనయ్యా!
చెన్నమల్లికార్జునయ్యా!
నేను నిన్ను పూజించి సంతోషంతో ఉరకలేస్తానయ్యా!.

ఇక్కణ్ణించి ముందుకు:

నచ్చడం మనసుకు మీలో
మెచ్చడం మనసు మిమ్మల్ని
విజయం మనసుకు నీవే
పరాజయం మనసుకు నీవే
మనసు కరిగేది నీలో !
అలసిపోయేది మనసు నీలో
కరుగుతుంది మనసు నీలో!
బాధపడుతుంది మనసు నీలో! నా పంచేంద్రియాలు.
చెరకును త్రాగిన నీళ్ళల్లా
మీలో కలుస్తాయి చన్నమల్లికార్జునయ్యా !





ఇంకా ముందుకుసాగి -

తనువే రూపమయ్యాక నేనెవరికి చేస్తాను?
మనస్సు మీ రూపమయ్యాక నేనెవరిని స్మరిస్తాను?
ప్రాణం మీ రూపమయ్యాక
నేనెవరిని ఆరాధిస్తాను?
జ్ఞానమే మీ స్వరూపమయ్యాక
నేనెవరిని తెలుసుకుంటాను?
చెన్నమల్లికార్జునా!
మీలో మీరై మీ వల్ల మిమ్మల్ని
మరచిపోతానా అయ్యా!.

ఇక్కడికి

'చెన్నమల్లికార్జునుడు వచ్చాడని బట్టల్ని చూసి నోరెండిపోయే, 'ఆలస్యమైతే పేడగా మారే', 'రాకుంటే కరగి క్రుంగిపోయే' త్వరగా చూపించవయ్యా, బయటికి త్రోయకుంటారయ్యా' అనే.

'వినుము నా విన్నపాన్ని, లాలించునా విన్నపాన్ని, ఎందుకు నా మొర వినవా?" అని బాధపడే.

"బలవంతుని పగను త్రెంచ నా కరువు, నిరుపేద సర్వస్వము పోయినట్లయింది నీవు పీడించు చూడు నా కరువును ! నాకిది విధియా? చెప్పు తండ్రీ!" అని ప్రశ్నించే పరిస్థితి ముగిసింది.

"ఆసనం దాటి ఎగిరి శివలింగం కరస్థలానికి వచ్చి, ప్రజ్వలించి, ఫళ ఫళ వెలిగే కాంతిలో నిలిచి, శరీరం, మనస్సు లింగంపై దృష్టిని కేంద్రీకరించి, అద్భుత శివ సుఖంలో ఓలలాడుతూ సజ్జనసద్భక్తి రతితో జీవించి సిగ్గుచెడి నిన్ను తలచాను చెన్నమల్లికార్జునా!" అనే ఆత్మవిశ్వాసంతో కూడిన అవస్థ

కల్గింది; ఇక తన చరమగమ్యస్థానానికి వెళ్ళవచ్చు అనే భావన చిగురించింది.

"పరమసుఖ పరిణామంతో మనస్సు మేరలు దాటి నేను నిజాన్ని తెలుసుకునే రహస్యాన్ని తెలుపుమా మల్లికార్జునయ్య!" అని ప్రభుదేవుల్ని అడిగేసింది అక్క!

ఇక అక్కను ఆపడం ఎవరితరం కాదని గ్రహించిన ప్రభుదేవులు జవాబు ఇచ్చారు. "నేను – నీవు అనే ద్వంద్వాల మమకారాన్ని తొలగించుకుని తాను తానైన త్రికూటమనే మహాగిరి చివరి శిఖరంపై చూస్తే అక్కడ బయలు బట్టబయలవుతుంది చూడు! ఆ బయలును దాటితే త్రికూటగిరిలో ఒక కనిపించని కదళి ఉంది చూడు! కదళి అడుగున లోపలికి దూరి చూస్తే ధళధళ మని మెరిసే జ్యోతి ఉంటుంది విను! అక్కడికి నడు! తల్లి! గుహేశ్వర లింగంలో నీకు పరమపదవి కరతలామలకం అవుతుంది చూడు".

"'శ్రీశైలం' 'త్రికూటం' 'కదళీ'" అనే శబ్దాలు చెవులకు తాకినంతనే ఆమె పులకించింది అక్కమహాదేవి. ఆ పావన, రమ్య స్థలాల ఆకర్షణ విపరీతమైంది. 'కదళి పిలుపు త్వరగా త్వరగా' అక్క శరీరంలోని ప్రతి కణంలో కన్పించింది. అక్క అస్తిత్వంలోని ప్రతి అణువణువులో ప్రతిధ్వనించింది. కదళి ఆహ్వాన స్వరం!

అక్క ఇక బయలు దేరాలి ! బయల్దేరింది. అడ్డంగా ఉండాలని మనసులో అనుకున్నారు శరణులు. కాని వేరే మార్గం లేకుండింది. ప్రభువులే అనుమతించాక ఇక ఎవరేమి చేయగల్గుతారు?

అది ఒక కరుణ రసభరితమైన దృశ్యం. అక్క కళ్యాణాన్ని వదలి వెళ్ళే సన్నివేశం. ఉడుతడిని వదలి వెళ్ళే వేళ ఆమె తల్లి దండ్రులకు, స్నేహితురాండ్రకు దుఃఖముప్పొంగింది. కౌశికునిలో సహజంగా కామవ్యథ బాగా పెరిగింది.





ఇపుడు కళ్యాణంలోని శరణులు, శరణ సతులంతా కన్నీళ్ళు నిండిన కళ్ళతో స్తబ్ధంగా నిలిచారు. ఆమె నిష్క్రమణను మూక విస్మితులై చూస్తూ నిలిచారు. ఎవరూ మాట్లాడే స్థితిలో లేరు. అక్కకు కూడ విషాదం ఉప్పొంగింది. "అయ్యా! మీలాంటి మహనీయుల సాంగత్యమహిమను దేనితోను పోల్చలేం! అయ్యా, మీలాంటి వాళ్ళను కలిసి, విడిపోవడం కన్న చావడమే శ్రేష్ఠం! అయ్యా, చెన్నమల్లికార్జునయ్య! నీ వాస్తవాల్ని తెలుసుకున్న మహాపురుషుల్ని వదలి ఉండ లేనయ్యా' అని బిగ్గరగా రోదిస్తూ ఎన్నటికీ మరచిపోని రెండు వచనాల్ని చెప్పింది.

"శరీరం లేని, మాటలేలేని, అంతేలేని
స్వామిని కలిసి సుఖవంతురాలినయ్యా
భాష ఏ మాత్రమూ పనిచేయదు.
ఇంకో దానికి అలమటించనయ్యా
ఆశపడను మళ్ళీ వేరే సుఖానికి!
వికసించింది మూడై మూడు వికసించి రెండై
రెండు కరిగి ఒకటిగా నిలిచిండయ్యా!
బసవణ్ణ మొదలగు శరణలకు దండాలు!
ప్రభువువల్ల కృతకృత్యురాలినయ్యా
నేను నీశిశువుననే విషయం మరచిపోలేను
చెన్నమల్లికార్జునుణ్ణి నన్ను
కలుపుకోమని వేడుకుంటున్నా"

చుట్టూ వ్యాపించిన నిశ్శబ్దాన్ని కెలుకుతున్నాయి కన్నీటి బిందువులు మాత్రం. అపుడు ఎవరు మాట్లాడాలి? వాచాలుణ్ణి మూగవాడుగా చేసే, స్తంభింపజేసే సన్నివేశమది! అక్క తన ఆత్మకథను విన్పించింది.

జన్మించితి శ్రీ గురువు హస్తంలో;
అనేకుల కరుణతో పెరిగాను;
భావమనే పాలు, సుజ్ఞానమనే నెయ్యి,
పరమార్థమనే చక్కెరను కలిపారు చూడు
ఇలాంటి త్రివిధామృతాన్ని పోసి
నన్ను చక్కగా పోషించారు.
వివాహం చేశారు: సరియైన మొగుడికి ఇచ్చారు;
మెట్టింటికి పంపించాలని అసంఖ్యాకంగా
అందరూ వచ్చారు కలిసి
బసవ మెచ్చుకునేందుకు నేను విప్లవం చేస్తా;
చెన్నమల్లికార్జునుని చేయి బట్టి
నీ నెత్తిపై పుష్పాలు పెడతా గడ్డి కాదు !
వినుము. మా పాదాల వద్ద
అందరూ వస్తారు శరణు శరణార్థి!

అక్క కళ్యాణం మరియు శ్రీశైలాల ఆకర్షణకు చిక్కి భారంగా ఒక్కొక్క అడుగువేస్తూ వెళుతుండగా, అప్పటిదాకా నియంత్రించుకున్న శరణులు, శరణస్త్రీల దుఃఖం ఒక్కసారిగా ఉబికింది. అక్క కన్పించే దాకా మౌనంగా నిలిచి ఉన్న వారంతా అక్క అదృశ్యమయ్యేసరికి వెక్కివెక్కి ఏడుస్తూ వెనుదిరిగారు. వారి స్మృతివనంలో అక్క ఆశ్వాసన ఒక భ్రమరగీతమై మంజుళంగా ప్రతిధ్వనించ సాగింది. "మీ శిరస్సుపై పుష్పాలు ఉంచుతా. గడ్డిపోచలుంచను...పూలు తెస్తా, గడ్డి తీసుకురాను ... పూలు తెస్తా, గడ్డి తీసుకురాను...

శ్రీశైల మార్గంలో పులకింతల పంట పండిస్తూ అక్క బయలుదేరింది చాలా అవసరంలో... అదేలనో అంతటి అవసరం! తొందర?





ఆకలీ నువ్వు ఆగు ఆగు !
దప్పికా! నీవు ఆగు ఆగు !
నిద్రా ! నీవు ఆగు ఆగు !
కామమా! నీవు ఆగు ఆగు !
మోహమా ! నీవు ఆగు ఆగు !
మదమా! నీవు ఆగు ఆగు !
మత్సరమా! నీవు ఆగు ఆగు !
సచరాచరమా! నీవు ఆగు ! ఆగు !
నేను చెన్నమల్లికార్జున దేవుని
అవసరమైన సందేశాన్ని
తీసుకు వెళుతున్నా ! శరణు శరణార్థి!"

అటు శరణులకు, శరణస్త్రీలకు వందనాలు. ఇటు అరిషడ్వర్గాలకు, చరాచరానికి వందనాలు. ఎవరినీ చూసేందుకు, పలకరించేందుకు సమయం లేదు. చాలా అవసరమైన ఉత్తరం చాలా మహిమాన్వితం. ఇవి చివరిగా సమర్పించాల్సిన ఉత్తరం ! దీన్ని వీలైనంత త్వరగా సమర్పించాలి మల్లికార్జునునికి ! వీలైనంత త్వరగా ఇది అంగీకృతం కావాలి!.

మళ్ళీ దారిలో ఎన్నో అగ్నిదివ్యాలు! అయితే అక్కగారిలోని చిచ్చు అచలం(పర్వతం) లా నిశ్చలం ! పర్వతం అనేది భూకంపమో లేదా జ్వాలాముఖి వచ్చినప్పుడో అల్లాడవచ్చు. అక్క ధైర్యం పర్వతం కన్న నిశ్చలం; వజ్రం కన్న కఠోరం! ఈ వచనాల్ని చదివి అక్కకు వచ్చి ఉన్న అగ్ని పరీక్ష లెలాంటివో ఊహించుకోవచ్చు.

"ఎవరూ లేనిదని ఆర్తనాదం చేయడం వద్దయ్యా
ఏం చేసినా నేను భయపడే దాన్ని కాదు!
తరంగాలపై నేనున్నాను

నిప్పులపై ఒరిగి నేనున్నాను!
చన్న మల్లికార్జునుడు నాకు
పిలుపు నివ్వకుంటే -
శరీరాన్ని, ప్రాణాన్ని మీ కర్పించి
శుద్ధురాలౌతాను.!"

"నిప్పులు నా మీద విరజిమ్మితే
ఆకలి దప్పులు అణగిపోయాయని అనుకుంటా!
ఆకాశం విరిగి మీద పడితే
నాకు స్నానం చేయించారంటా!
కొండ నాపై పడితే నాకు పూవు
వచ్చిపడిందనుకుంటా!
చెన్నమల్లికార్జునయ్యా
తల తెగి క్రింద పడితే
ప్రాణాల్ని నీకర్పిస్తానంటా!

సమర్పణకు సిద్ధమై బయలుదేరిన అక్క మానవులందించే కష్టనష్టాలకు, ప్రకృతి సంక్షోభాలకు భయపడుతుందా? బెదురుతుందా? ప్రపంచమే ఆశ్చర్య పడే విధంగా కష్టాలమయమైన ప్రయాణాన్ని కొనసాగించింది.

ఇప్పుడు అక్క శ్రీశైల సోపానాల్ని ఎక్కుతోంది. అక్కడ "వనమంతా కల్పతరువు, వృక్షాలన్నీ ఓషధులు, శిలలన్నీ స్పర్శమణులు, నేల అంతా అవిముక్త క్షేత్రం, జలమంతా నిర్ఝరామృతం, మృగాలన్నీ పురుష మృగం, కన్పించే రాళ్ళన్నీ చింతామణి అక్కగారి కళ్ళకు! ఇలాంటి 'చెన్న మల్లికార్జునునికి ప్రీతిపాత్రమైన శ్రీశైలాన్ని చుట్టి చూస్తూ వచ్చి "కదళీవనాన్ని చూస్తుంది". మూలద్వారం వేరును తాకి, భూమండలాన్ని ఎక్కిన, ఆచారాల మూలాన్ని పట్టుకొని ఐక్యాల అంచును చూసిన వైరాగ్యాల సోపానం నుండి శ్రీశైలాన్ని అధిరోహించిన మల్లికార్జునుని





మనస్సు గెల్చుకున్న అక్క మహాదేవి! అక్క శ్రీశైలాన్ని అధిరోహించడం మానవునిలోని ఊర్ధ్వ గమనాభిలాషకు ప్రతీకగా నిలిచిపోయే మహత్తర సంఘటన!

కదళీవనాన్ని చూసినంతనే తన్ను తాను మరచిపోయింది అక్కమహాదేవి. 'కదళీ" అనేది ఒక అద్భుత సంకేతంగా కన్పించింది అక్కకు.

"కదళి అనేది శరీరం
కదళి అనేది మనస్సు
కదళి అనేది విషయాలు
కదళి అంటే సంసారమనే ఘోరారణ్యం!
కదళి అనే దాన్ని గెలిచి తాను బ్రతికి వచ్చి
కదళీవనంలో శివుణ్ణి చూశా !
భవాన్ని వీడి వచ్చిన కూతురని
కరుణతో పట్టి బిగుతుగా
కౌగిలించుకుంటే -
చన్నమల్లికార్జునుని
హృదయంలో అమరిపోతాను"

తనువు, మనస్సు, విషయాలు, సంసార ఘోరారణ్యాల కదళిని జయించి కదళీ వనంలో శివుణ్ణి కలిసింది. "బసవణ్ణ భక్తి, చన్న బసవణ్ణ జ్ఞానం, మడివాళయ్య నిష్ఠ, ప్రభుదేవుని జంగమస్థలం, అజగణ్ణ ఐక్యస్థలం, నిజగుణుని ఆరూఢ స్థలం, సిద్ధరామయ్య సమాధి స్థలం" మొదలైన వారి కరుణ ప్రసాదాన్ని పొంది పరమపావనురాలైన అక్కమహాదేవి! ఈ పరమగతిని అక్క అంత సులభంగా సంపాదించ లేదు.

బసవణ్ణ ఇంట్లోని కూతురుగా బ్రతికాను
తన కరుణ భక్తి ప్రసాదాన్ని ఇచ్చాడు!

చన్న బసవణ్ణ పెంపుడు కూతురైన కారణంగా
అన్న ప్రసాదాన్ని ఇచ్చాడు!
ప్రభుదేవుల ముద్దుల పెంపుడు కూతురు
అయిన కారణంగా,
జ్ఞానప్రసాదాన్ని ఇచ్చాడు !
సిద్ధరామయ్య శిశువుకావడం వల్ల
ప్రాణప్రసాదాన్ని సిద్ధింపజేశాడు.
మడివాళయ్య ఇంటి కూతురైన కారణంగా
నిర్మల ప్రసాదాన్ని నిశ్చయించి ఇచ్చాడు.
ఇలా అనేక గణాలంతా
మా కరుణ శిశువని తలనిమిరిన కారణంగా
చన్నమల్లికార్జునుని శ్రీ ప్రసాదానికీ
యోగ్యురాలయ్యాను!"

ఈ వచనంలో అక్కగారి వినయ విధేయతలు ప్రస్ఫుటమౌతున్నాయి. ఇంకొక ఆశ్చర్యకరమైన అంశం కొట్టు వచ్చినట్లు కన్పిస్తోంది. వ్యష్టి - సమష్టి సమన్వయానికి సంబంధించిన అపూర్వ ప్రయోగం వారి సమష్టి చైతన్యం. వ్యష్టి జీవితాన్ని ప్రభావింపజేసినట్లే వ్యష్టి చైతన్యం తన విశిష్ట వికాసాన్ని అంతే ప్రభావశాలిగా రూపొందించుకుంది. ఒక్కొక్క శరణునిది ఒక్కొక్క విశేష క్షేత్రం. భక్తి, జ్ఞానం, వైరాగ్య, కాయకం, ప్రసాదం, దాసోహం - మున్నగు రంగాలలో అందరూ తమ ఆసక్తికి, ప్రవృత్తికి అనుగుణంగా ఒక్కొక్క రంగాన్ని ఎన్నుకుని అందులో అత్యున్నతశిఖరాలకు చేరుకుని విఖ్యాతులయ్యారు.

అయితే భక్తి-జ్ఞాన-వైరాగ్యాలన్నిటిలో సమాన సిద్ధిని సాధించిన వ్యక్తులు చాలా తక్కువ. అలాంటి అపూర్వవ్యక్తుల్లో అక్కమహాదేవి అగ్రగణ్యురాలు. అలాగే ప్రభుదేవరు కూడ కామపు సిగ్గును కల్పితమని తొలగించె. జీవిత లజ్జకు





సంబంధించిన మోహాన్ని తొలగించి, మనసులోని సిగ్గుస్మృతుల్ని దహించి, భావకూటి నగ్నమని గ్రహించి "నామరహితమైన సరిహద్దులే లేని నిజ భక్తియే నిజశక్తిగా అంతరంగంలోని ప్రభ బహిరంగమంతా తానే అయింది". "తనువు గుణం లేకుండా పోయి, మహాకాంతియే తానైనాడు. తాను- అనే ద్వంద్వాన్ని తొలగించుకుని గుహేశ్వర లింగంలో స్వయం లింగమయ్యాడు".

అక్కగారి నిశ్చితాభిప్రాయాన్ని గమనించి ఆశ్చర్యంతో ఇలా అన్నారు.

అరచేతి లింగంలో
కళ్ల దృష్టియే స్వయంగా మారిన
ఉనికిని చూడు!
తన స్వానుభావోదయంతో
తనను తాను తెలుసుకున్న
నిజశక్తిని చూడు!
భిన్నం కాని జ్ఞానం, గౌరవాలమమకారాన్ని
మీరిన భావం తననుండి తానైంది!
మన గుహేశ్వర లింగంలో
మహాదేవి అక్క నిశ్చయానికి
నమోనమో అంటున్నా చూడు చెన్నబసవణ్ణా !

ప్రభుదేవుల ఈ పురస్కార పత్రికకు సంతకం చేయని వారెవరు?

# అసాధారణ సాధనలు

ప్రాతః స్మరణీయులైన దివంగత ఎం.ఆర్.శ్రీనివాసమూర్తి గారు అక్కమహాదేవి గారి అద్భుత సాధనను ప్రస్తావించారు. ఆడదాని స్వాతంత్ర్య సాధన, ఆడదాని గౌరవసాధన, అలాగే ఆడదాని పరమార్గసాధన- ఇవే ఆ మూడు సాధనలు.[1] వీటిలో ఒక్కొక్కటి మహత్తరమైన సాధన అనేది ఈ దేశ చరిత్ర ఎరిగిన వారికి స్పష్టంగా కప్పించే విషయం. అయినా స్వల్ప వివరణ అవసరమని అనిపించకపోదు.

ఈ దేశంలో ఎందుకు? ఏ దేశంలోనైనా స్త్రీకి స్వాతంత్ర్యం సులభంగా లభించలేదు. లభించిన చోట పూర్తిగా దక్కలేదు. ఇంకా పురుష ప్రధానంగానే మిగిలిన మానవసమాజంలో స్త్రీకి స్వాతంత్ర్యం అనవసరం అనే అభిప్రాయమే చాలా మందిలో మిగిలి ఉంది. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు.

ప్రవక్తలు పుట్టింది మాతృగర్భంలోనే అయినా ఆ ప్రవక్తలు రాసిన ధర్మశాస్త్రాలలో ఆడదానికి గౌరవస్థానం లేనే లేదు. మహాకవులు పుట్టింది ఆడదాని కడుపులోంచే! అయినా వారి కావ్యాల్లో ఆడదానికి అసమానమైన మానం! ఆదం అథః పతనానికి

1 అక్కమహాదేవి జీవితచరిత్ర స్త్రీకి గౌరవాన్ని అందించండం, స్వాతంత్యం అందించడం, పరమార్థ ప్రాప్తి – వీటికి సంబంధించిన ఉద్గ్రంథం ఎం.ఆర్.శ్రీ.

**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా**

ఈ శ్లోకం ప్రక్షిప్తం అయి ఉండాలనే సందేహం కల్గేందుకు గీతలోని 10వ అధ్యాయంలోని ఈ శ్లోకమే కారణం.

స్త్రీలలోని కీర్తి, మాంగల్యం, మాటల మాధుర్యం, స్మృతి, ధారణ, సహనం, ధైర్యం ఇవన్ని నేనే అని పరమాత్మే చెప్పిన వేళ స్త్రీలను శూద్రులుగా పాపయోనులుగా చిత్రించే శ్లోకం ప్రక్షిప్తం అనిపించదా?





ఈవ్ కారణురాలైందన్న కట్టుకథ వల్ల స్త్రీ పతనానికి కారణమన్న భ్రమ పురుషవర్గాన్ని ఆవరించింది.

ఎలాంటి ఎలాంటి వారో తాము జన్మించిన గర్భాన్ని, త్రాగిన స్తనాల్ని నీచమని భావించారు. ప్లేటో కూడ "నేను ఆడదానిగా పుట్టలేదు. మగవాడిగా జన్మించాను. దేవుడికి ధన్య వాదా"లని పురుషుల ఆధిక్యాన్నే ప్రతిపాదించారు. మహిళ దుర్గుణాల, అన్ని రకాల బలహీనతల, ప్రమాదాల ప్రతిరూపంగా చిత్రించారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానివెనుక ఒక ఆడది ఉంది అనే తీర్మానానికి వచ్చారు. ఫ్రెంచ్ భాషలో ఈ సామెత చాలా ప్రసిద్ధంగా ఉంది. స్త్రీ అనే దీపాన్ని పురుషశలభాలు ముట్టుకున్నా తప్పు శలభాలది కాదు, దీపానిదే అనే హాస్యాస్పద నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆమె జీవితంలోని ఏ ఘట్టంలోనూ స్వాతంత్ర్యానికి అర్హురాలు కాదని తీర్పిచ్చారు.

ఎందుకు? ఆమె పాపయోనుల, వైశ్యుల, శూద్రుల వరుసలో నిలబడాల్సిన వ్యక్తి. ప్రజలు గౌరవించే భగవద్గీతలోనే ఈ అర్థాన్ని బోధించే శ్లోకముండడం శోచనీయం–

**"మాం హి పార్థ వ్యపాశ్రిత్య**
**యే – పి స్యుః పాపయోనయః**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రా**
**తేపి యాంతి పరాంగతిమ్** (అధ్యాయం 9, శ్లోకం 32)

ఇది ప్రక్షిప్త శ్లోకమని ఎవరైనా చెబితే చాలా సంతోషం కల్గుతుంది.

ఇక్కడ స్త్రీకి స్వాతంత్ర్యం లేదు. స్వేచ్ఛ లేదు. మన ధర్మశాస్త్రాలన్నీ స్త్రీ ఏ వర్ణానికి చెందిందైనా ఆమె శూద్రురాలే అని ముక్తకంఠంతో చాటాయి.[1] పురుషుని గురించి రాసే వేళ అతని వర్ణం, స్థానం, పదవి వాటి గురించి వివరంగా రాశారు. ఆడదాని గురించి రాసే వేళ ఎలాంటి వివరణలు లేవు. అవసరం లేదనిపించింది. ఎందుకంటే స్త్రీ పుట్టుకతోనే శూద్రురాలు. పరాశరస్మృతి ప్రకారం స్త్రీ, శూద్రుల హత్యకు ఒకే రకమైన శిక్ష! వాళ్ళిద్దరికి భేదమేలేదు!

దీనికి అవకాశం కల్పించింది స్త్రీ ప్రాణియే కాదనేది. ఒక ఆభరణం ఆస్తి అని వాదించారు. ఆమె భర్త ఆస్తిలో ఒక భాగం మాత్రమే. బంగారం, వెండి, భూమి, పశువులు, దూడలలా ఆమె కూడ అతని ఐశ్వర్యంలోని ఒక అంశం. [2] అందువల్ల వేరే విలువైన వస్తువుల్లా ఆమెను కూడ తాకట్టు పెట్టవచ్చు. వడ్డీ ఎంత? ఆమె వెలలో 70 లో ఒక భాగం (అగ్ని పురాణం 25363-64)

ఈ వెలను నిర్ణయించడం ఎలా? నిర్ధారించడం చేసేదెవరు? తెలియదు!

మొత్తానికి ప్రాణమున్న జీవికాదామె! ఆమె ఒక ఆభరణం. ఈ ఆలోచన పురుష ప్రేరితమైనదే అయినా – ఈ ప్రతిపాదనను స్త్రీలంతా అక్షరాలా అంగీకరించేశారు! సంచయ హొన్నమ్మ చెప్పడం దీనికి సాక్షి:

"యజమాని చెప్పినట్లు వినడం కన్న వేరే అస్తిత్వం ఆభరణానికుందా?" లేదు. ఆభరణానికి యజమాని కన్న భిన్నమైన వ్యక్తిత్వం లేనే లేదు. యజమాని ఎక్కడ ఉండమంటే అక్కడ ఉండిపోవడమే ఆభరణం కర్తవ్యం!

స్త్రీ కోసం స్త్రీయే అంగీకరించిన మౌలిక దృక్పథమే ఇదైన వేళ ఆమె సమానత్వం, స్వాతంత్ర్యం, సమున్నత స్థానం, గౌరవం, సమానావకాశాలు, అత్యధిక బాధ్యతలు – మున్నగు వాటిని అడిగే ప్రశ్న అయినా ఎలా ఉద్భవిస్తుంది? ఒక వేళ ఉద్భవించినా దాన్ని మొలకగా ఉన్నప్పుడే త్రుంచేందుకు ధర్మ గ్రంథాలూ, ధర్మశాస్త్రాలు, పురాణాదులు సిద్ధంగా ఉన్నాయి. మహాభాతరంలోని శాంతిపర్వంలో చెప్పినట్లుగా రాజు ఆప్తులతో సమాలోచన చేసే స్థలానికి నిషేధించబడిన వాళ్ళెవరంటే దొంగలు, గూని ఉన్నవాళ్ళు, బక్క శరీరం కల్గినవాళ్ళు, కుంటి వాళ్ళు, గుడ్డివాళ్ళు, అజ్ఞానులు, మూర్ఖులు మరియు సుకుమారులు! ఎలాంటి వాళ్ళ పంక్తిలో స్త్రీలను చేర్చడం జరిగిందనే అంశాన్ని గమనిస్తే స్త్రీ హీన దీన స్థితి గురించి ఎక్కువ వివరణ అక్కర లేదనిపిస్తుంది. సమాజంలో స్త్రీలకు ఒక పదవినో, ఒక అధికారాన్ని జవాబ్దారీనో అందించడం అటు ఉంచండి! అలాంటి విషయాల చర్చ జరిగే వేళలో కూడ వీళ్ళుండరాదని నిషేధాజ్ఞను విధించారు మనువు, శుక్రాచార్యులు, చాణక్యుడు!





మాటల్లో 'మాతృదేవో భవ' అని బోధిస్తూ, స్త్రీలను పూజిస్తే దేవతలు సంచరిస్తారని చాటుతూ, స్త్రీ ఆదిశక్తి పరమేశ్వరికి ప్రతీక అని ప్రచారం చేస్తూ నిత్యజీవితంలో ఆమెను నరకంలో ఉంచిన మన వాళ్ళ న్యాయబుద్ధిని ఏమని వర్ణించాలో తెలియదు. అనేక ప్రదేశాల్లో అసురులు పీడించిన వేళలో వాళ్ళ సంహారానికి దేవతలంతా చేరి అమ్మవారిని ప్రార్థించినట్లు అనేక కథలు పురాణాల్లో ఉన్నాయి. అలాంటి కథల్ని చెబుతూ, జనని జన్మభూమి రెండూ స్వర్గంకన్న శ్రేష్ఠమని ఘోషిస్తూ ఉండే ప్రజలు నిత్యవ్యవహారంలో మాత్రం స్త్రీకి ఎలాంటి స్థానాన్ని, గౌరవాన్ని అందించలేదు. పైగా వీటికి ఆమె అనర్హురాలని కొన్ని ప్రతిబంధకాల్ని ఏర్పరచారు.

ఆమె అబద్ధానికి అపరావతారం కావడం వల్ల ఆమె సాక్షి చెప్పేందుకు కూడ అర్హురాలు కాదని చాటారు. ఈ విషయం చెప్పింది యాజ్ఞవల్క్యుడు, వశిష్ఠుడు. ధర్మాత్ముడైన బుద్ధుడు కూడా స్త్రీలకు ఎలాంటి అధికారాల్ని, బాధ్యతల్ని ఇవ్వరాదని చెబుతూ దానికి కారణాలిలా వివరించారు: "స్త్రీలు త్వరగా కోపిస్తారు. ఆనంద; స్త్రీలు వికారానికి గురవుతారు. ఆనంద; స్త్రీలు మాత్సర్యగ్రస్తులు. ఆనంద; మహిళలు మూఢమతులు. ఆనంద! ఈ కారణం వల్ల ఆనంద వారికి సార్వజనిక సభల్లో స్థానం లేదు, వారు వ్యాపారాన్ని, ఉద్యోగాన్ని చేయరాదు. ఏదైనా వృత్తి ద్వారా వారు తమ జీవితోపాధిని పొందలేరు." ఒక జాతక కథలో బోధిసత్వుని చేత ఇలా చెప్పించారు "ఆడది పరిపాలించే దేశం అగౌరవానికి గురైన దేశం. స్త్రీ ప్రాబల్యాన్ని అంగీకరించే పురుషులు గౌరవ హీనులు". ఇంకా ముందుకు వెళ్ళి బుద్ధుడు వివరిస్తూ "అవకాశం, ఏకాంతాలు దొరికితే, సరైన ప్రణయం చేసే వ్యక్తి లభిస్తే స్త్రీలందరూ పదభ్రష్టులౌతారు; అన్యులకు వికలాంగులకు కూడ వశీభూతులైపోతారు". [2]

కరుణామయుడైన తథాగతుడే ఇంత నిర్దయగా చెప్పాక ఇక మిగతా వాళ్ళ సంగతి ఏమిటి? "మంచి కుటుంబంలోని వారు కానీ, సుందరాంగులు కానీ, వివాహితలే కానీ, మహిళలు నీతి నియమాల్ని ఉల్లంఘించి ప్రవర్తించేందుకు సంకోచించరు.

1. Sullanage x. 1.6
2. Quoted in the Milindapanthe

"తొలిసారిగా అవకాశం దొరికినంతనే వాళ్ళు వేరేవాళ్ళ పడశీగదిలోకి ప్రవేశించేందుకు, ధనవంతులైన, అందగాళ్ళైన తమ పతులను వదలివేస్తారు. మగవాళ్ళు కాసేపు ముఖస్తుతి చేస్తే చాలు వెంటనే పిచ్చివాళ్ళైపోతారు" అని మహాభారతం ప్రమాణీకరించింది.'[1]

"స్త్రీలు ఎంతవరకు పతివ్రతలుగా ఉంటారు? వాళ్ళకు నిర్జన ప్రదేశం దొరకనంత వరకు, పరపురుషుని సహవాసం లభించనంత వరకు. అందువల్ల కులస్త్రీలు చెలికత్తెలచే రక్షింపబడాలి" అని "శివపురాణం" శిఫారసు చేసింది. దీన్ని ఎవరి నోట పలికించారు? ప్రతి ఒక్కరి పెళ్ళిలో అరుంధతీ దర్శనం చేయిస్తారుగా! ఆ అరుంధతి నోటి నుండి!

విచిత్రమైన విషయమేమంటే – స్త్రీ స్వరూపిణి, జగద్రక్షకి అయిన దేవి పురాణంలో స్త్రీల గురించి చాలా అసహ్యకరంగా, అవమానంగా చెప్పడం జరిగింది.

"స్త్రీలు మిత్రులు కారు. శత్రువులు కారు. వారు నిరంతరం పరపురుషుల్ని కోరుకుంటారు. చక్కని వస్త్రధారణ చేసిన పురుషుడుంటే అతనిని కామిస్తారు. అయితే తాము కోరిందానిని పొందాలని వారు పాతివ్రత్య ప్రదర్శనం చేస్తారు! బయటికి స్త్రీలు చాలా పాతివ్రత్యం కల్గినవాళ్ళు. అయితే తమ ప్రియుడు రహస్యప్రదేశంలో దొరికితే అతడితో నమిలి తినే విధంగా రమిస్తారు. వాళ్ళు తమ పిల్లల కన్న, తమ కామపిపాసను సంతృప్తి పరచే వాళ్ళను ఎక్కువ ప్రీతిస్తారు".

"స్త్రీలు జలగల్లా ఎల్లప్పుడు మగవాళ్ళ రక్తాన్ని పీలుస్తారు! మగవాడు ఎవరినైతే తమ ప్రియతమురాలుగా భావిస్తాడో ఆమెయే రతిక్రీడ ద్వారా అతని పౌరుషాన్ని కొల్లగొట్టడమే కాక, అతని మనస్సును, ధనాన్ని, అతని సర్వస్వాన్ని అపహరిస్తుంది. అందువల్ల ఆడదాన్ని మంచిన దోపిడీ దొంగలు ఇంకెవరైనా ఉన్నారా?"

1. అనుశాసన పర్వం





ఇంతకన్న హీనమైన స్త్రీచిత్రణ ఇంకేదైనా ఉందా? ఇలాంటి వాతావరణంలో ఎదిగిన వ్యక్తులెవరూ తన తల్లిగానో, భార్యగానో, చెల్లెలుగానో, పుత్రికగానో తన జీవితానికి వెలుగును, మాధుర్యాన్ని, సౌందర్యాన్ని, సార్థకతను తెచ్చిపెట్టే ఈ హీనమైన ఆడదాని చిత్రణపై ఏమాత్రం విమర్శలు గుప్పించనేలేదు. తులసీదాసు లాంటి సజ్జనకవిగారు కూడ మద్దెల, మూర్ఖుడు మరియు స్త్రీ – ఈ ముగ్గురిని బాగా తన్నాలి అని సంకోచించకుండా చెప్పాల్సి వచ్చింది. (ఢోల్, గంవార్ ఔర్ నారీ యహ్ సబ్ అధికారీ)

అలాగైతే దారి ఏది? నారీమణులకు దిక్కేది? పెళ్ళయ్యే దాకా తల్లిదండ్రుల సేవ, తర్వాత భర్త సేవ, వాడేమైనా మొదటే చస్తే పిల్లల కోసం ఎలాగో జీవించాల్సిందే! వర్ణవ్యవస్థలో బ్రాహ్మణులకు వేదాధ్యయనం, క్షత్రియులకు యుద్ధం, వైశ్యులకు ధనార్జనం – ఇవి స్వధర్మాలు; అయితే శూద్రునికి ఈ ముగ్గురి సేవయే స్వధర్మం'.[1] అయితే శూద్రుడి స్వధర్మం ఈ ముగ్గురికి సేవలు చేయడమే! అలాగే ఆడదానికి తన రక్షకులైన తండ్రి, భర్త, కొడుకు – ఈ ముగ్గురి సేవయే ధర్మం!

మొగుడెలాంటివాడైనా కానీ, కురూపి కానీ, నీతిహీనుడు కానీ, రోగి కానీ, అంగవికలుడు కానీ, తాగుబోతుకానీ, దుష్టుడు కానీ భార్య మాత్రం అతనిని దేవుడనే భావించి ఆరాధించాలి, సేవించాలి: శుశ్రూష చేయాలి. అతని కోరికలు ఎంత అసహ్యమైనవైనా, నీతి బాహ్యమైనా వాటిని తీర్చాల్సిందే! ఆదర్శసతి ఎలా ఉండాలన్న విషయంలో అనేక పురాణాల్లో చెప్పబడిన కథ ఒకటుంది; కుష్ఠు రోగి అయిన ఒకడి భార్య తన రోగగ్రస్తుడైన పతి ఆదేశంతో అతణ్ణి నవ్వుతూనే తన బాహువులతో ఎత్తుకుని వేశ్యా వాటికకు చేర్చుతుంది? ఎంతటి ఆదర్శం! ఎంతటి పతివ్రతాధర్మం! దీనికి వేదోక్తి కూడ సమర్థిస్తుంది.

1 ఏకమేవతు శూద్రస్య ప్రభుః కర్మ సమాదిశత్।
ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషామనసూయయా – మనుస్మృతి

"ధర్మానుగుణం కావచ్చు, లేదా ధర్మ విరుద్ధం కావచ్చు, భర్త చెప్పిన విషయాన్ని భార్య తప్పకుండా చేయాల్సిందే!"

విపులంగా, తగినంతగా భారతీయ నారి దుఃస్థితిని, దుర్గతిని వివరించడం వెనుక కారణం ఇంతే!

ఈ నేపథ్యంలో చూస్తే అక్క గారి సాధనల గొప్పదనం మనకు తేట తెల్లమవుతుంది. ఇపుడు ఇవన్నీ అంగీకరించబడిన అంశాలైపోయాయి. ఇప్పటికీ సంప్రదాయ బద్ధుల, హితాసక్తుల కబంధహస్తాల్లో చిక్కుకున్న జనులు వీటిని అంగీకరించలేదు. అయితే వీటి విషయంలో గట్టి విరోధాన్ని కూడ ప్రకటించనూ లేదు. అందువల్ల నేటి జనులమైన మనం వెనుకటి కాలంలో జరిగిన ఏదేని విప్లవాన్ని "ఇదేమిటి?" అని ప్రశ్నించే చాపల్యాన్ని ప్రదర్శిస్తున్నాం. ఏ క్రాంతినైనా, పరివర్తననైనా నూతనాంశాన్నైనా అది జరిగిన కాలంలో, దేశంలో, పరిస్థితిలో పరిసరాల్లో, సందర్భాల్లో, సన్నివేశాల్లో – వాటి వెలుగులోనే వెలకట్టడం న్యాయ సమ్మతమైనది. నేటి అద్దంలో అలనాటి ముఖాన్ని చూడడం న్యాయం కాదు.

అక్కమహాదేవి ఆ కాలంలో స్త్రీలకు సంబంధించిన అన్ని బంధనాల, తుచ్ఛీకరణాల, అవమానాల వారసుదారురాలుగా జన్మించింది. అయితే ఆమె అదృష్టం కొద్దీ ప్రాప్తవయస్కురాలయ్యేసరికి సుదూరంగా కళ్యాణంలో బసవణ్ణ గారి సమగ్ర విప్లవంలో భాగంగా మహిళలకు గౌరవపూర్ణ స్థానం లభించింది.

"భార్య ప్రాణానికి చనుమొన ఉంటుందా? యజమాని ప్రాణాలకు ఉంటుందా యజ్ఞోపవీతం! చివర్లో ఉన్న అంత్యజుడు ప్రాణంలో మూలమైన కర్రను పట్టుకుంటే?"

"స్తనాలు వస్తే ఆడది అంటారు. గడ్డాలు, మీసాలు వస్తే మగవాడంటారు. మధ్యలో మెదిలే ఆత్మ పురుషుడు కాదు. స్త్రీనూ కాదు!"

"సతిపతులొక్కటైన భక్తి హితకరమనిపిస్తుంది శివునికి". భర్త ఉన్న ఆమెను గౌరి అని భావిస్తే భూమండలానికి రాజుగా పుడతాడు" అని జేడర దాసిమయ్య, "పరస్త్రీని మహాదేవి అంటా" "అన్యవధువు అనేది మీ రాణీవాసం", "మాతృమూర్తి





భావం వదలి కౌగిలించుకునే వారి తల తీస్తా కూడల సంగమదేవ" అని బసవణ్ణగారు; "ఉభయదృష్టి ఏకదృష్టిలో కలిసినట్లుగా దంపతులు ఒకే భావంతో నిలిస్తే గుహేశ్వర లింగానికి అర్పితమైంది" సతి భక్తి అయితే మాలకు భయపడడం జరగదు; పతి భక్తుడైతే కులానికి భయపడడం జరగదు ! సతిపతి అనే శారీరకసుఖం తొలగి, లింగమే పతి అయ్యాక సతికి పతి ఉంటాడా? పతికి సతి ఉంటుందా?" అని అల్లమ ప్రభువులు; "ఆడది ఆడది కాదు. ఆడది రాక్షసికాదు. ఆడది ప్రత్యక్షంగా కపిలసిద్ధ మల్లికార్జునుడే" అని సిద్ధరామేశ్వరులూ; "స్తనాలుంటేనే ఆడదని ప్రమాణీకరించలేదు; మీసం, గడ్డం, ధనం ఉంటేనే మగవాడని ప్రమాణీకరించలేదు. ఇది ప్రపంచం ధోరణి ! తెలుసుకున్నవారి నీతి కాదు; ఏ ఆడదైనా మాధుర్యమే కారణం; అందం లేని పూవుకు వాసనే కారణం. దీని అందం నీవే ఎరుగుదువు" అని సత్యక్క; "స్తనాలు పొటమరిస్తే ఆడదంటారు, మీసం, గడ్డాలు వస్తే పురుషుడంటారు. ఈ రెండింటి జ్ఞానం ఆడా? మగా?" అని గొగ్గవ్వ; "కూటానికి సతి పతి అనే పేరు కానీ జ్ఞానానికి వేరే ఒక శరీరముందా? అని అయ్దక్కి లక్కమ్మ; "బసవుని అనుభవంతో వివరాలు తెలుసుకుని విచారపత్ని అయ్యానయ్యా సంగయ్యా" అని నీలమ్మ; ఇతరులు చాటి స్త్రీపురుషుల మధ్యలో ఉండే అడ్డుగోడను చెరిపి, మహిళా స్వాతంత్ర్యయుగపు మంగళగీతాన్ని ఆలపించారు![1]

సుదూరంలో ఉన్న కళ్యాణంలో ఎలాంటి సంపర్క సాధనాలు, పరికరాలు లేని కాలంలో నినదించిన స్వాతంత్ర్యధిక్కారావం ఉడుతడికి ఎలా విన్పించిందో తెలియదు. బళ్ళిగావలోని అల్లమునికి విన్పించినట్లు ఉడుతడిలోని అక్కకు విన్పించి ఉండాలి. వినిపించకున్నా ఇది ఆ యుగంలోని లోపలి ధ్వనిగా వాతావరణంలో అంతా

1. "ఆమె పురుషునితో సమానమని చాటి, ధార్మికమైనా, సామాజికమైనా అన్ని రకాల స్థానమార్గాలకు ఆమె అర్హురాలని ప్రచారం చేసి, స్త్రీస్వాతంత్ర్యాన్ని ఆవిష్కరించిన ప్రథమకీర్తి బహుశః ఈ ప్రపంచంలో బసవణ్ణ గారికే చెల్లుతుంది. తొలుతగా ఆమెకు ఆలోచనా స్వాతంత్ర్యాన్ని అందించింది ఆయనే. అనుభవ మంటపంలో పురుషులతో సమానంగా కూర్చుని, ధార్మిక చర్చల్లో పాల్గొన్న సాహితీవేత్తలైన మహిళల సంఖ్యయే అ అంశానికి సాక్షి.:డా॥ దే.జ.గౌ. బసవ సంహితే.

వ్యాపించి ఉండాలి. లేదా అక్కలోని అంతరంగ సత్త్వం అలా వ్యాపించి ఉండ వచ్చు. మొత్తానికి భారతనారీలోకానికి స్వాతంత్ర్యాన్ని, విముక్తిని అందించిన వెండితారగా అక్కమహాదేవి ప్రకాశిస్తోంది. ఆడదానికై స్వాతంత్ర్య సాధన, గౌరవ సాధన, పరమార్థ సాధన - ఈ త్రివిధ సాధనలతో అక్క తన త్రివిక్రమత్వాన్ని ప్రదర్శించింది!

స్త్రీల స్వాతంత్ర్య శక్తి పరీక్ష జరిగేది వారి పెండ్లి సమయంలో. తల్లిదండ్రులు ఎవరికి అంటగట్టినా దాన్ని అంగీకరించక తప్పని తరుణంలో ఎవరితోను 'విచార పత్ని' (ఆలోచించే భార్య) జీవించడం సాధ్యం కాదని తెలిసింది. అలాంటి ఆ కౌశికుణ్ణి హరిహరాదులు చెప్పినట్లు ఖచ్చితంగా అంగీకరించడం కానీ, చామరసాదులు చెప్పినట్లుగా నిష్ఠురంగా నిరాకరించడం గాని మహిళా స్వాతంత్ర్యానికి నాంది పలకడమే! 'ఒకడిని ఒకసారి వివాహమాడాక చనిపోయేదాకా అతనితోనే బ్రతకాల్సిందే అని నియమాలున్న కాలంలో నియమాన్ని ఉల్లంఘించిన కౌశికుణ్ణి వదలి బయలు దేరడం ఆ స్వాతంత్ర్య స్థిరీకరణమే కదా! అలా విడిచి నిష్క్రమించిన వేళ తల్లిదండ్రులు, బంధువులు ఆపివేశారు. అపుడు 'నీ మాతృత్వం నాకక్కరలేదు పోవే!' అనేంత స్థాయిలో లక్ష్యశుద్ధిని, ధైర్య మతిని ప్రదర్శించడం ఆ స్వాతంత్ర్య విస్తరణమనే చెప్పాలి. పురుష సన్యాసులు దిగంబరులుగా ఉండవచ్చు. అలాంటప్పుడు స్త్రీలెందుకు ఉండరాదని ఆలోచించి దిగంబరత్వాన్నే దివ్యాంబరంగా చేసుకుని ఉండిపోవడం ఈ స్వాతంత్ర్యపరాకాష్ఠయే అవుతుంది. ఇహంలో ఒక భర్త, పరంలో ఒక భర్త అక్కరలేదని నిర్ణయించి మల్లికార్జునుణ్ణే ఇహపర పతిగా, లింగపతిగా అంగీకరించి, అతని ఆరాధనలో పరమగతిని పొందడం దాని పరిపూర్ణతయే అని అనాలి.

వీటిలో ఒక్కొక్కటి నేటి విద్యావంతురాళ్ళయిన యువతులలో శరీరంలో వణుకు పుట్టించేదే! అక్క తాను జన్మించిన కాలం కన్న 800 సంవత్సరాలు కాదు, కొన్ని వేల సంవత్సరాలు ముందుందా? యౌవనంలో ఉన్న ఒక పిల్ల సంప్రదాయబద్ధమైన సమాజానికి వ్యతిరేకంగా నిలిచి సాహసాన్ని చూపించడమే కాకుండా ఇంటిని,





తల్లిదండ్రుల్ని, దాంపత్య సుఖాల్ని, సభ్యత అందించే వస్త్రాల్ని, నగల్ని వదలి బయలు దేరడం అనేది ఒంటిని పులకరింపజేసే అపూర్వ సంఘటనలు! లింగపతి కోసం సర్వ వదలడం అనేది అద్భుతమైన సంఘటన. ఆ ఆదర్శ పతి కోసం, ఉడుతడి నుండి కళ్యాణానికి, కళ్యాణం నుండి శ్రీశైలంలోని కదళీవనానికి ఒంటరిగా, ధైర్యంగా, అసహాయ శూరురాలిగా, నిందకుల్ని, కాముకుల్ని, వన్యమృగాల్ని, ఆకలి దప్పుల్ని, విఘ్నాల్ని, అపాయాల్ని, గండాల్ని ఎదురిస్తూ ప్రయాణం సాగించడం 'నభూతో నభవిష్యతి' అనదగిన సంఘటన!

పైన పేర్కొన్న సంఘటనలు అక్కగారి స్వాతంత్య సంపాదనకు చెందిన సువర్ణ సంపుటానికి సామగ్రి అయితే అనుభవ మంటపంలో అల్లమ ప్రభువు పెట్టిన అగ్ని పరీక్షలో విజయం పొందడం ఆమె గౌరవసంపాదనను చూపించే సంఘటన! అన్ని దుర్గుణాలకు పుట్టిల్లు, అన్ని బలహీనతలకు జన్మస్థానం, నిలయం, అన్ని ప్రలోభాలకు దుష్కృత్యాలకు మూల కారణం అని అనిపించే వనిత తలచుకుంటే- నేను, నీవు అని అహంకారంతో విర్రవిగే దొరల అనుభావాల రాజులు, అత్యున్నత యోగి పుంగవుల అగ్ని పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించిందనడానికి శూన్యసంపాదనలో వచ్చే అక్కల సంపాదనయే సాక్షి.

ఈ చిద్విలాస భరితమైన అల్లమ - అక్కమహాదేవుల సంవాదాన్ని అలాగే ఉద్ధరించాలి. దాన్ని సేకరించే, సంక్షిప్తం చేసే ప్రయత్నం వ్యర్థం.

పైగా, మూలానికి అపచారం జరగని రీతిలో దాన్ని సంగ్రహించడం అసాధ్యం. ప్రభువు ఉద్దేశపూర్వకంగానే లౌకికులలో అక్క గురించి ఏర్పడబోయే తప్పుడు అభిప్రాయాలు కరగిపోయే రీతిలో, అక్క అంతరంగంలోని ఉజ్జ్వలత, జ్ఞానమహిమ, అనుభావంలోని ఔన్నత్యం ప్రస్ఫుటమయ్యే రీతిలో ఈ పరీక్షను ఏర్పరచడం వల్ల ఈ సంవాదం అక్కగారి ఆకాశమంత ఉన్నతమైన వ్యక్తిత్వ చిత్రణ దృష్టితో సంగ్రహాతీతమైనది.

ప్రభువు ప్రారంభంలో అడిగే ప్రశ్నయే ఎలాంటి వారినైనా స్తబ్ధం గావించే ప్రశ్న:

"మదపూరిత యౌవనంతో కూడిన నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావమ్మా?

నీ పతి ఆనవాళ్ళు చెబితే వచ్చికూర్చో లేకుంటే వెళ్ళిపో తల్లి!

మా గుహేశ్వరుని శరణులలో సంగమ సుఖసాన్నిహిత్యాన్ని కోరు వారే.

నీ భర్త ఎవరనేది చెప్పు, ఓ తల్లి!"

తలనొప్పి కల్గించే ఈ ప్రశ్నకు ఏమాత్రం అధైర్యపడకుండా జవాబిచ్చింది అక్క.

"శివుడా! నీవే నాకు పతికావాలని
అనంతకాలం తపస్సు చేశా చూడు!
పచ్చిగా ఉన్న మాటలు పక్కాగా మారే లోపు
శశిధరుని వద్దకు పంపారు మా వాళ్ళు.
భస్మంపూసి, కంకణాన్ని కట్టారు-
చన్నమల్లికార్జునుడు తనకు నేను కావాలని"

హరునకు మానవ పుత్రికనిస్తే ఎవరు?

గురువే బంధువయ్యాడు
లింగమే పెళ్ళి పెద్దగా మారాడు
నేనే పెళ్ళికూతురునయ్యా
ఈ భువనాన్నంతా తెలుసుకునేందుకు
అసంఖ్యాకులు నాకు తల్లిదండ్రులు
ఇచ్చారు సాదృశ్యాన్ని వరుని చూసి
ఈ కారణం వల్ల చన్నమల్లికార్జునుడే నాకు భర్త
మిగతా లోకులతో నాకు
ఎలాంటి సంబంధం లేదయ్య ప్రభువా!

ఈ అపూర్వ వివాహం చాలా అపూర్వంగా జరిగి ఉండాలి కదా?





పచ్చతో వేదిక, బంగారు తోరణం
వజ్రస్తంభం, పగడాల ఛత్రం పెట్టి
పెళ్ళి చేశారు.
మావాళ్ళు మా పెళ్ళి చేశారు.
కంకణం, రక్షదారం తాళిని ఇచ్చి
చన్నమల్లికార్జునుడనే మగవాడితో నా పెళ్ళి చేశారు.

ఇదంతా సరే, అయితే -

తప్పును తలపై మోపి వెళ్ళుతున్నాననడం సత్యమా?
తాను చీరతో నిర్వాణం పొందితే
మనస్సులోని భ్రాంతి నిశ్చయింప బడదు
కేశాలనే చీరే శరీరానికి వస్త్రంగా మారింది
అవమానమనేది ఎక్కడి నుంచి వచ్చింది?
ఇది గుహేశ్వరలింగానికి సరిపోని వేషం!"

అక్క దీనికి ఇచ్చిన బంగారం లాంటి సమాధానం -

శరీరం ఎర్రగా కందిపోతే ఏమయ్యా?
శరీరం తళతళ మెరిస్తే ఏమయ్యా?
అంతరంగం శుద్ధ మయ్యాక
చెన్నమల్లికార్జునయ్యా
నీవు వలచిన కాయం వెళ్ళిపోయి
ఉంటే ఏమయ్యా ?

ప్రభుదేవుల వారి సవాలు:

దేవుడు వలచాడు నిన్ననడం దేనికి?
భావం శుద్ధమైతే చీరను పక్కన పెట్టి
వెంట్రుకలతో కప్పుకోవడం దేనికి

అది అంతరంగంలోని సిగ్గు బాహ్యంలో కన్పించింది!
ఇది గుహేశ్వరలింగానికి నచ్చని మాట

దీనికి అక్కమహాదేవి మార్మికమైన జవాబు:

పండులోపల పక్వం కాకుండా
బయటి తొక్కమాసిపోదు
కాముని ముద్ర చూసి మీకు
బాధ కల్గుతుందని
ఆ భావం నుండి ముచ్చితివి!
దీనికి బాధ ఎందుకు?
బాధిస్తోందన్నా చన్న మల్లికార్జున దేవుని
అంతరంగంలో ఉన్న ఆమెను.

అక్క జవాబుతోనే ఇరుకున పడవేసే మరో ప్రశ్న!

నీవు దేవుడిలోనా దేవుడు నీలోనా
అనే అంశాన్నెరుగను
తొక్కు సరిగా లేనప్పుడు ఫలరసం
అది గుహేశ్వరునికి అర్పితం కాదు!"

ఇబ్బంది పెట్టే ప్రశ్న ఇది. దీనికి అక్క చాలా సునాయాసంగా జవాబిచ్చింది అడిగిన ప్రభుదేవులు, చుట్టూ ఉన్న శరణులు, శరణమాతలు విస్మయం చెందే విధంగా :

గుణదోషాల సంపాదన చేసే అక్క
కామపు శరీరం, క్రోధం గుర్తు, లోభమనే శత్రువు
మోహమందిరం, మదానికి ఆవరణం,
మాత్సర్యాల తొడుగు !
ఆ భావరతి లేకుండా
చెన్నమల్లికార్జునుని అడగడం సరికాదు!'





క్రోధాదులన్నీ కామమనే తీగకు పుట్టిన పిల్లలే.
తొలుత కాయం కోరుకుంటుంది. కోరికను తీర్చమంటుంది.
కోరింది లభిస్తే మరింత కోరుతుంది. కోరింది లభించకుంటే
క్రోధం నసాళానికెక్కుతుంది. దొరికినట్లంతా లోభం పెచ్చు
పెరుగుతూ పోతుంది. అంతా తనదే అనే మోహం
పెరుగుతుంది. తనకున్నది వేరెవరికీ లేదనేది మదం;
తనకున్నది ఇతరులెవ్వరికీ దక్కరాదనేది మాత్సర్యం!
ఇలా ఒక దాని వెంట ఒకటి ఈ భ్రమల తీగ వ్యాపిస్తుంది!
ఇలా శని సంతానానికి తల్లియైన కామ వలయం నుండి
తప్పించుకోవడం సులభ సాధ్యమా ప్రభుదేవులు దీన్ని
సులభంగా అంగీకరిస్తారా? అడిగేశారు.
కామంతో కండ, క్రోధంతో ఆస్తి
లోభంతో అన్ని విషయాలు!
మోహంతో చూశాననడమంతా 'కాముని' వలలో!

కాముని గెలిచావు గుహేశ్వర లింగానికి గురుతు ఏముంది?

దీనికి అక్కగారి సమాధానం. వేరేవాళ్ళైతే నిరుత్తరులయ్యే సమాధానం:

"చితిలో రగిలే శవంలా! దారం
తెగిన బొమ్మలా, నీళ్ళు లేని సరస్సులా
కాలిన దారంలా
ఇక వెనుదిరిగి చూడడం అనేది
చన్నమల్లికార్జునుని ఆశ్రయించిన ఆమెకు!"
అంగమే కామ రంగం. అంగమే లింగమయ్యాక,
కామానికి అక్కడ స్థలం ఏది?

సకృద్దర్శనానికి ఇది సమపర్పకమైన ఉత్తరమే. ఇంకొకర్తె ఉంటే వాదాన్ని అక్కడికే నిలిపి వేసేవారేమో! అయితే ప్రభుదేవులు వదలుతారా? ఇలాంటి

ఉత్తరానికి ఎలాంటి ప్రశ్నను రూపొందించారో చూడండి.

"రూపమున్న వాడికి చెడు ఉంది.
రూపరహితుడికి చెడు లేదు.
రూపం నిరూపాన్ని చేరే విధానం
ఎలాంటిదో వివరించు!
అసంబంధం సంబంధమైంది!
దేహం ఇంద్రియాలు అనే జాతి
సూతకముండగా
గుహేశ్వర లింగాన్ని ముట్టరాదు వినమ్మా!"

"రూపం నిరూపునిలో  చేరే విధానం ఏమిటి? ఇది మౌలిక ప్రశ్న!

దీనికి ఇదేవిధంగా మౌలికమైన జవాబునిచ్చింది అక్కమహాదేవి!

పాము కోరలు తీసి పామునాడించగలరా
పాము సాంగత్యమే మంచిదయ్యా;
కాయపు సంగమాన్ని వివరించగలరా!
కాయసంగమమే మంచిదయ్యా!
తల్లి రాక్షసి అయినట్లు శారీరక వికారం
చన్నమల్లికార్జునయ్యా
నీను వలచిన వారి కాయాన్ని
తీసుకోవాలని అనవద్దు!"

"ఇదేమో సరి! కాయసంగమాన్ని
వివరించగలరా! కాయ సాంగత్యమే
మంచిది! అయితే శరీరగుణాల్ని
వివరించడం ఏం పిల్లాటలా?





"శారీరకగుణాల్ని వివరించాలంటే
మనస్సు పరిశుద్ధమై ఉండాలి;
మనస్సులోని గుణాల్ని వివరించాలంటే
ఇంద్రియాలు శుద్ధంగా ఉండాలి;
తనువు, మనస్సు, ఇంద్రియాలు
శుద్ధమై, సునిశితమై
లింగముఖానికి వేద్యం కానిదే
గుహేశ్వరునితో కలవడం కుదరదు
విను! తల్లీ!!

మొదటే జవాబు సిద్ధంగా ఉండిందేమో! వెంటనే ఉత్తరం ఇస్తుంది అక్క!

"శరీరం శుద్ధమై పోయింది
శివభక్తుల స్పర్శతో నా
మనస్సు శుద్ధమైంది అసంఖ్యాకుల్ని
తలచుకుని; నా
కనులు శుద్ధమయ్యాయి.
ప్రాచీనులందరిని చూచి; నా
చెవులు శుద్ధమయ్యాయి
వాళ్ల కీర్తిని విని నా
ముక్కు శుద్ధమైంది మీ పాదాల
పరిమళాన్ని ఆఘ్రాణించి, నా
నాలుక శుద్ధమైంది మీ శరణుల స్తుతి చేయడంతో
ఈ జీవనమే నాకు భావన వినుమా!
లింగ తండ్రీ!
నేరుగా మిమ్మల్ని మనసారా
పూజించి సంసారాన్ని దాటాను

చూడు చన్నమల్లికార్జునా!"

ప్రభుదేవులింకా అడిగారు:

ఒక చోట లేని ఘనపదార్థాన్ని
కలిసే విధానం ఎలాంటిది తల్లీ,
అడిగితే దానికదే కొరత!
గుహేశ్వరలింగాన్ని వేరు చేసి
చూపే విధానమేమిటి చెప్పు!

దీనికి సమాధానం ఉంది అక్కవద్ద.

ధృఢమైనదానికి తెలుసుకునే
దానికి భేదం ఉందా అయ్యా
దీపానికి దీప్తికి భేదం ఉందా అయ్యా,
అంగానికి, ఆత్మకు భేదం ఉందా అయ్యా
నా శరీరాన్ని గురువు మంత్రంగా
చేసి చూపించాడు.
సావయవం నిరవయవం కన్న
భిన్నం కాదయ్యా!
చన్నమల్లికార్జున దేవుని చేరి
తల చెడిపోయిన దాని చేత
ఎందుకు అనిపిస్తారు ప్రభువా?"

ఇక్కడ మరో ప్రశ్నకు సమాధానం దొరికింది ప్రభుదేవులకు. 'వాదులాడి తల చెడిపోవడమే నిజమైతే ఈ మాటల మాలలెందుకు? కలహించలేదనేందుకు ఇందు సాధ్యం కాదా?

నేను చచ్చానని శవం అరుస్తుందా?





దాచి ఉంచిన కోర్కె పిలుస్తుందా?
తోడు వేసిన పాలు తీయనౌతుందా?
ఈ మాట నచ్చదు గుహేశ్వర లింగానికి!"

ప్రభువు' ఒప్పదుకదా!' అన్న తక్షణం అక్క అంగీకరిస్తుందా? అది ఎలా ఒప్పుతుందనే అంశాన్ని నిరూపించి చూపించింది. –

చనిపోయిన శవం అరవటం ఉంది.
దాచిన కోరిక పిలవడం జరిగింది.
తోడు వేసిన పాలు తీయనైనది.
దీన్ని నిశ్చయించుకుని చూడండి
చెన్నమల్లికార్జున దేవునితో"

"ఇది నాకు ఆశ్చర్యం!
చెప్పమ్మా! శరీరం లేని సుఖాన్ని,
జీవితం లేని సంసారాన్ని
అదెలాంటిదో చెప్పు
గుహేశ్వరలింగానికి!"

'మరుపు వదలి కల కని చెబితే
చచ్చిన శవం లేచింది;
తన ఋణ విధానం లేచి పిలిచింది.
తోడు వేసిన పాలు గట్టి నెయ్యిగా మారి
తీపి అయింది !
దీన్ని సాధించలేకపోవడం దేనికి?
చన్నమల్లికార్జున దేవుని అన్నలారా?"

"ఇది మంచిదయింది!..."

అబ్బ! ఇలా ఒక అంగీకారోక్తి కోసం ఎలాంటి కఠోరమైన, కఠినమైన పరీక్షను అక్కమహాదేవి ఎదుర్కోవాల్సి వచ్చింది. 'ఇది మంచిది' అనే వాక్యం ప్రభుదేవుల శ్రీ ముఖం నుండి వెలువడినపుడు అంతదాకా, ఉక్కిరిబిక్కిరిగా ఉన్న అనుభవమంటపం వాతావరణంలో ఒక్కసారిగా మలయ వనమాలికలు వీచినట్లయింది. అక్క ధన్యతానుభవం కూడ సరైనదే! అక్కడ విలసిల్లిన శరణులకు, శరణ సాధ్వీమణులకు ఇంతకు పూర్వం వినని, ముమ్మందు మరువలేని అమర సంవాదం విని ధన్యతానుభవం కల్గి ఉండాలి. శరణ స్త్రీలకు మాత్రం ఇది గర్వకారణం, సంకోచం, గర్వ భావన - ఇలా త్రివిధానుభూతి కల్గి ఉండాలి.

నిజానికి ఇది ఒక సంభాషణ మాత్రమే కాదు. స్త్రీల గౌరవగంగా పుణ్యప్రవాహం. ఇది ముగిసినంతనే శరణులు, శరణస్త్రీలు అక్కపై ప్రశంసల మల్లికా సుమాల వృష్టి కురిపించారు.

బ్రహ్మకల్ప కోటి సంవత్సరాల
వయస్సున్న వాళ్లంతా పెద్దలా?
తమపై పుట్ట పెరిగిన వాళ్లంతా
తపస్వులంతా పెద్దలా?
నడుము విరిగి, తలవణకి వెంట్రుకలు నెరసి
నింతలు పడి, తల చెది పోయి ఒకటి కాక 9 రకాల మాటలు
పలికే అజ్ఞానులంతా పెద్దలా?
సమయాన్ని గ్రహించి, ఘనమైన వస్తువునెరిగి,
చిన్న పెద్ద అనే భేదాన్ని మరచి,
కూడల చెన్న సంగయ్యలో కలిసి -
వేరు కాకుండా ఉన్న వాళ్లదే పెద్దరికం

"మా మహాదేవి అక్కకు అలా అయింది" అని చెన్నబసవణ్ణ గారు వర్ణించారు,





ఔనౌను ! మరి ఏమి? మరపుకు
చిన్న, పెద్ద తేడాలున్నాయి కానీ
జ్ఞానానికి చిన్న పెద్ద భేదముందా? చెప్పవయ్యా!
చచ్చే వానికి భయం ఉంది కానీ పుట్టనికి వానికి
భయముందా చెప్పవయ్యా
కపిల సిద్ధ మల్లికార్జునునిలో
మహాదేవి అక్క నిలుపుకు
శరణు అని శుద్ధుడనయ్యా చూడు
చెన్నబసవణ్ణా!"

అని సిద్ధ రామయ్య గారు కీర్తించారు.

స్త్రీల శరీరాన్ని చూశారు ప్రాచీనులు,
బాల్యంలోని అంగాల్ని చూశారు ప్రాచీనులు!
బ్రహ్మనాచరించి తన్ను మరవకుండా
చూశారు లింగవంతులు!
తనలో తానే నిశ్చయమై
భాష చెడకుండా ఉండ ఉనికి
కూడల సంగమదేవునిలో మహాదేవి
అక్కకు ఏర్పడింది."

అని బసవణ్ణ గారు సెలవిచ్చారు!

ప్రభుదేవులు మొదలుకొని శరణులు, శరణ స్త్రీలంతా ప్రశంసించారు.

తలవంచి పలికింది అక్కమహా దేవి:

"నాకెందుకయ్యా? ఈ ప్రపంచపు బొమ్మ!
వేలు తాటిపండును పిసికితే తిననగునా?
నా భక్తి బసవణ్ణ ధర్మం

నా జ్ఞానం ప్రభు దేవుని ధర్మం
నా పరిణామం చెన్న బసవణ్ణ ధర్మం
ఈ ముగ్గురూ ఒక్కొక్క దాన్ని ఇచ్చారు
నాకు మూడు భావాలయ్యాయి.
ఆ మూడింటిని మీకు సమర్పించిన తర్వాత
నాకెలాంటి బాధలేదు.
చెన్నమల్లికార్జునుని స్మృతిలో మీ
కరుణాపాత్రమైన శిశువును నేను !"

అక్కగారి వినయం ఆమె వ్యక్తిత్వ పర్వత మహాశిఖరంలా విలసిల్లింది. స్త్రీకి గౌరవాన్ని అందించాలనే ప్రయత్నం సిద్ధించి, ఉన్నత శిఖరాన్ని అధిరోహించింది; బసవణ్ణ గారి మహానాయకత్వంలో ప్రారంభమైన వనితా స్వాతంత్ర్యపు మహోద్యమానికి వరదానం లభించింది. మహిళా స్వాతంత్ర్యం, అలాగే నారీ గౌరవం అనేవి గగన కుసుమాలుగా నిలిచి పోకుండా ప్రతి ఇంట్లో మందార కుసుమాలై వికసించాయి.

ఇక మిగిలింది అక్క గారి పారమార్థిక సాధనా మార్గం – సింహావలోకనం. అక్క తనకోసం ఎంచుకున్న పరమార్థమార్గం సతి పతి భావ మార్గం. దీని రహస్యమిలా ఉంది :

అంగాన్ని లింగముఖానికి అర్పించి
శరీరం (అంగం) అనంగం అయింది.
మనస్సును జ్ఞానానికి అర్పించి
మనస్సు లయమై పోయింది.
భావం తృప్తికి అర్పించి,
భావం బయలుగా మారింది.
అంగ మన భావం పోయిన





కారణంగా కాయం అకాయంగా మారింది.
నా అకాయసుఖాన్ని లింగం భోగించే వాడై
శరణ సతి - లింగపతి ఔతాను
ఇదే కారణ చన్న మల్లికార్జునయ్య
అనే భర్తలో ప్రవేశించి కలిసి పోయాను!"

అంగం – మనస్సు – భావం – బయలుగా మారి కాయం అకాయం కావాలి. అకాయ సుఖాన్ని లింగం భోగించాలి. 'లౌకికవిషయాలు' వద్దని భావించి చెన్నమల్లికార్జునుని అంగమే ఆశ్రయం కావాలి. మొత్తానికి 'రూపం నిరూపమై' సావయవానికి, నిరయవానికి భేదం లేకుండాపోయి, అంగమే లింగం కావాలి. శరణసతి లింగపతిలోకి ప్రవేశించి కలిసిపోవాలి. దాని పద్ధతి ఇలా ఉంది :

"అంగం లింగాన్ని భేదించి
అంగం లింగంలోకి చేరెను!
మనస్సు లింగాన్ని భేదించి
మనసులో లింగంలోకి చేరెను!
భావం లింగాన్ని భేదించి
భావం లింగంలోకి చేరెను!
చెన్నమల్లికార్జున
మీ ప్రేమ సాంగత్యంలో ఉండి
స్వయం లింగి అయిపోతాను!"

దేనికై ఏ లింగాన్ని వేధించాలి?

అంగం క్రియాలింగాన్ని వేధించి
అంగం లింగంలోకి చేరింది.
మనసు జ్ఞానంతో కలిసి జంగమసేవ చేసి

మనస్సు జంగమ లింగంలోకి చేరింది,
భావం గురులింగంలోకి కలిసి
మహాప్రసాదాన్ని భోగించి
భావం గురులింగంలోకి కలిసింది.
చెన్నమల్లికార్జున, మా ప్రేమవల్ల
అహంకారం అణిగి స్వయంగా
లింగంగా మారానయ్యా, ప్రభువా!"

"మనస్సులో మనస్సై మనస్సును లింగంలో కలిపివేశా;
భావంలో భావమై భావాన్ని లింగంలో కలిపివేశా!
జ్ఞానంలో జ్ఞానమై జ్ఞానాన్ని లింగంలో కలిపివేశా!
క్రియలన్నిటిని నిలిపి క్రియాతీతంగా నివృత్తి లింగైక్యం చేశా
నేను అనేదాన్ని నిలిపి, నీవనేదాన్ని చెరిపి
ఉభయలింగైక్యం చేశా!
చెన్నమల్లికార్జునునిలో నేను కలిశా
లింగమనే ఘనం నాలో కలిసి
ఉండింది చూడు బసవణ్ణా!"

ఇది ఒక అసమానమైన పరమార్థ సాధన. తన అంగం తన పాలిట నిరంగమై అతడిని అంగంగా మార్చే సాధన సామాన్యమైనది కాదు. ఇది ఎలా సాధ్యం అంటారా? వినండి!

భావించి చూశాక అంగమైంది
అంగగుణం నశించాక నీకు అంగమైనా!
భిన్న రుచిని వదలి లింగరుచి అయ్యాక
చెన్నమల్లికార్జునుని తీసుకుని
భాష మాయమయ్యే"





దేహభావం మిగిలి ఉన్న వారికి మాత్రమే దేహం; దేహభావమే లేనప్పుడు ఎక్కడి దేహం? తనువు - మనస్సు - భావాలన్నీ లింగానికి అర్పితమై లింగమై ఉండగా శరణసతి అంగభోగాలన్నిటినీ లింగమే భోగించడం అలవడిన వేళ శరణసతి మహాఘనలింగం తనకు అనన్య పరిపూర్ణమనే దాన్ని స్వానుభవ దృష్టితో కనుక్కున్న వేళ - అంగగుణాలన్నీ నశించి శరణపతి అంగమే లింగపతి అగమై పోయాక, అంగగుణాలన్నీ నశించి శరణాగతి శరీరమే లింగపతి శరీరమై పోయాక అంగాంగసంయోగం అనేది భిన్న భావమే అవుతుంది. అంగభావం నశించి లింగమే తానైనవేళ తెలుసుకొనేదనేది మరియు తెలుసుకుంటుందనేది రెండూ నశించిపోతాయి. అప్పుడు "లింగంతో కలిసి నడుస్తా, మాట్లాడే లింగంతో కలిసి? ఎడతెలిపి లేకుండా వచ్చే విషయాదిభోగాల్ని చూస్తా లింగముఖాలలో అనేది మాయమై -

"లింగాంగ సంగ సమరస సుఖంలో
మనసు వేద్యమైంది!
మీ శరణుల అనుభావసాంగత్యంతో
నా శరీరం -మనసు- ప్రాణ పదార్థం
గురు - లింగ - జంగమానికి వశమై
శుద్ధ, సిద్ధ, ప్రసిద్ధ ప్రసాదినౌతాను ?
ఆ మహా ప్రసాదపురూపం - రుచి తృప్తి
ఇష్ట ప్రాణ భావలింగాలలో జాగ్రత్తగా
అర్పించి మహాఘన ప్రసాది ఔతాను
ఇదే సర్వాచార సంపద.
నా తనువు మనసు వేద్యమైంది.
ఇంకెక్కడయ్యా నాకు మీలో నిరవయవం ?
ఇంకెక్కడయ్యామాలో కలవడం?"

అని అడగాల్సి ఉంటుంది. ఈ సర్వాచార సంపద, శూన్యాశూన్య స్థితిని సంపాదించడం, చెన్నమల్లికార్జునునితో అభిన్నత్వపు అనన్యతకు సంబంధించిన సిద్ధి, అక్కగారి అసమానమైన పరమార్థ సాధన చెన్నమల్లికార్జునుని చంపి (తీసుకుని?) మృత్యభాషను దాచ్చిన అక్క దాన్ని పూరించి పరమార్థ ప్రపంచంలోనే తనదైన నూతన పరాక్రమాన్ని ప్రదర్శించింది. ఎలాంటి ధార్మికాచార విచారాలకు అనర్హురాలు అనిపించుకున్న స్త్రీ జన్మనే పొంది వేలాది సంవత్సరాలుగా ఈ విషయంలో ముందంజలో ఉన్న పురుషుల గర్వ భంగం అయ్యే రీతిలో పరమార్థ సాధన చేసి ఆధ్యాత్మికలోకంలో అజరామర స్థానాన్ని పొందింది.

శ్రీ ఎం.ఆర్. శ్రీ గారు ప్రస్తావించిన అక్క గారి ఈ మూడు సాధనలతో పాటు ఇంకొక మహత్తర సాధన గురించి ప్రస్తావించాల్సిందే! ఇది ఆమె చేసిన సాహిత్యసాధన. ఇది ఆమె చేసిన అసాధారణ సాధన అనేది నిర్వివాదం. సమగ్ర కన్నడ సాహిత్య చరిత్రలో ఇప్పటి దాకా మహిళల్లో అత్యున్నతమైన స్థానాన్ని సాధించింది ఆమె ఒక్కతె! అంతే కాదు, కృతి వైవిధ్యం, ఛందోవైవిధ్యాల దృష్టితోనూ అక్కగారిది అద్భుత సాధన! ఒక్కొక్కటి ఒక్కోరత్నంలా 340 వచనాలు (ఇంకా ఎక్కువ ఉండవచ్చు) ఎన్నటికీ, పచ్చగా మిగిలిపోయే "యోగాంగ త్రివిధి" శ్రేష్ఠమైన శ్రేణికి చెందిన "సృష్టివచనం". అలాగే "స్వర వచనాలు" అక్క మాకు వదలి వెళ్ళిన అమూల్యమైన ఆస్తి. కర్ణాటక కవిచరిత్రకారులు ప్రస్తావించిన "అక్క గారి పీఠిక" లభ్యం కాలేదు. అది దొరికితే ఈ ఆస్తి అమూల్యత్వం ఇంకా పెరుగుతుంది. పాతిక సంవత్సరాల కన్న తక్కువ కాలం బ్రతికిన అక్క నుండి ఇంతటి శ్రేష్ఠ సాహిత్యం సృష్టి కావడం విస్మయాల్లో ఒక విస్మయం ! ఇది అలాంటి ఇంటి సాహిత్యం కాదు. వైశిష్ట్యపూర్ణమైన సాహిత్యం!

అక్క సాహిత్యవనంలో విహరించే ముందు తొలుత ఆమె పూర్వసిద్ధత





ఎలాంటిదో గమనించాలి. స్త్రీకి జన్మతోనే వచ్చే సౌందర్యదృష్టికి పోషకంగా మలెనాడులోని ప్రకృతి సౌందర్య సాక్షాత్కారం లభించింది. అక్కకు కన్నడ భాషలోని సౌందర్యం కరతలామలకమైంది. ఆమెకు బాల్యంలో గురులింగ దేవరు, తర్వాత ప్రభుదేవరు గురువులుగా లభించారు; నీలమ్మ తల్లిగా, బసవణ్ణ తండ్రిగా, అసంఖ్యాకులైన శరణులు, శరణ స్త్రీలు బంధువులుగా లభించారు.

ఆత్మ సాంగత్యానికి చెన్నమల్లికార్జునుడు లభించి సతిపతి భావ పథంలో ఆమెక ఆధ్యాత్మిక విరహపు నూరు ముఖాల్ని పరిచయం చేశాడు. ఉడుతడి నుండి కళ్యాణం దాకా, కళ్యాణం నుండి కదలీవనం దాకా సాగించిన పయనంలో పశుపక్ష్యాదులు, తీగలు, వృక్షాల నుండి సుజనుల నుండి కుజనుల నుండి చరాచర సృష్టిలోని శ్రీకరత్వం, భీకరత్వం –ఈ రెండింటి విరాడ్రూప దర్శనం ఆమెకు అయింది. నిందాస్తుతుల్ని సంకోచం, సంతోషం లేకుండా స్వీకరించే సమత్వం, స్థిరత్వం, శాంతి ఆమెకు సొంతమైనాయి. "పేరుతో స్త్రీ అయితేనేమి, భావించేందుకు పురుషరూపం" అనే రీతిలో పురుషత్వం, "ఎక్కడికి వెళ్ళినా కలికి భయం లేదు. పందికి సుఖంలేదు వినండన్నా!" అని చాటే "పై కెక్కి దిగడం వీరునికి అభిమతం కాదు. శివశరణునికి వెనుకంజ వేయడం సరికాదు" అని ఘోషించే అగ్నిమయమైన హృదయం ఆమెది. అసంభవాల్ని సాధ్యం చేసే ప్రేమ శిశువు ఈ జగానికి నేను బిరుదు కట్టాను.

కామ-క్రోధ- లోభ, మోహ- మద మాత్సర్యాలకు నేను కాలిలో స్తంభనం అందించాను. గురుకృప అనే తలపాగా పెట్టుకుని, మహాశరణ అనే తిలకాన్ని ధరించి, శివశరణు అనే ఆయుధాన్ని స్వీకరించి నిన్ను ఆరాధిస్తా, గెలుస్తా! వదులు వదులు కర్మమా! నిన్ను చంపకుండా వదలను. నా మాటలకు తిరుగులేదు విను! చెడని శివశరణనే ఆయుధంతో నిన్ను చంపుతా! గెలుస్తా నేను! బ్రహ్మపాశాన్ని తొలగించి, విష్ణుమాయ అనే ఆవరణను ఛేదించి, నా

యజమాని చెన్నమల్లికార్జునయ్య తలనిండా ఆయన స్మృతులు నింపుకుని పీడిస్తా నేను!' అని పలికే ఉద్ధటతనం పెల్లుబికింది ఆమెలో! ఇలా సతీభావంలోని కుసుమకోమలత్వం, వీరనారిలోని వజ్రకాఠిన్యం - రెండూ ఆమెలో పడుగు పేకల్లా అల్లుకు పోయాయి. అక్క సాహిత్యంలో జీవితంలోని ఆర్జవాన్ని, భయంకరత్వాన్ని జీవుల మానవత్వాన్ని, దానవత్వాన్ని రెండింటినీ, ప్రకృతిలోని శుభకరత్వాన్ని, భయంకరత్వాన్ని కనులారా చూచిన అక్క లేత అరటిలోని కోమలత్వాన్ని విరజిమ్ముతుంది. కాఠిన్యాన్ని కూడ ప్రదర్శించగల్గుతుంది.

సతిపతి భావాల వచనాల్ని రచించిన వారిలో బసవణ్ణ, ఉరిలింగదేవులు, గజేశ మసణయ్య మున్నగువారు అగ్రగణ్యులు. అయితే వారెంతైనా పురుషులే! శరణ సతిత్వ సాధనలో స్త్రీ హృదయాన్ని కల్పించుకుని స్త్రీ భావాలకు వర్ణనాత్మకవర్ణాల్ని అందించింది. అయితే అక్క సతి పతి భావం సహజ సుందరం; అప్రయత్నలబ్ధం; స్వయంస్ఫూర్తితో వచ్చింది. ఎన్నడూ తరగనిది. అలాగే ఆమె సతి పతి భావాల వచనాల్లో ఎవరూ అనుకరించలేని హృదయంగమత్వం ఉంది. అనన్యత ఉంది. అనుపమానత్వం ఉంది. ఈ భావానికి ఆమె సంవేదనశీలమైన హృదయం సంపూర్ణంగా స్పందించడం వల్ల సహజంగా, స్వతంత్రంగా, స్పందించడం వల్ల ఈ వచనాలకు ఎక్కడలేని విశేషగుణం, వినూత్నతత్వం, అపూర్వత్వం కల్గాయి.

"చక్కగా స్నానించి బంగరు వస్త్రాలు దాల్చి
దివ్యశరీరధారివై పురుషా రారా!
పుణ్యరత్నమా రారా!

నీ విరహం నా ప్రాణాలకు కరువు రావయ్యా
చన్నమల్లికార్జునయ్యా వచ్చాడని
బట్టల్ని చూసి నోరెండ బెట్టుకున్నా"





తపించే మనస్సు తలక్రిందులైందమ్మ
తిరిగి వీచేగాలి అగ్నిశిఖ అయిందమ్మ
వెన్నెల ఎండలా మారింది తల్లి!
హోళలు పన్ను అధికారిలా తళమళ పడ్డానమ్మా!
బుద్ధి చెప్పి పిలుచుకొని రండమ్మా!
చెన్నమల్లికార్జునునికి రెండింటిపై కోపమమ్మా!"

"నూనెలా కరిగి కరిగి, రాయిలా పగిలి పగిలి
స్వప్నంలో తపించి నేను బాధపడ్డాను!
ఆవిరిలోని వేడిలా నేను కుమిలి కమిలిపోయా!
ఆపదలో నా సఖులెవ్వరూ కానరాయె!
కన్పించని శరీరాన్ని ఎన్నుకుని
కలవని సుఖంతో కలిసి
నన్ను నీవు కరుణించు చెన్నమల్లికార్జునా!"

ఇలాంటి భావం అపూర్వమేం కాకున్నా ఇక్కడి భాషా సౌందర్యం, అనుప్రాసల శబ్దాలు 'బట్టల్ని చూసి నోరెండ బెట్టుకుంటా' అనే శబ్దాల్లో ఉన్న విచిత్రత, 'హోళలు పన్ను అధికారి' అనే క్రొత్త పోలిక, 'నూనెలా కరిగి కరిగి, రాయిలా బాగా సమసి సమసి' అనడంలోని ఔచిత్యం, ' కన్పించని శరీరాన్ని ఎన్నుకుని కలవని సుఖంలో కలిసి అనే చోట ఉండే అనుభావ సూక్ష్మతలు ఈ వచనానికి ఒక అద్భుతమైన అందాన్ని, అతిశయాన్ని, వైశిష్ట్యాన్ని అందించాయి. సౌందర్య ముద్ర వేశాయి.

అలాగే, అక్క తన ప్రియుడు తన 'మనస్సును వశీకరించడాన్ని, శరీరాన్ని వశీకరించడాన్ని, సుఖాన్ని అంగీకరించడాన్ని, ఉనికిని గుర్తించడాన్ని' వర్ణించేవేళ 'పగటి బృందానికి మేకపోతు వంగిం'దనీ, చీకటి బృందానికి సమయంచూసి ఎక్కిందనీ, 'కలలో మనస్సు కలిసి పోయి మనసులో మైమరచి కలిసిపోవడాన్నీ,

చెన్నమల్లికార్జునుని వలచి, కలిసి కనులు తెరవడాన్ని, కలకని, కలలో "చిన్న చిన్న జడల ఒక గొరవయ్య వచ్చి కన్పించడాన్ని' విరహాగ్ని హెచ్చిన వేళలో 'అగ్ని లేని వేడిలో కమలిపోవడాన్ని, పెరుగుటయే లేని బాధలో నలగడాన్ని వివరించేవేళ. 'పగలు నాల్గు జాములు అతని బాధలో రాత్రి నాల్గు జాములు అతని వికలావస్థలో ఉండడాన్ని, అతని వలపును తలచి ఆకలి, దప్పిక, నిద్రల్ని మరచిపోవడం గురించి వర్తించేవేళ "వచ్చాడని బట్టలు చూసి, రాకుంటే కరిగి బాధపడడాన్ని, ఆలస్యమైతే రగిలిపోవడాన్ని, "చెన్నమల్లికార్జునుని ఒక్క రాత్రి విడిచిపెడితే తోడు లేని చక్రవాకం"లా మారిపోవడాన్ని వర్ణించే తరుణంలో "చూస్తూ చూస్తూ కళ్ళు మూయడాన్ని, వింటూ వింటూ మైమరచి పడిపోవడాన్ని పరచిన శయ్యపై ఆసక్తిలేకుండా పోవడాన్ని, కలిసే బృందాన్ని ఏమిటి అని తెలియక విస్మరించడాన్ని వివరించే వేళ "కామించి, కల్పించి, కందిపోయి క్రుంగిపోవడాన్ని మోహించి, ముద్దులాడి మైమరచిపోవడాన్ని తెరవక వీడక సంతసించి, నమ్మడాన్ని ఇంత జరిగీ అతడు నచ్చనిచోట నేనెందుకమ్మా" అని వ్యాకులతను వివరించాక అక్కడక్కడ పూర్వ పరిచిత స్వరం విన్పించినట్లే అనిపించవచ్చు. అయినా అంతటా సౌందర్యాన్ని గ్రహించిన అక్కమహాదేవితనం వీటన్నిటికి క్రొత్త సౌందర్యాన్ని ప్రసాదించిందని నిర్భయంగా చెప్పవచ్చు.

అదే ఈ క్రింది వచనాల్ని గమనించాక అక్కగారి స్వోపజ్ఞత అనే పక్షి రెక్కలు విప్పి ఎగరడం కన్పిస్తుంది.

గొడ్రాలు తల్లి వేదనను గ్రహిస్తుందా?
సవతి తల్లి ప్రేమగా చూసుకుంటుందా?
అనుభవించిన బాధను అనుభవించని
వారెలా గ్రహిస్తారు?





చెన్నమల్లికార్జునుడు శరీరంలో
ప్రేమ రగిల్చి - నాలో బాధా జ్వాలలు
రేకెత్తించడం మీకేం తెలుసు ఓ తల్లులారా!"

"బలవంతుని పగను తొలగించగా
పేదవాడు బయలుదేరినట్లైంది.
నీవు పీడించి పీడించి చూడుము మావాళ్ళను!
నా కిది విధియా? చెప్పు!
నా కోరికలన్నీ ఒక్క సారి
గాలికి ఎగిరిపోయినట్లయింది !
నన్ను నీవే కరుణిస్తావయ్యా
చన్నమల్లికార్జునా?"

"కత్తి సుందరంగా కన్పించిన విధం చూడు
అన్నిచోట్ల రెక్కలు పడకుండా నడవాలి
ఆలింగనం చేసుకుంటే ఎముకలు
పొడి పొడిగా మారాలి.
చలిలో వెచ్చదనాన్ని తెలుసుకునేట్లు ఉండాలి
కత్తికి వచ్చింది చన్నమల్లికార్జునుని స్నేహం!"

ఇలాంటి విరళ వచనాల అవిరళ కాంతి పుంజంలో సంతృప్తులమై ముందుకు సాగాక, వంద మనోహర భావగీతాల సత్వసారాన్ని అందుకున్నట్లుగా కన్పించే క్రింది వచనాలు రమణీయాలు. మమ్మల్ని మూకవిస్మితులుగా చేస్తాయి.

"ఒకసారి కాముని పాదాలు పట్టుకుంటా
మరోసారి చంద్రుణ్ణి పైట పరచి వేడుకుంటా!
ఈ విరహాన్ని కాల్చనీ!
నేనెవరికి ధైర్యం విడవాలి?
చెన్నమల్లికార్జునుడు దేవుడు

నన్ను అంగీకరించని కారణంగా
అందరికీ చులకనయ్యానమ్మా!"

"శయ్య బాగుంది. చూపే ఆభరణం
ఆలింగనమే వస్త్రం చుంబనమే ఆరోహణం
సరసమే తాంబూలం,
ఉత్సాహమే అనులేపనం నాకు!
చెన్నమల్లికార్జునుని సాంగత్యం
పీరమ సుఖభరిత మమ్మా!"

విశ్లేషించిన కొలదీ కొత్త అర్థాలు విరజిమ్మే, నవభావనలు వెదజల్లే వచనాలివి. అలాగే

"చిలిమిలి అని చదివే చిలుకల్లారా!
మీరు చూశారా! మీరు చూశారా?
సరోవరాల్లో సంచరించే హంసల్లారా?
మీరు చూశారా? మీరు చూశారా?
గొంతెత్తి పాడే కోకిలలారా?
మీరు చూశారా? మీరు చూశారా?
గుంపుగా చేరి నాదం చేసే తుమ్మెదలారా?
మీరు చూశారా? మీరు చూశారా?
కొండల్లో.. గుహల్లో నాట్యం చేసే నెమలుల్లారా!
మీరు చూశారా? మీరు చూశారా?
చెన్నమల్లికార్జున దేవుడెక్కడున్నాడు?
తెలిస్తే మీరు చెప్పండి!"

అనే వచనంలో చాలా ఉత్సాహం, ఆతురత ఉంది. భావం పాతదే అని చెప్పవచ్చు. క్రింది వచనానికి సాటి ఏది?





వనమంతా నీవే
వనంలోని దేవతరువులన్నీ నీవే!
తరువులలో ఆడుకునే ఖగమృగాలన్నీ నీవే!
చెన్నమల్లికార్జున
సర్వభరితుడవై నాకెందుకు ముఖ్యం చూపవు?"

అక్కగారి శరణ సతిత్వ సాధన "మెరిసే ఎరుపు జడలపై వెన్నెల నాగమణి కర్ణ కుండలుడు' నుంచి ప్రారంభించి, "గండర గండడు లాంటి వారినంతా ఆడవాళ్ళుగా చేసి ఏలే మహాపురుషుడు" దాకా తన చెన్నమల్లికార్జునుని వివిధ రూపాల్ని దర్శించి చివరికి ఈ విశ్వదర్శనంలో కృతార్థమైనది.

అక్కగారి ఉక్కులాంటి వచనాల్ని కొన్నిటిని ఇదివరకే ఉదహరించాను. ఇంకా ఒకటి, రెండు వచనాల్ని ఉల్లేఖించాలి.

సేవకత్వపు మాటలు పెంచి చెప్పినచో
అప్పటికే నీకు కట్టాను మగవాడి పట్టాన్ని
సుగంధాన్ని పూసి, బొట్టు పెట్టి
చేతులు పట్టి పీఠాన్ని ఎక్కిన పిదప
కట్టిన ఆ రక్ష సడలిపోగా
ఇకపై నీపై ఆన చూడు! చెన్నమల్లికార్జునా!"

"ముంజేతిలో వీరకంకణం కట్టి
ముంగాలిలో ఆభరణాన్ని కట్టాను!
మగవాడి వస్త్రాలు ధరించానన్న
మాటల్ని మ్రింగాను!
చెన్నమల్లికార్జునా,
నీ పై ఆన అపకీర్తి తెచ్చానని అంటే
మీ ముద్దుల కూతురు కాదయ్యా ..

కాముని తలను ఛేదించి,
కాలుడి కళ్ళు పీకి
సూర్యచంద్రుల్ని పట్టి చూర్ణం చేసి
మ్రింగిన వాడికి పేరుపెట్టే
వాళ్ళెవరు చెప్పండి!
చంపితే శరణు అనడం మానను
తల తెగి పడితే ప్రాణం నీకర్పితం అంటాను"

ఈ వీరోక్తుల్ని చదివాక విరహిణిగా విలపించే అక్క ఒక్కసారిగా కలిగా ఆర్భాటం చేస్తున్నట్లు కన్పిస్తుంది. అక్కగారి సాహిత్యానికి ఉండే ముఖాలు ఈ రెండే అని ఎవరూ గ్రహించరాదు. గ్రహించలేరు! వాటి ప్రముఖ లక్షణాలనే దృష్టితో వీటి విస్తృత చర్చ సాగింది. అంతే! అభ్యాసం చేసే వాళ్ళకు అక్షయ పాత్రలా అక్క సాహిత్యం దాని స్వారస్యం తగ్గే ప్రసక్తే లేదు. ఇక్కడ చూడండి - అహింసాతత్వబోధ అనే శుష్కవిషయాన్ని ఎంత రమణీయంగా చెప్పిందో అక్క

చేపలు పట్టేవాడొకడు నీటిలోదిగి వెతికి
అనేక ప్రాణుల్ని చంపి సంతోషించును!
తన ఇంట్లో ఒక శిశువు చనిపోతే
దానికి సతమతమైనట్లు
ప్రాణుల కోసం ఏల బాధ పడడు?
అదెలా అంటే
స్వాత్మానమితరం చేతి భిన్నంతు నైవ దృశ్యతాః
సర్వంచిజ్యోతిరేవేతియః పశ్యతి సపశ్యతి
అన్నట్లు ఆ చేపలుపట్టే వాడి దుఃఖం
ప్రపంచానికంతా పరిహాసం !





ఇది కారణం చెన్నమల్లికార్జునుని భక్తులై ఉండి
జీవహింస చేసే మాదిగవాళ్ళను
ఏమంటానయ్యా?"

తొలుత జలంలోని శిశువు, ఇంట్లోని శిశువు వేరువేరు కాదని వివరించి, ఇంట్లోని శిశువు కోసం ఏడ్చే పితృహృదయం నీటిలోని శిశువుల కోసం కూడ ఏడ్వాలనే అంశాన్ని అర్థమయ్యేట్లు నిరూపించి, శాస్త్రప్రమాణం కోరేవారికి పైన అలా శ్లోకాన్ని అందించి జీవహింస చేసేవాళ్ళే మాదిగలని ఘోషించి బసవణ్ణ గారి "చంపేవాడే మాదిగ" అనే సూత్రాన్ని సమర్థించి "అహింస" అనే శబ్దాన్నే ప్రయోగించకుండా అహింసాతత్వాన్ని సమర్థించిన అక్కగారి ఈ వచనం ఆమె వైశిష్ట్యానికి మరో మచ్చు తునక!

సూత్రాత్మక వచనాలూ ఉన్నాయి. వాటి సౌందర్యాన్ని కొంచెం ఆస్వాదించవచ్చు.

సూర్యుడిలా ఉంది జ్ఞానం
సూర్యకిరణంలా ఉంది భక్తి
సూర్యుణ్ణి విడిచి కిరణాలు లేవు
కిరణాలు విడిచి సూరీడు లేడు
జ్ఞానంలేని భక్తి,
భక్తిలేని జ్ఞానం ఎలాంటిది.
చెన్నమల్లికార్జునా?
లోక చేష్టలకు రవి బీజం అయినట్లు
ఇంద్రియాల క్రియలకు మనస్సే బీజం
నాకుండేది ఒకటే మనస్సు
ఆ మనస్సు నీలో కలిసిన తర్వాత
నాకు సంసారముంటుందా

చెన్నమల్లికార్జునా?"

ఇక అక్క వచనాల్లో రాజిల్లే సారోక్తుల సాదృశ్యాల రుచిని ఆస్వాదించవచ్చు.

"నీ జ్ఞానపు నరకమే మోక్షం చూడయ్యా
నిన్ను గ్రహించని ముక్తియే నరకం చూడయ్యా

"రత్నాల సంకెల అయినా ఆభరణం కదా!
ముత్యాల వల అయినా బంధనం కాదా

"ప్రాణ పరిమళాలున్న వేళ
కుసుమాల అవసరం దేనికి?

"విరిగిన వెదురులో మళ్ళీ కళ వస్తుందా?

పంచేంద్రియాల్లో ఒక ఇంద్రియానికి ప్రియమైతే చాలదా?

"అబద్ధమనేది మైల.
అబద్ధం చెప్పి లింగాన్ని పూజిస్తే
నదిలో విత్తనాలు వేసి పంట కావాలని కోరినట్లే".

"తన వాళ్ళంటే శివుడు మన్నిస్తాడా?
మరీచిక జలంలో ఉన్న ప్రాణి
వ్యాధుని వలలో చిక్కుకుంటుందా?

"రాయి మోసి సముద్రంలో మునిగితే
ఆపదలకు అంతు ఉంటుందా?

"సాలె పురుగు ప్రేమతో తన వలను అల్లి
అందులోనే చిక్కుకుని చనిపోయినట్లు

"చెరువు కట్ట తెగిపోయి
వరదలై పారినట్లు





"ఎదుగుతున్న మొక్కపై వాన కురిసినట్లు.

"బియ్యంలేని పొట్టును భూమిలో నాటితే
అది పుష్పించి ఫలించేదెలా?

"సింహశాబకాన్ని వీధిలో కుక్క
తినేస్తే అవమానం ఎవరిది?

"చాకలి నీటిలో ఉన్నా
నోరెండి చనిపోయినట్లు
మనలో మహాచైతన్యాన్ని గ్రహించరు!

"తల్లి బాధ పడితే ఒడిలోని
శిశువు బాధ పడినట్లు
భక్తులు బాధపడితే తాను బాధ పడతాడు చూడు"

"నడవని భాష, ఆచరణలో లేని నైపుణ్యం,
చిత్తరువులోని స్త్రీ శృంగారమనే
ప్రయోజనం ఎలా కల్గుతుంది?

"పిల్లనగ్రోవి స్వరానికి సర్పం తల ఊపినా
లోపల విషం కక్కే స్వభావాన్ని విడువదక్క"

"భూమియే కావలిగా ఉంటే
దొంగ ఎక్కడికి వెళతాడు?"

"శిశువులో దోషాలు లెక్కిస్తారా.

"నది వరద తగ్గాక నదిని దాటించేవాడికి ఇంకేం పని?"

"కలయికల సుఖంకన్న విరహంలో ఉన్న సుఖమే శ్రేష్ఠం"

"చీకట్లో అద్దం చూసి బాధపడితినయ్యా!

ఇలాటి ఇంకా తటిల్లతలాంటి వాక్యాలు, మాణిక్యాలు అక్కగారి సాహిత్యంలో చాలా ఉన్నాయి. అక్క అనుభవ మంటపంలోని శరణులు, శరణురాండ్ర గురించి చెప్పింది.

**"భావం అనే పాలు, సుజ్ఞానమనే నెయ్యి,**
**పరమార్థమనే చక్కెరను అందించారు చూడు"**

అక్క తన సాహిత్యంలో ఈ త్రివిధామృతాన్ని మాకందించి మమ్మల్ని పోషించింది. ఈ త్రివిధామృతం కన్నడిగులకు ఎప్పటికీ పునరుజ్జీవనామృతం.





# అక్క గారి ఆలోచనామృతం

భావనిర్భరతతో సమానంగా బుద్ధి విలాసం ప్రకాశిస్తోంది అక్క కృతులలో. 'బుద్ధి హృదయాల విద్యుదాలింగనం' ఇక్కడ విరాజిల్లుతోంది. భావమనే పాలు, సుజ్ఞానం అనే నెయ్యి, పరమార్థమనే చక్కెరల్ని సేవించి ఎదిగిన అక్కగారి వాక్కులో ఈ మూడింటి స్వర సంగమాన్ని దర్శిస్తాం. ఒక అర్థంలో ఈ మూడింటికి హృదయమే జన్మస్థానమేమో అని అనిపిస్తుంది. అన్ని గొప్ప సత్యాలూ హృదయం నుండి వెలువడుతాయనే పాత మాట ఒకటుంది.* హృదయమే చరాచర విశ్వాన్ని బీజరూపంలో దాచుకుందన్న మాట కూడ ఒకటుంది. అక్కమహాదేవి విషయంలో ఇది నిజమేమో! ఆమె మెదడు ఆలోచించింది. ఆమె అనుభావం దర్శించింది. ఆమె హృదయ రసంలో తడిసి బయటికి విరజిమ్మడం వల్ల ఆమె సిద్ధాంతాలకు, పరమార్థానికి రస సౌందర్యం లభించింది. శుష్క తర్కం సాధించని దాన్ని, కఠిన శాస్త్రాధ్యయనం సాధించనిదాన్ని, వితండవాదం, అంతులేని చర్చ, నిష్ఫల ప్రవచనాదులు సాధించని దాని అక్క హృదయంలోని జ్ఞానం, అనుభావాలు సాధించాయి. హరిహరుని మహాదేవి రగళలోని ఒక భాగం ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

"తీగలు ప్రాకిన చర్చకు ప్రోద్బలంగా, భక్తి బీజాలు ఉండే ప్రాచీన గీతాల చిత్త భూమిలో నాటి, ఆనందాశ్రువుల్ని రాల్చి, పులకాంకురాల ఎరువు వేసి,

* యథా న్యగ్రోధబీజస్థః శక్తిరూపోమహాద్రుమ
తథా హృదయ బీజస్థం విశ్వమేతచ్చరాచరం

భక్తి జ్ఞానాలనే సూర్యచంద్రుల్ని వాడుకునీ, ప్రసంగ కుసుమాల్ని అలంకరించి, పరిణామ ఫలాన్ని అందించిన గీత వృక్షాలతో శివానుభావానికి నవ గీతాన్ని ఆలాపించి, భక్తిరసంలో మునిగి, శివజ్ఞానంలో తేలి, వైరాగ్యాన్ని ధరించి, మాయను ప్రక్షాళించి, నిత్యసుఖంలో బ్రతికి, భక్తిరసంలో మునిగి శివజ్ఞానంలోంచి లేచిన అక్క కృతులలో ఓతప్రోతంగా నిండిన ఆలోచనామృతం అనుభవైక గమ్యం.

అక్కకు తన అల్పాయుర్దాయం గురించిన పూర్వజ్ఞానం ఉండిందేమో అని అనిపిస్తుంది. ఆమె ఈ వచనాన్ని చదివిన వేళ -

"ఉదయాస్తమాలనబడే రెండు కోనేళ్లలో
ఆయుష్షమనే రాశిని కొలిచి
తీరే ముందే శివుణ్ణి స్మరించండి
శివుణ్ణి స్మరించండి !
ఈ జన్మ నాతో పూర్తిగా లేదు!
ఆయువు పోతోంది. భవిష్యత్తు
తొలగిపోతోంది.
కలిసిన సతి, సుతులు తమంతట
తామే ప్రవహించి వెళ్లి పోతున్నారు.
వద్దు వద్దు వంధ్యగా
చెడిపోవద్దు బయలులో మనసా!
చెన్నమల్లికార్జునుని శరణుల
సాంగత్యంలో బాధ్యతతో
బ్రతుకును చూసిన మనసా!
చెడిపోకుండా చెడిపోకుండా
శివుని పాదాలు పట్టుకోండి
మా శరీరం శాశ్వతం కాదు చూడండి!"





"భూమి భూమిలో కలవకముందు
నీరు నీళ్లలో కలవకముందు
తేజస్సు తేజస్సులో కలవకముందు
వాయువు వాయువులో కలవక ముందు
ఆకాశం ఆకాశంలో కలవక ముందు
పంచేంద్రియాలన్నీ పట్టు తప్పక ముందే
చెన్నమల్లికార్జునుని శరణు వేడండి!"

ఈ వాక్యాల్ని పరికిస్తే తనకు అల్పాయుర్దాయం ఉందనే అంశం తేటతెల్ల మౌతుంది. మనకు కూడా ముందు హెచ్చరిక ఉంది. మనం అంతా చిరంజీవుల మని భావిస్తూ ఏవో గాలి గోపురాలు కడుతున్నాం. హఠాత్తుగా వచ్చే మృత్యువు ఆలింగనంతో అవన్నీ బూడిదైపోతాయి. ఉన్న కొద్దిపాటి ఆయుర్దాయాన్ని సద్వినియోగం చేసుకున్నవాడే నేర్పరి. ఈ సద్వినియోగం ఖచ్చితంగా జరగాలి. అక్కకు చాలా చిన్న ప్రాయంలోనే ఈ సమస్య ఎదురై ఉండాలి.

"నా శరీరం మన్ను, జీవం బయలు;
దేన్ని పట్టుకోవాలయ్యా?
నిన్ను ఏ రీతిలో స్మరింతునయ్యా?
"ముందుగోయి వెనుక నుయ్యి
ఏం చేయాలో చెప్పవయ్యా!
వెనుక చెరువు - ముందు వల
ఇక శాంతి ఎక్కడిది చెప్ప?"

ఈ ప్రశ్నకు జవాబు వెతికేవేళలో మానవజీవితానికి సంబంధించిన దుర్భర చిత్రమే అక్క కళ్ళ ముందు కన్పించినట్లుంది.

"నేను పుట్టినపుడు సంసారం పుట్టింది;
సంసారం పుట్టిన వేళ అజ్ఞానం పుట్టింది;
అజ్ఞానం పుట్టిన చోట ఆశ పుట్టింది;
ఆశ పుట్టిన చోట కోపం పుట్టింది;
ఆ కోపాగ్ని నల్లని పొగల ముసుగులో
నేను నిన్ను మరిచి సంసారదుఃఖానికి
బలి అయ్యాను!

విషాదపు చిత్రణ ఇది యథార్థం; సమంజసమైన కారణ మీమాంస! మనిషి జన్మతోనే పుడుతుంది ఈ దుర్ఘటన. పుట్టే ముందు అతడేమై ఉన్నాడు? ఎవరికీ తెలియదు.

అనేకుల అభిప్రాయం ప్రకారం విశ్వాత్మలో కలిసి మూలరహితుడై ఉన్నాడు. పుట్టినంతనే సంసారం, దాంతో పాటు అజ్ఞానం, దాంతో ఆశ, దాంతో కోపం; ఆ కోపం కారణంగా సాంసారిక దుఃఖం. జన్మతోనే ప్రారంభమయ్యే ఈ విషాదాంత నాటకానికి చివరి పరదా లాగడమే మరణం అని పైకి గోచరించడం సహజం. దాన్నే జననం, బంధనం, చావు, విడుదల అని కొందరు తీర్మానిస్తే ఆశ్చర్యమేమీ లేదు. "అయితే ఈ జనన మరణాల మధ్యలో ఉండే కాలమైన జీవితంలో దుఃఖానికి నివారణోపాయమే లేదా?" అనేది బుద్ధుడు మొదలుకొని నేటి మేధావుల దాకా అందరినీ పీడించిన, పీడిస్తున్న ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు అక్కగారి పై వచనంలో ఉంది. మరచి పొందిన దుఃఖాన్ని మనమే తెలుసుకుని పరిష్కరించుకోవాలి, ప్రతిలోమగతిలో మరపు వెళ్ళాక కోపం తొలగిపోతుంది. కోపం నశించాక ఆశ నశిస్తుంది. ఆశ నశించి అజ్ఞానం తొలగుతుంది. తొలగిన వేళ సంసారం బంధనం కాకుండా ఆభరణమౌతుంది. మొత్తానికి మరిచిపోయే మానవుడు జ్ఞాన శరణుడైనవేళ దుఃఖం కూకటి వేళ్ళతో పెళ్ళగించబడుతుంది!





తెలుసుకుని శరణుడు కావాలనడం సరే ! అయితే దేన్ని తెలుసుకోవాలి? ఇంకా నరుడు తెలుసుకున్న దాని కన్న తెలుసుకోకుండా ఉండిందే ఎక్కువగా ఉంది. ఇపుడు అతడు గ్రహించింది తక్కువేమీ కాదు. పెద్దదే! అయితే అతనికి దుఃఖనివృత్తి కాలేదు కదా? అక్క చెప్పింది ఈ జ్ఞానం కాదు; "నేను మిమ్మల్ని మరిచి సాంసారిక దుఃఖానికి బలైపోయాను" అంటుంది. అతనిని విస్మరించడం వల్ల వచ్చిన దుఃఖం అతణ్ణి తెలుసుకోవడం ద్వారా తొలగిపోవాలి. ఇప్పటి జ్ఞానం అతణ్ణి మినహాయించిన జ్ఞానం. శివునితో పాటు ఉండని జ్ఞానం. అంకెలు లేని సున్నా లాంటిది. దీన్నే పైన ఉన్న వచనంలోని రెండు పంక్తుల్లో అక్క స్పష్టీకరించింది.

"నీవు కరుణతో ఎత్తి నా విస్మృతిని విభజించి
నీ పాదాన్ని తెలుసుకునేట్లు చేయవయ్యా
చెన్నమల్లికార్జునా!"

అతనిని తెలుసుకునేంతవరకు వేరే దేన్ని తెలుసుకున్నా నిష్ఫలం.* అతనిని

---

* అన్నిటినీ తెలుసుకుని ఫలమేమి?
మళ్ళీ అన్నిటిని ఎరిగి ఫలమేమి?
తనను తాను తెలుసుకోక అక్క?
తన జ్ఞానం ఏర్పడ్డాక ఎదురుగా వినేందుకేముంటుంది?
మీ జ్ఞానం రావడంతో నన్ను నేను గ్రహించాను
చెన్నమల్లికార్జునా!
చెట్టుండి ప్రయోజనమేమి నీడలేక?
ధనముండి ఫలమేమి దయలేకుంటే?
పశువుండి ఫలమేమి పాలులేకుండా?
రూపం ఉండి ఫలమేమి గుణం లేకుంటే?
నేనుండి ఫలమేమి నీ జ్ఞానం లేకుంటే
చెన్నమల్లికార్జునా"

గ్రహించేందుకు అతడే సహకరించాలి. అతడు కరుణతో చేరదీసి తన పాదాల జ్ఞానాన్ని అందించకుంటే అతణ్ణి గ్రహించడం సాధ్యం కాదు. అందుకే అక్క విన్నవించుకుంది.. "చెన్నమల్లికార్జునా! నీవు జ్ఞానమై నాకు స్ఫురించడం వల్ల మీ వల్ల మిమ్మల్ని తెలుసుకున్నానయ్యా!"

ఇది జరిగే ముందు:

"నన్ను నేను తెలుసుకునే ముందు
నీవెక్కడుంటివి చెప్పవయ్యా
బంగారంలోని రంగులా నాలో ఉన్నావయ్యా
నాలో ఉండి కన్పించని భేదాన్ని
మీలో చూశాను చూడు
చెన్నమల్లికార్జునా!"

అనే మాటలు సహజం. తెలుసుకుంటే హృదయం మధ్యలోనే విస్మరించారా? ఎంత దూరం అవతల? ఎవరు కొలుస్తారు అచింత్యమైన ఆ అంతరాన్ని? హృదయంలో ఉన్నవాడే గర్వాన్ని అణచి శరీరంలోకి ప్రవేశించినట్లు-

"దేవా! నా హృదయ కమలంలో
ప్రజ్వలించు వెలుగా
దేవా! నా మనసులో ప్రకాశించే వెలుగులోకి!
గురువా రా! వరమా రా ! పరమా రా!
దేవదేవా! వీరభద్ర! రుద్ర! దురితదూర!
విశ్వరూప బార!
రారా ఫలమా, ఫల రసమా రసంలోని
రుచిలోని సుఖమా రారా!
రారా సిద్ధా! భవవిరుద్ధా!
సుప్రసిద్ధ మల్లినాథా!





అని గ్రహించాలి.

ఇది ప్రేమాతిశయంతో, భక్తితో సాధ్యం. వచనాల రూపంలో ప్రవహించిన అక్కగారి భక్తి ఉత్కటతను, వికలత్వాల్ని, ఆధ్యాత్మిక విరహ విహ్వలతను, తీవ్రతను, సాంద్రతను ఇది వరకే గమనించాం. ఇప్పుడు స్వరవచనంగా విరజిమ్మిన ఆమె అనన్యశరణ్యతను కూడ చూడవచ్చు.

"నమ్మితి గురువా! నమ్మితి స్వామి నమ్మితి
అంబికారమణ! నీవు దాటించేవాడివి
నదిలో ప్రవాహాన్ని చూడవయ్య
ప్రవాహంలో ఒత్తిడి ఎక్కువ చూడు నావికా!
నన్ను లాక్కో నీవు నావికా!
తరంగాలెన్నో చూడు నావికా!
ఎగిరెగిరి వస్తున్నాయి నావికా!
నన్ను తోసి వేస్తున్నాయి
నీవు నన్ను దూరం చేయకు నావికా!

....................................

సత్యమనే జన్మ నావికా !
భక్తి అనే మార్గం నావికా !
నిత్యముక్తుడౌ మన
చెన్న మల్లికార్జునుని
ముక్తి మంటపానికి తీసుకు వెళ్ళు నావికా!

జీవితమనే నదిలో శరీరమనే పడవ బయలుదేరింది. దీనికి శివుడే నావికుడై నదిని దాటించాలి. జన్మ సత్యమట! సద్భక్తి మార్గమాట! ఇలా సాగితే జన్మ ఒక దుర్ఘటన కాకుండ సత్యశోధనం జరుగుతుంది. భక్తి కూడా స్వర్గం కావాలనీ నరకం వద్దనే భావించి ప్రదర్శించే భక్తి కాకుండ, ఫలాపేక్షతో చేసే భక్తి

కాకుండ జీవననౌకకు జలమార్గం ఔతుంది. అరేబియాలోని రాబియా తల్లి ఒక సారి నగరవీధిలో బయలుదేరిందట! ఆమె ఒక చేతిలో నిప్పు, మరో చేతిలో నీరుండిందట! ఎవరో అడిగారట - "ఈ నిప్పు, నీరు తీసుకుని వెళ్ళడంలో ఉద్దేశం ఏమిటి తల్లీ!" అని. ఆ మహాతల్లి అందట "ఈ నీటితో నరక జ్వాలల్ని ఆర్పేందుకు బయలుదేరాను. ఈ నిప్పుతో స్వర్గాన్ని భస్మీపటలం చేసేందుకు బయల్దేరాను. అప్పుడైనా లోకంలోని జీవులు నరకభయం, స్వర్గపు ఆశ లేకుండా విశుద్ధ భక్తిని ప్రదర్శించి ధన్యులు కానీ!" అని.

ఇపుడు భక్తి వ్యాపారపు సరుకుగా మారింది. ఈ పూజకు ఇలాంటి ఫలం, ఆ పూజకు ఇంత కానుక, ఇంత దక్షిణ, ఇంత సమయం అని ధరల పట్టికను అంటించారు. అక్కడ ధర్మపు దళారీల హడావిడి. మఠాల్లో, మందిరాల్లో పూజారి, పురోహితుడు, యోగి జంగముడు, పారుపత్యదారుడు, కాపలాదారుడు; అందరూ ముగ్ధులైన భక్తుల శరీర చర్మాన్ని ఒలిచేవాళ్ళే! అక్క కూడ దీని గురించి చాలా నిష్ఠురంగా చెప్పింది:

"నిత్యతృప్తునికి నైవేద్యపు రీతులెందుకు?
నిత్యం శుభ్రంగా ఉండే వానికి అభిషేకం దేనికి?
స్వయంప్రకాశరూపుడికి దీపారాధన ఎందుకు?
సువాసనలతో సూక్ష్మ గంధ కర్పూరాలతో
తెల్లగా మెరిసే వానికి పుష్పాలెందుకు?
మంత్రంలో మనస్సుకు విశ్వాసం లేక
అహంకారానికి బలైన
భక్తి అనే సాధనాన్ని పెట్టి
18 మాల జన్మలు ఎత్తడం వల్ల
మా అరచేతిలో ముక్తిని
పారవేయవయ్యా!"





ఇలాంటి స్వార్థ భరిత భక్తిని ప్రదర్శించడం కన్న స్వర్గానికి నిప్పంటించమంది రాబియ. ముక్తినే తీసిపడేయండన్నది మహాదేవి. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి శైవులలోనే వర్గీకరణం చేసి వేసింది.

"జాతిశైవులు అజాతి శైవులని రెండు విధాలుగా ఉన్నారయ్యా
జాతి శైవులనే వాళ్ళు శివునికి భోగ స్త్రీలయ్యా
అజాతి శైవులనే వాళ్ళు శివునికి కుల స్త్రీలయ్యా,
జాతిశైవులనబడేవాళ్ళు సకల భోగాల్ని కోరి అనుభవిస్తారు!
ద్వారేయస్యమాతంగో వాయు వేగతురంగమా !
పూర్ణేందు వదనానార్యః శివపూజా విధేః ఫలం అన్నారు
ఇవన్నీ జాతి శైవులకు అందించిన భోగాలయ్యా!
అజాతి శైవులు గురులింగ జంగమాలకు
తనుమనధనాల్ని నివేదించి
సకల సూతక రహితులయ్యారయ్యా
అహం మహేశ్వర ప్రాణా: మమప్రాణాః మహేశ్వరః
తథైకం నిష్క్రియం భూయాదన్యల్లింగైక్యమేవచ"
ఇదే కారణం, సర్వేశ్వర చెన్నమల్లికార్జునుని
భక్తి కాయమనే ఐక్యపదవిని అజాతి
శైవులకు అందిస్తాడయ్యా!"

శరీరం భక్తి శరీరం అయితే చాలు. అదే ఐక్యపదం. అంగం లింగపు అంగమయ్యే రీతి. ఇది శరణసతిత్వపు చరమలక్ష్యం. దీన్ని అతిక్రమించి స్వర్గాది భోగాలకు అలమటించడం కాముకుల రీతినీతి! ఇది శరణుల మార్గం కాదు. 'చిన్న వాళ్ళ సమారాధన' !

"అన్నాన్ని అందించే వారికి ధాన్యం విసిరే లోకం
అర్థాన్ని అందించే వారికి రాళ్ళు విసిరే లోకం

స్త్రీ, బంగారం, నేల - మూడింటిని
కళ్ళతో చూసి, చెవులతో విని
చేతితో స్పర్శించి చేసే భక్తి
చిన్న వాళ్ళ సమారాధన అయింది!
తనను సమర్పించి తృప్తి పడేవాళ్ళను
నాకు చూపించరా
శ్రీ గిరి చెన్న మల్లికార్జునా!"

తనను అర్పించి సంతృప్తి పడే భక్తి -

కాయం ప్రత్యేకంగా నీకు అర్పితమైంది;
ఇంద్రియాలు ప్రత్యేకంగా నీకు అర్పితమైంది
నేనొక విషయం ఎరుగనయ్యా!
నా గతి నీవై, నా మతి నీవై
ప్రాణమే నీకర్పితమైంది!
నిన్ను విడిచి వేరే వ్యక్తిని స్మరిస్తే
నీపై ఆన నీ ఆన
చెన్నమల్లికార్జున"

అనే భక్తి.

ఈ భక్తి విస్మరించిన అతణ్ణి గ్రహించేట్లు చేస్తుంది; అతనిని గ్రహించిన తక్షణం తనను గ్రహించడం సాధ్యమౌతుంది; తనను తెలుసుకున్నాక భేదం లేదు. "తనను తాను తెలుసుకుని తానుగా మారితే చెన్న మల్లికార్జునలింగం తాను వేరేకాదు".

తనకు తన జ్ఞానమే గురువు నిజం. అయితే జ్ఞానానికి జ్ఞానసముపార్జన ముగియదు. లోపలి జ్ఞానానికి తగినట్లుగా బయటి ఆచారం ఉండాలి. దీన్ని





సాధించ కుండా గ్రహించానంటే ఆచారాన్ని విసనీలీరిస్తే సాధనకు సిద్ధి భించదు.

"జ్ఞానం సాధ్యమైందని
గురులింగ జంగముల వీడవచ్చా?
సంశయాలు తొలగి అఖండజ్ఞాన మైందని
పరధనాన్ని పరస్త్రీని అనుభవించవచ్చా?
'యత్ర జీవస్తత్ర శివః' అనే అభిన్న
జ్ఞానం కల్గిందని
కుక్క - పంది - కోడి పిల్లలతో కలిసి తినవచ్చా?
భావంలో తన నిజమైన స్థానాన్ని తెలుసుకోవాలి
సుజ్ఞానం - సత్క్రియ సునీతి-మార్గంలో వర్తించాలి!
ఇలా కాకుండ జ్ఞానమైందని
తన మనస్సుకు నచ్చినరీతి ప్రవర్తిస్తే
కుక్క గర్భంలో పుట్టించకుండా
విడుస్తాడా చెన్నమల్లికార్జునయ్యా!"

'ప్రేమ - జ్ఞానం - ఆచారం ఇది త్రిపుటి'. ప్రేమించి ప్రేమించబడాలి శివుణ్ణి! శివుని ప్రేమతో శివుని జ్ఞానం సాధ్యం కాగా దాని బలంతో తనను తాను తెలుసుకోవాలి. తెలుసుకున్న వాటిని ఆచరించాలి. ఇది అక్క కానుక! దీన్ననుసరించే మార్గం మహాదేవి నిరూపించిన 'సుజ్ఞాన– సత్క్రియా – సునీతుల సుమార్గం! బయట మార్గాన్ని అనుసరిస్తుంటే లోపల భావం తన వాస్తవ స్థానాన్ని తెలుసుకుంటూ ఉండాలి' ఇది మహాదేవి అక్క మా తలపై పెట్టిన పూవు ! ఇది ఒక స్వపరిపూర్ణమైన, అన్ని విధాలుగా సమంజసమైన దృక్పథం. దీన్ని ఇంకా మథించి చూడడం అవసరం. ఎందుకంటే ఇది అక్క ఆలోచనామృతంలోని మీగడ.

అక్క బట్టి అజ్ఞానం -క్రియ-నీతి-మార్గాలనకుండా సుజ్ఞాన- సత్క్రియా - సునీతి- సుమార్గాలని విశేషంగా వివరించడం గమనార్హం. ప్రతి జ్ఞానంలో భేదం ఉంది. ప్రతి క్రియలో భేదం ఉంది. ప్రతి నీతిలో భేదం ఉంది. ప్రతిమార్గంలో భేదం ఉంది. దొంగతనం చేయడానికి ఆ వృత్తికి సంబంధించిన జ్ఞానం కావాలి. దొంగతనం ఒక క్రియ. దొంగిలించిన వస్తువుల్ని పంచుకోవడంలో దొంగలు ఒక నీతిని అనుసరిస్తారు. చౌర్యానికి ఒక మార్గముంది. అందువల్ల దొంగతనం మంచిదై పోతుందా ? అనుసరణీయమై పోతుందా!

మంచి లక్ష్యాన్ని, ఆ లక్ష్యాన్ని అందుకునేందుకు తగిన మార్గాన్ని చూపించేదే జ్ఞానం. లక్ష్యం-మార్గం రెండు మంచివి కావాలన్నారు గాంధీజీ లాంటి వారు; దారి ఏదైతేనేం? లక్ష్యం బాగుంటే చాలు అన్నారు మార్క్స లాంటి వారు. దీన్ని గ్రహించే అక్కమహాదేవి సుజ్ఞాన, సత్క్రియ, సునీతి, సుమార్గాల్ని బోధించింది. బ్రతికించే జ్ఞానం, బ్రతుకును పెంపొందించే క్రియ, దోపిడీని నియంత్రించే నీతి, అహింసాత్మకమార్గాలు ఇవేవీ లేని ఏ వ్యష్టి, సమష్టి వ్యవస్థలూ అవ్యవస్థలుగా మారకుండా ఉండజాలవు. ప్రపంచంలో కావాల్సినంత అనుపయుక్త జ్ఞానం ఉంది. అయితే జీవితాన్ని అభివృద్ధి పరచే సుగమంచేసే, వెలిగించే జ్ఞానం అధికంగా లేదు; ఎక్కడ చూసినా పీకి, తినే క్రియలే ! కష్టపడి, సంపాదించి పంచుకుని తినే ప్రక్రియలు చాలా తక్కువ; అంతటా కుటిల నీతి, కుతంత్రం, దౌష్ట్యాలే ఉన్నాయి. అయితే "అందరికి సమాన జీవితం, అందరికీ సమభాగం' అందించే నీతిలేదు. కావాల్సినన్ని చట్టాలున్నాయి. న్యాయబుద్ధి మిగలలేదు. కావాల్సినన్ని మార్గాలున్నాయి. లక్ష్యాన్ని అందించే మార్గం తెలియదు! దీని ఫలితం? కలహాలు, ఘర్షణలు, హింసా కాండలు, రక్తపాతం - ఇత్యాది భయంకర సంఘటనలు. పరిహారం?





సుజ్ఞానార్జన, సత్క్రియాచరణ, సునీతిపాలన, సుమార్గానుసరణలు ! వేరే శబ్దాల్లో చెప్పాలంటే అక్క సూత్రాల అనుష్ఠానం.

జ్ఞాన మార్గంలో ఎన్నెన్ని ఆటంకాలు! 'ఉందని, లేదని, ఉండి లేదని పలికే మాయ వేదాంతుల మాయ కాదు. "శరీరానికి నీడయై బాధించే, ప్రాణానికి మనసై పీడించే, మనసుకు స్మృతిగా బాధించే, స్మృతికి జ్ఞానంగా పీడించే మాయ - అన్నిటి కన్న పెద్ద దైన ఆటంకం! ఇలా వదలుతానని వదలని, వీడకుంటే వెంబడించే మాయకు భయపడక శివుణ్ణి 'నా మాయను తొలగించు' అని వేడితే "హరిని మ్రింగిన, బ్రహ్మను మ్రింగిన, ఇంద్రుని మ్రింగిన, తెలుసుకున్నాననే అజ్ఞానుల్ని తెలుసు అనుకునే కపటుల్ని మ్రింగిన" మాయను దాటవచ్చు.

"కావాలంటే ఉంటుందీ మాయ;
వద్దని పలికినా విడువదీ మాయ
నాకది విధియా?
చెన్నమల్లికార్జునయ్య;
అంగీకరించి మరిచిపోతే
మళ్ళీ ఉంటుందా?
రక్షింపుమయ్యా శివధో"

మాయ ఒక్కటే ఎందుకు? అనవసరమైనవన్నీ లేకుండాపోతాయి మల్లికార్జునునికి మొరపెట్టుకుంటే.

"పంచేంద్రియాల్ని సప్తధాతువుల్ని
అన్నిటినీ చంపి కూసింది కదా!
హరి, బ్రహ్మల గర్వాన్ని విరిచి, చంపి కూసింది కదా!
మహామునుల బృందాన్ని

కలవరపరిచి, చంపి, కూసింది కదా!
చెన్నమల్లికార్జునునికి శరణని నమ్మి
మొర పెట్టుకుంటే
భయం నిలిచిపోతుందయ్యా! '

నమ్మి మరిచిపోవాలి. ఏమని నమ్మి?

శివుడు వినోద ప్రియుడు. తన వినోదం కోసం జగత్తును సృష్టించి, తన వినోదం కోసమే ప్రపంచమంతా తిరిగి తన వినోదం కోసమే సాంసారిక దుఃఖాల్లో ప్రజల్ని పడవేస్తున్నాడు. వీటిని వినోద దృష్టితో స్వీకరించి, అతనితో మొరపెట్టుకుంటే మళ్ళీ అతడే మాయాపాశాన్ని తొలగించి వేస్తాడని నమ్మి! శివుడు వినోద ప్రియుడు; మనమూ వినోద ప్రియులం కావాలి. వినోదం లాగే భవదుఃఖాల్ని మాయాపాశాన్ని స్వీకరించి, వీటిని తొలగించమని ప్రార్థించాలి;

తన వినోదం కోసం తానే సృష్టించాడు
మొత్తం జగత్తును
తన వినోదం కోసం తానే మొత్తం
ప్రపంచమంతా తిరిగాడు.
తన వినోదం కోసమే ప్రజల్ని సాంసారిక దుఃఖాల్లో
ముంచాడు.
ఇవన్నీ చేసింది చెన్నమల్లికార్జునుడనే పరశివుడు
తన జగద్విలాసం చాలించాడు
మళ్ళీ తానే విసిరాడు
మాయా పాశాన్ని





ఈ విశ్వాసానికి బదులుగా మరో రకం నమ్మకాన్ని ఉంచుకోవచ్చు. మొత్తానికి మ్మాలి. "నమ్మి పిలిస్తే 'ఓ' అంటాడు శివుడు". "విశ్వసించడం సరైనదా?" అనేది వేరే ప్రశ్న. దేన్ని నమ్మకుండా ఉండడం సాధ్యం కాదు. 'నాకూ దేనిపైనా విశ్వాసం లేదు' అని అనడమూ విశ్వాసమే. నమ్మడమే నిజమైతే దాన్ని దీన్ని నమ్మడానికి బదులు ఆ పరాత్పర సత్యాన్నే పరమాత్మనే ఎందుకు నమ్మరాదు? నమ్మితే సరి. నమ్మక పోతే?

"గుడ్ల గూబ కళ్ళు కన్పించక సూర్యుణ్ణి నిందిస్తుంది.
కాకి కన్నుగానక చంద్రుణ్ణి నిందిస్తుంది.
గ్రుడ్డివాడు కన్నుగానక అద్దాన్ని నిందిస్తాడు
వీరి మాటలన్నీ సహజమే.
నరక సంసారంలో మునకలు వేస్తూ
శివుడు లేడు, యుక్తిలేదు అంతా అసత్యం అని అంటే
నరకంలో త్రోయడా చెన్నమల్లికార్జునయ్య?

చెన్నమల్లికార్జునయ్య నరకంలో త్రోయనీ, వదలనీ – వారి వారి దృష్టిలో వారి మాటలన్నీ సహజమే అని ముందుకు సాగి –

"నా మాయా మదాన్ని త్రుంచవయ్యా
నా కాయంలోని చీకటిని త్రుంచవయ్యా
నా జీవితంలోని బాధల్ని తొలగించవయ్యా
నా దేవా! మల్లికార్జునయ్యా
నేను తిరిగే ప్రపంచం నుండి వదిలించు మీ ధర్మం!"

అని విన్నవించుకోవడం సులభం, అలాగే సురక్షిత మార్గం.

"ఆలకించు నా విన్నపాన్ని
లాలించు నా విన్నపాన్ని

పాలించు నా విన్నపాన్ని!
ఎందుకు నా మొర నాలకించవయ్యా తండ్రీ!
నీవు తప్ప వేరే ఏదీ లేదు! లేదు!
నీవే నాకు గతి, నీవే నాకు మతి అయ్యా!
చెన్నమల్లికార్జునయ్యా!

అని మళ్ళీ మళ్ళీ విన్నవించుకోవడమే సరైన మార్గం.

"ఒకటి కాదు, రెండు కాదు,
మూడు కాదు నాల్గు కాదు
ఎనభై నాల్గు లక్షల యోనుల్లో
సంచరించా సంచరించా !
రాని సంసారాల్లో శుభాశుభాల్ని అనుభవించా!
క్రిందటి జన్మ అది ఏమైనా కానీ,
ముందు నీవు కరుణించు!"

అని అనన్యశరణులుగా అంగలార్చడం; బట్టలలో బట్ట! వేరే బట్టల స్వరూపం తెలుసు. చదువు, వాదం, వేదాదుల స్వరూపం తెలిసిందే.

"చదివి చదివి వేదం వాదాలకు దారి తీసింది.
వినివిని శాస్త్రం సందేహాలకు దారి తీసింది;
తెలుసుకున్నా తెలుసుకున్నానని
ఆగమం అరకొరగా అర్థమైంది
పూర్తి చేస్తా పూర్తి చేస్తానని
పురాణం పూర్వదిక్కుకు వెళ్ళింది!!

అందువల్ల
ఏ విద్య నేర్చుకుంటే ఏమి
చావును విద్య తొలగించదక్క;





ఆహారాన్ని వదిలితే నేమి?
వ్యసనాన్ని మరిస్తే ఏమి?
శ్వాసనాపితే ఏమి?
చెన్నమల్లికార్జున దేవయ్య
భూమి సైనికుడైతే
దొంగ ఎక్కడ దాక్కుంటాడు?"

శివశంభువును నమ్మితే నేల సైనికుడైనట్లే. ఎక్కడికి వెళ్ళినా వెనుకనే ఉండి రక్షించే, తన పాదాల్ని గ్రహించేట్లు చేసి, ఆ జ్ఞానంతో మనం మనల్ని తెలుసుకునేట్లు అనుగ్రహిస్తాడు. మనల్ని మనం తెలుసుకున్నాక ఇక వేరే ఏముంది? అపుడు అక్కమహాదేవిలా మనమూ –

"ఘనాన్ని చూశా; అణువును చూశా;
సుదీర్ఘమైన, తనదైన, సన్నిహితమైన
సుఖాన్ని చూశా !
జ్ఞానాన్ని తెలుసుకుని మరుపును మరిచా!
చిహ్నపు మోహానికి సంబంధించిన
మరుపులో కలబడ్డాను!
చెన్నమల్లికార్జున మమ్మల్ని తెలుసుకుని
సరిహద్దులు దాటాను!"

అని చెప్పవచ్చు. అక్కగారి

"జ్ఞానం ఆచరించాలి!
మరుపు లేకుండా తానుండాలి
తెర వెనుక ఉన్న చిహ్నాన్ని తొలగించాలి.
పరబ్రహ్మలో తాను కలిసి పోవాలి!

అనే సాధనాసోపానాల్ని ఎక్కేందుకు సంసిద్ధులం కావాలి.

విశ్వాసమార్గం సరళమైనదే సరి! అయితే ఈ నమ్మకం తనంతట తానే వస్తుందా? అది 'స్వయంభు' వా? దీనికి ఉద్దీపకాల అవసరం ఉందా? ఉంటే అవి ఏవేవి? వాటిని పొందే మార్గం ఏది? అవి అందరికీ లభిస్తాయా? కొందరికి మాత్రమే పరిమితమా?

స్వయం స్ఫూర్తికి స్థానం లేకపోలేదు. అయితే తెరిచిన కన్ను, వినే చెవి, అనుభవించే హృదయం, మననం చేసే మనస్సు, తెలుసుకునే ఆసక్తి ఉన్న ఎవరైనా చుట్టూ ఉండే పరిసరాల నుండి ప్రేరణల్ని పొంది సొంత నమ్మకాన్ని ఒక దాన్ని సృష్టించుకోవచ్చు. చుట్టూ వ్యాపించిన సృష్టి సౌందర్యం, భూమి నుంచి ఆకాశం దాకా వ్యాపించిన విచిత్రాలు, ప్రకృతి వ్యాపారాలు, రహస్యాలు, జన్మ నిగూఢత్వం, మరణం యొక్క అజ్ఞేయత్వం, జీవనంలోని ఊహకందని అంశాలు, ప్రతిక్షణం మమ్మల్ని వేధిస్తూనే ఉంటాయి. వాటిని చూసి కూడ గ్రుడ్డివాళ్ళల్లా వాటి అశరీరస్వరాల్ని విని కూడ చెవిటివాళ్ళల్లా సాగితే అవి అపరాధులు కాలేవు, అపరాధులం మనమే!

పుడుతూనే అందమైన నేత్రాలతో, చైతన్యవంతమైన చెవులతో వచ్చినా, రాను రాను అవి యాంత్రికమైన కళ్ళు, చెవులుగా మారిపోతాయి. మనం అలా చేసేస్తాం వాటిని.

అక్క గారి గొప్పదనం ఇక్కడే ఉంది. చివరిదాకా ఆశ్చర్యాన్ని, తెరచిన నేత్రాల్ని వినే చెవుల్ని, ప్రేమించే హృదయాన్ని, ఆలోచించే బుద్ధిని అన్నిటినీ ఆమె అలాగే నిలుపుకుంది. శిశువుగా ఉన్నపుడు ఎలా ఆశ్చర్యంతో భూమిని చూసిందో, సాధకురాలుగా అలాంటి దృష్టితోనే సృష్టి వ్యాపారాల్ని వీక్షించింది. వీక్షించి వాటి సూక్ష్మ రహస్యాల్ని తెలుసుకుంది.





**నిమ్మ, గజనిమ్మ, మామిడి, చింతలకు**<br>
**పుల్లటి నీళ్ళు పోసిందెవరయ్యా!**<br>
**చెరకు, అరటి, టెంకాయలకు**<br>
**తీపినీళ్ళు పోసిందెవరయ్యా**<br>
**కరండ వృక్షం (కలే చెట్టు) వడ్లగింజలకు**<br>
**అన్నపు నీటిని పోసిందెవరయ్యా!**<br>
**మరువం, మల్లె, వట్టివేరు -**<br>
**వీటికి పరిమళ జలాన్ని పోసిందెవరు?**<br>
**ఇలా నీళ్ళు ఒకటే, నేల ఒకటే**<br>
**నింగి ఒకటే ఒక్కడే జలం**<br>
**అనేక ద్రవ్యాలతో కలిసి**<br>
**తన రీతిని మార్చుకున్నట్లుగా**<br>
**నా దేవుడు మల్లికార్జునయ్య**<br>
**అనేక విశ్వాలతో కలిసి ఉంటే ఏమి?**<br>
**తన రీతే వేరు!"**

ఇక్కడ వచ్చినవి ఎవరూ చూడని చూపులేమీ కాదు అయితే అక్కలా చూచిన వాళ్ళెంతమంది? పైపై పరిశీలనతో తృప్తురాలు కాకుండా, మూలానికిదిగి, ఒకే జలం అనేక ద్రవ్యాలతో కలిసి రకరకాలుగా మారిపోయే సృష్టి వ్యాపారంలో అనేక విశ్వాలతో కూడినా తన వేరే వైఖరిని మిగుల్చుకున్న మల్లికార్జునుని నిజాన్ని గ్రహించిన అక్క గురించి గౌరవం కల్గడంలో ఆశ్చర్యమేముంది? ఇక్కడ ఆశ్చర్యం విజ్ఞానాంతఃపురంలోకి నిజం యొక్క స్థానాన్ని దానికి మార్గమై ఉండడాన్ని చూడవచ్చు. ఈ విస్మయం వ్యాప్తమై అక్క గారి జీవనవనమంతా వెన్నెలగా పరచుకుంది. ఇదే విస్మయం ఆమె లింగార్చన సందర్భంలోనూ అక్కడక్కడ వ్యక్తం కావడం ఈ మాటకు పుష్టిని అందిస్తోంది.

"క్రియలకు స్పర్శించడం తెలియదు;
మమ్మల్ని ఎలా పూజించను?
నాదబిందువులు స్పర్శ నెరుగవు;
మిమ్మల్ని ఎలా పాడను?
కాయం ముట్టుకుంటే కనిపించని ఘనం
మిమ్మల్ని ఎలా కరస్థలంలో ధరిస్తాను?
చెన్న మల్లికార్జునయ్యా!
నేనేమని తెలియక మిమ్మల్ని చూసి
విస్మితురాలవుతున్నాను"

ఈ విస్మయం ఒక దారి ! అయితే ఇదొక్కటే కాదు జ్ఞానహర్మ్యానికి! గురూపదేశం, జ్ఞానుల సాంగత్యం, స్వతంత్ర్యమైన చింతనలూ - ఇవీ మార్గాలే! ఇవన్నీ పరిచిత మార్గాలే అక్కకు. గురువుకు చాలా భక్తితో హృదయపూర్వకంగా భక్తి అనే కానుకను సమర్పించింది.

"లోపల శోధించి, వెలుపల ప్రక్షాళించి
లోపల వెలుపల అనే రెండు సందేహాల్ని తొలగించి,
స్ఫటిక శలాకలా లోపల వెలుగులు ప్రసరింపజేసి
సుక్షేత్రాన్ని ఎరిగి బీజాన్ని నాటినట్లు
శిష్యుని సర్వప్రపంచ నివృత్తిని చేసి
నిజోపదేశాన్నిచ్చి
ఆ శిష్యుని నిజానికి దగ్గరగా తీసుకుని
వెళ్ళేవాడే దీక్షాగురువు !
ఆ సహజ గురువే ఇపుడు జగదారాధ్యుడు!
అతని శ్రీ చరణాలకు నమోనమో అంటాను చూడు
చెన్నమల్లికార్జునా!"





నిజం యొక్క స్వరూపాన్ని గ్రహించేందుకు జ్ఞానుల సాంగత్యం, అనుభావుల సాంగత్యం అవసరం. ఎందుకు?

"సాంగత్యం లేకుండా నిప్ప పుట్టదు.
సాగత్యం లేకుండా బీజం మొలకెత్తదు
సాంగత్యం లేకుండా సర్వసుఖం కల్గదు;
చెన్నమల్లికార్జునయ్యా
నీ మహానుభావి జనుల సాంగత్యంలో
పరమసుఖం కల్గినవాణ్ణయ్యా!"

సంగమహానుభావుల సాంగత్యం కల్గాలి; జ్ఞానుల సాంగత్యం కల్గాలి; జ్ఞానశూన్యుల సాంగత్యం కాదు. ఎందుకు?

"జ్ఞానహీనుల సాంగత్యం చేస్తే
రాయి తీసుకుని పోయి నిప్పు తెచ్చుకున్నట్లు !
తెలిసిన వాళ్ళతో సాంగత్యం చేస్తే
పెరుగును చిలికి వెన్న తీసినట్లు!
చెన్నమల్లికార్జునయ్యా
మా శరణుల సాంగత్యం
కర్పూర పర్వతపు వేడిని తీసుకున్నట్లు!

అనుభావుల, శరణుల సాంగత్యం లభించిన తర్వాత "తెలుసుకున్నానంటే తెలుసుకోవడం కుదరదు చూడు! ఘనానికి ఘనం తానే చూడు! చెన్నమల్లికార్జునుని నిర్ణయం లేకుండా ఓడిపోయాను" అనే నైరాశ్యం బట్ట బయలై-

"అయ్యా, మీ అనుభావుల సాంగత్యంతో
మన శరీరం శుద్ధమైంది.

అయ్యా! మీ అనుభావుల సాంగత్యంతో
నా మనస్సు శుద్ధమైంది!
అయ్యా! మీ అనుభావులు నన్ను
బాగా ప్రక్షాళించడం వల్ల చెన్నమల్లికార్జున!
మీకు నేను ఆభరణాన్నైనా!"

అని చాటే ఆత్మవిశ్వాసం కల్గుతుంది. కేవల సాంగత్యంతో ఇది సాధ్యమా? సాంగత్యం ఆత్మల పరస్పర మథనానికి దారితీస్తుందని చెప్పిన అక్క గారి వచనాలకు ఇంతటి గొప్పదనం ఉంది.

"మరమర మథించి, నిప్పు రగిలి
చుట్టూరా వృక్షలతాదుల్ని కాల్చడం జరిగింది.
ఆత్మ - ఆత్మల మథనం జరిగి అనుభావం పుట్టి
వ్యాపించిన తనుగుణాల్ని కాల్చడమైనది
ఇలాంటి మహానుభావుల అనుభావాన్ని
చూపించి నన్ను బ్రదికించుకోవయ్యా
చెన్నమల్లికార్జునా!"

ఆత్మ - ఆత్మల నడుమ మథనం జరిగితే జ్ఞానం అనుభావంగా మారే విస్మయం జరుగుతుంది. శరీరాల అనుభావం ఏం చేయజాలదు? (ఏమైనా చేస్తుంది)

"చూసి పలికించి మాట్లాడితే ఒక సుఖం!
మీ శరణుల అనుభావం ఏం చేయదయ్యా!
చెన్నమల్లికార్జునయ్యా
మీ శరుణుల సత్సాంగత్యం ఏమి చేయదయ్యా?





నిజం! ఏం చేయదు? అది వాస్తవరూపానికి నిత్యసత్యచిదానంద భూమికకు మనల్ని తీసుకువెళ్ళుతుంది. ఆ తత్వం ప్రసన్నం అయ్యేట్లు చేస్తుంది. అపుడు-

"గంగ తిరుగాడిన చిన్న కొండలు
చెడిన చెడును చూడండయ్యా!
నిప్పులో కలిసిన కాష్ఠాలు
చెడిన చెడును చూడండయ్యా!
జ్యోతితో తిరిగిన చీకటి
చెడిన చెడును చూడండయ్యా!
జ్ఞానితో తిరిగిన అజ్ఞాని
చెడిన చెడును చూడండయ్యా !
ఓ పరశివమూర్తి శివుడా!
మీ జంగమ లింగంతో కలిసి జీవించి
నా సంసారాలు, మాలిన్యాలు చెడి
నశించిన తీరును చూడవయ్యా
చెన్నమల్లికార్జునా!"

అని పలికేటట్లయింది. ఎత్తుకు ఎదగడం అసాధ్యమేమీ కాదు. ఆ ఎత్తులోనే నిలిచిపోవడం కష్టకార్యం.

ఎత్తైన శిఖరాలున్నాయి విహారం కోసం, వసతికోసం కాదనే మాట ఒకటుంది. అయితే ఎత్తులో జీవించడం సాధ్యం కాకుంటే సంసారానికి ఎక్కిన శ్రమ వ్యర్థం కదా? అలాగే విస్మయం, జ్ఞానం, అనుభావాల కొంగు పట్టుకుని సత్యం వైపుగా పయనించి, అక్కడి నుండి మళ్ళీ తిరిగివస్తే ఏం ప్రయోజనం? అక్కడే నిలిచిపోవడానికి అడ్డం వచ్చేదేది? మనస్సు! ఆ మనస్సును నియంత్రించడం ఎలా??

"సాలెపురుగు తన ఎంగిలితోనే గూడల్లి
అందులోనే చిక్కుకుని చనిపోయినట్లు
మనస్సులో తోచిందంతా కోరుకుని
బాధపడుతున్నానయ్యా
నా మనస్సులోని దురాశను తొలగించి
నీ వైపు దారి చూపించు చెన్నమల్లికార్జునా!"

అని ప్రలాపించి ప్రార్థించడమేమో సరి. అయితే కేవలం దీనితోనే మనస్సు మహత్తులో కదలకుండా నిలపడం సాధ్యమా? మనస్సు లయం కావాలనే వాళ్ళు అననీ! అది లయమయ్యేది కాదు! అది ఫీనిక్స్ పక్షి. బాగా కాలినంత కాలి పుట్టి ఎగురుతుంది. వేరే మార్గాన్నే వెదకాలి. వెదికింది అక్క!

"లోకపు క్రియలకు సూర్యుడు బీజమైనట్లు
ఇంద్రియాల క్రియలకు మనస్సే బీజం
నా కుండేది ఒక్కటే మనస్సు
ఆ మనస్సు నీలో నిలిచిపోయాక
నాకు భయముంటుందా చెన్నమల్లికార్జునా!"

భయం ఉండజాలదు! ఇంద్రియాల చేష్టలన్నిటికి బీజమైన మనస్సే మల్లినాథునిలో మగ్నమయ్యాక భయం ఎక్కడిది? అపుడు ఇంద్రియాలన్నీ లింగకిరణాలు! అందుకే దృఢమైన స్వరంలో చెబుతోంది అక్క–

వేదశాస్త్ర ఆగమ పురాణాలన్నీ
వడ్లు దంచగా వచ్చిన
నూకల పొట్టు చూడండి!
వీడు దంచడం ఎందుకు?
వేరు చేయడం ఎందుకు?
అటు ఇటు పరుగులు తీసే మనస్సు





శిరస్సును గ్రహిస్తే స్పష్టమౌతుంది
స్వచ్ఛమైన బయలు చెన్నమల్లికార్జున! "

అటు ఇటు పరుగులు తీసే మనస్సును పరుగెత్తకుండా చేసి మల్లినాథునిలోనే స్థిరంగా ఉండేట్లు చేయడమే మహాదేవి అక్క చేసిన మహత్సాధన. చంచల మనస్కులకు ఇది సాధ్యం కాదు.

వారి సాధన దృఢం కాకుండా, కాలిన ఇటుక కాకుండా పొడి మట్టి పెంటికలా నిలిచిపోతుంది. నీళ్ళు పడితే కరగిపోతుంది. అక్క సాధన ఇలాంటిది కాదు. అది నీళ్ళు ముత్యంగా మారిపోయే రకం గొప్ప సాధన.

"ముత్యమూ నీటిలో పుట్టింది;
వడగల్లు నీటిలో పుట్టింది;
ఉప్పు నీటిలో తయారైంది
ఉప్పు కరిగింది, వడగల్లు కలిగింది !
ముత్యం కరగడాన్ని చూసిన వాళ్ళు లేరు!
సంసారులైన ఈ మానవులు
లింగాన్ని స్పృశించి భవ భారం ఉన్నవాళ్ళయ్యారు
నేను మిమ్మల్ని ముట్టి నల్లబడ్డానయ్యా
చెన్నమల్లికార్జునయ్యా!

సత్యం యొక్క ఆదిని (మొదలును) స్పర్శించడం మాత్రమే కాదు. ముట్టి నల్లబడాలి; నీరు ముత్యమైన రీతిలో గట్టి పడాలి. ఉప్పుగా, వడగళ్లుగా కరగి పోతే ప్రయోజనం లేదు. ముత్యంగా స్థిరత్వాన్ని పొందాకే ఆశ్చర్యపు, జ్ఞానవంతుడైన గురువు, అనుభావి ద్వారా "స్వచ్ఛమైన బయలును" స్పర్శించడం సార్థకమౌతుంది. మళ్ళీ కరిగిపోయే భయం లయమౌతుంది.

"దృష్టి తెలుసుకున్నది; మనస్సు స్థిరపడింది.
ఇదేమో!
అతడని గ్రహించే, భావాన్ని పొందుతానమ్మా!
కళలను గ్రహించి శరీరం కృశమైపోతుందమ్మా!
ఎవరేమన్నా విడువను,
చెన్నమల్లికార్జున లింగాన్ని!"

అని చాటే ధైర్యాన్ని ప్రదర్శిస్తుంది.

ఆద్యంతాలు లేని, సౌందర్యానికే సౌందర్యమైన, చైతన్యానికే చైతన్యమైన, రసానికే రసమైన, విశ్వంభర విశ్వాతీతుడైన విశ్వాత్ముణ్ణి ప్రసన్నం చేసుకోవడమైంది; అతడు కరుణతో పట్టుకుని, ఎత్తి, తన పాదాన్ని తెలుసుకునేట్టు చేశాడు. అతని జ్ఞానంలో అక్క తనను తాను గ్రహించి –

"గురువు నా దేహం, శివుడు నా మనసయ్యా
పరమ జంగమమే అను భావముఖం నాకు,
ఉనికి అంతా లింగమయమయ్యా!"

అని పాడడం అయిపోయింది.

"కాయంలోని కల్లోలాన్ని తొలగించి,
మనస్సులో మాయను మాన్పించి
నా జీవితాన్ని పైకెత్తి పోషించావయ్యా
శివశివా, నా భవ బంధనాన్ని తొలగించి
మీ వద్ద చూపిన ఘనాన్ని పోల్చరాదయ్యా!
చీకటిని తొలగించుకున్న చక్రవాకంలా
నేనిపుడు మీ శ్రీపాదాన్ని స్వీకరించి
సుఖాలలో తులతూగుతున్నానయ్యా
చెన్నమల్లికార్జునా!"





అని చెప్పడమూ ముగిసింది!

అక్క జ్ఞానానికి ఆద్యతను ఇచ్చింది సహజమే! సముచితమే! జ్ఞానం లేని ఆచారం వ్యర్థం.

"బియ్యంలేని పొట్టుకు ఎరువులు వేస్తే
అది ఎన్నటికీ ఎదిగి ఫలిస్తుందయ్యా!
జ్ఞానం లేని వారికి ఆచారముంటే
దుఃఖం పోయి సుఖం ఎప్పుడు వస్తుందయ్యా!
చలించిన పరిమళం స్థిరమౌతుందా?
నా దేవుడు చెన్నమల్లికార్జునుణ్ణి తెలుకొని
వారికి ఆచారం లేదు చూడండి అన్నా!!"

జ్ఞానం లేని ఆచారం అంధాచారం; జ్ఞానం లేని ఆచారం శూన్యం. అలాగే ఆచారం లేని జ్ఞానం కూడ పనికిమాలిన జ్ఞానం. సుజ్ఞానం సత్క్రియగా ప్రకటమైనపుడు జ్ఞానక్రియలు రెండూ ధన్యం! సుజ్ఞాన, సత్క్రియల సామరస్యపు సొగసే సొగసు. అందువల్ల అంతరంగంలోని జ్ఞానం బహిరంగ క్రియగా పరివర్తన చెందాలి. దీన్ని గ్రహించియే అక్క –

"నా అంగంలో ఆచారాన్ని చూపించాడయ్యా బసవణ్ణ;
ఆ ఆచారమే లింగమని తెలుసుకున్నాడయ్యా బసవణ్ణ;
నా ప్రాణంలో జ్ఞానాన్ని చూపించాడయ్యా బసవణ్ణ
చెన్నమల్లికార్జున
నా కన్నతండ్రి సంగన బసవణ్ణ
నాకీ క్రమాన్ని తెలిపాడయ్యా!"

ప్రాణం జ్ఞానం. లింగం– ఆచారం. ఎలాంటి క్రమం! జ్ఞానం, జంగమం. ఆచారం లింగం ఎలాంటి వ్యాఖ్య! అక్క మాట అమృతం; అక్క అనుభావం అమృతం !

జ్ఞానం పెరిగినట్లల్లా పని చేస్తూ ఉండాలి. చేశాననే మమకారం ఏర్పడకుండా చేస్తూ ఉండాలి. చేసే క్రియలన్నీ లింగం కోసమే అనే భావాన్ని స్థిర చేసుకుని చేస్తూ ఉండాలి.

"ధరిస్తాను నేను లింగం కోసమని
ధరిస్తాను నేను లింగం కోసమని
చేస్తాను నేను లింగం కోసమని
చూస్తాను నేను లింగం కోసమని -
నా అంతరంగ బహిరంగాలు లింగం కోసం !
చేసియు చేయనట్లు ఉంటా చూడు!
నేను నా మల్లికార్జునునితో చేరి
పదకొండు అవుతానా
పదితో చెబుతున్నానమ్మా!!"

"పదితో పదకొండు కావడం!" మానవుడు సంఘజీవి. సామాజిక జీవి అనే దాన్ని అక్క అంగీకరించిందనే దానికి నిదర్శనం ఈ శబ్దాల సమూహం.

అక్క తల్లిదండ్రుల్ని వేడి, కౌశికుణ్ణి ధిక్కరించి, చివరకు కళ్యాణాన్ని త్యజించిన నేపథ్యంలో అక్కగారి అద్భుత వైరాగ్య నేపథ్యంలో అక్క సామాజిక జీవి అని చాటడం సాహసంతో కూడిన వాక్యం అనిపించడం సహజం. అయితే ఇది సత్యమైనది. అక్క సామాజిక స్పృహను, సామాజిక బాధ్యతల ప్రజ్ఞను ఆమె అనేక వచనాలు స్ఫురింపజేస్తున్నాయి. 'అందరితో కలవడం ఆమె జీవితంలో ముఖ్యం.

"ఆడడం పాడడం
చెప్పడం వినడం నడవడం పలకడం
సరససమ్మేళనమైనదయ్యా శరణులతో!





చెన్న మల్లికార్జునయ్యా, నీ విచ్చిన ఆయుర్దాయంలోనే
లింగసుఖుల సాంగత్యంలో రోజులు గడుపుతాను!"

సమాజంలో అందరూ సజ్జనులేంకాదు. దుర్జనులూ ఉంటారు. అయితే తనకు కావాల్సిన వాళ్ళనిపించేవారి సహవాసంలో ఉండే స్వాతంత్ర్యం సమాజంలో ఒక భాగమైన వ్యక్తికి ఉంది. అక్క తనకు హితకరమనిపించిన గుణాల్ని ఎన్నుకుని వారితో, పరమ పురుషులతో రోజులు గడిపింది.

"ఆయత స్వాయత అనుభావాన్ని
నేనెక్కడ ఎరుగుదునయ్యా?
గురు -లింగ- జంగమానికి అర్థం- ప్రాణాభిమానాన్ని
సమర్పించి అహంకారమే నశించిన
పురాతనుల ఇంట్లో సేవకులకు సేవకురాలినయి
ఉంటానయ్యా!
ఇదే కారణం చెన్నమల్లికార్జునుని గణాలు
కాక ఇంక వేరే దేన్నీ నేనెరుగనయ్యా!
గణాలు కాని వాళ్లను నేనెరుగనయ్యా !"

గణాలు కాని వేరే దేన్నీ గ్రహించలేదు అక్క! వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. అంతే ! వాళ్ళ వాళ్ళ మానానికి వాళ్ళను వదలి తనకు పరమ ప్రాణతుల్యులనిపించిన శరణుల సాంగత్యంలో సిగ్గుపడి, సంతోషించిందామె!

"ఈ రోజు ఇంటికి యజమానులు వస్తే
తనువనే కలశంలో నీళ్ళు నింపి
కనురెప్పలతోనే పాదార్చన చేస్తాను.
నిత్యశాంతి అనే శైత్యంతోనే సుగంధాన్ని
పూస్తాను!

అక్షయసంపత్తు అని గ్రహించి అక్షతల్ని వేస్తున్నా
హృదయకమల పుష్పాలతో పూజిస్తున్నా;
సద్భావనతో ధూపం వేస్తున్నాను.
శివజ్ఞానప్రకాశంతో మంగళారతి చేస్తున్నా
నిత్యతృప్తితో నైవేద్యాన్ని సమర్పిస్తా;
పరిణామంతో కర్పూర తాంబూల మందిస్తా;
పంచబ్రహ్మతో పంచమహావాద్యాల్ని వాయిస్తా;
హర్షంలో చూస్తా;
ఆనందంతో నర్తిస్తా;
పారవశ్యంలో పాడుతా;
భక్తితో నమస్కరిస్తా;
నిత్యుడితో కలిసి ఆడుతా !"

అక్కగారి భక్తిమాధుర్యం, సుజ్ఞానపు వెలుగు, సామాజికత్వ సుగంధాలు కలిసి పాటగా ప్రవహించాయి ఈ వచనంలో!

ఇదంతా సరే! అయితే లోకంలోని వాళ్ళు దీన్ని మెచ్చుకుంటారా? వారిలో దీనికి పూర్తిగా విరుద్ధమైన మనోధర్మం ఉన్నవాళ్ళెంత మంది లేరు? పనికిమాలిన వాళ్ళెందరు లేరు? కుటిలులు, కపటులు, క్రూరులెందరు లేరు? ఇలాంటి వాళ్ళ మధ్యలో ఆదర్శాలకు సమర్పితమైన జీవితాన్ని నడిపించడం సాధ్యమా? సాధ్యం ఉంది అంటుంది అక్క మహాదేవి; మహత్తును ఆలింగనం చేసుకున్న హత్తుకున్న, ఆ మహాతేజస్సే తానుగా మారిన మహాదేవి !

"లోకాన్ని పట్టుకుని లోక సాంగత్యం ప్రకారం జీవించా
ఆకారం పట్టుకుని ఆకారంతో పాటు నడుస్తా;
బయట వాడి లోపల మరిచిపోయా;
కాలిన నూలులా కమలి ఉన్నాను;





నా దేవా! చెన్నమల్లికార్జునయ్యా -
పదిలో పదకొండై నీటిలో తామరలా ఉన్నా !"

ఇది లోకంలో ఉంటూ, లోకుల సాంగత్యంలో ఉంటూ, పదిలో పదకొండై తన వ్యక్తిత్వాన్ని, గుర్తుల్ని, లక్ష్యాన్ని, తన సాధనను మిగుల్చుకునే విధానం! నీటిలో తామరలా అంటి అంటనట్లు ఉండే విధానం! పద్మపత్రంలా ఉండిపోయి–

"మాకు మాలింగపు చింత;
మాకు మా భక్తుల చింత;
మాకు మా చెన్నమల్లికార్జునుని చింత తప్ప
లోకం సంగతి మనకేల అన్నా!"

అని అడగవచ్చు. లింగ చింతనలో, మల్లికార్జునుని చింతనలో, భక్తుల చింతనలో ఉండవచ్చు. 'భక్తుడు' దైహిక దేవుడనే నమ్మకం నిజం కావడానికి, భక్తుల గురించి తప్పక ఆలోచించాలి.

"శివభక్తుల రోమానికి బాధ కల్గితే
శివునికి బాధ కల్గినట్లే చూడు!
శివభక్తులు పరిణమిస్తే శివుడు పరిణమిస్తాడు.
భక్తుడు దైహికదేవుడని వేదం ప్రశంసించడం వల్ల
శివ భక్తుల క్షేమం కోరితే అది శివునికి
తాకుతుంది చూడు!
తల్లికి బాధకల్గితే శిశువుకు బాధ కల్గినట్లు
భక్తులు బాధపడితే తాను బాధ పడతాడు చూడు
చెన్నమల్లికార్జున!"

ఈ వచనం చివరిలో వచ్చింది చక్కని పోలిక! జీవులందరూ జగన్మాత ఒడిలోని శిశువులు; ఆ శిశువుల్లో ఒక్క దానికి బాధ కల్గినా తల్లికి బాధ కల్గుతుంది. ఆ తల్లి బాధపడితే మిగిలిన శిశువులంతా బాధపడకుండా ఉండలేరు. ఇలా ఒకరి బాధ అందరి బాధగా మారవచ్చు. ఇలా కాకూడదంటే– ఇంకొకరికి బాధ కల్గని రీతిలో మనం బ్రతకాలి. ఇలా బ్రతకడం సాధ్యం కాదు. సులభం కాదు. పరస్పరం సమానక్రియలలో, హితాసక్తులలో అందరూ పాల్గొంటే మాత్రమే ఇది సాధ్యం. అందరూ ఈ సూత్రాన్ని ఎక్కడ అనుసరిస్తారు? ఒకరి నోటి ముద్దను ఇంకొకరు లాక్కొని తినడంలేదా? అదేంటి? ఇతరుల చర్మాన్నే ఒలిచి తినేవాళ్ళు లేరా? అందుకే మానవ సమాజంలో ఘర్షణలు, దాని ఫలితంగా అన్యాయం, అశాంతి, అనర్థాలు!

దీన్ని గమనించే వ్యష్టి – సమిష్టుల నడుమ, వ్యక్తుల నడుమ సంఘర్షణలు రాకుండా నిరోధించేందుకు నీతి సంహిత నొక దాన్ని రూపొందిస్తూనే వచ్చారు. ఆయా కాలాల మేధావులు, వేదాంతులు, కవులు, ప్రవక్తలు – నీతిసంహిత నేర్పరచారు. అక్క సుజ్ఞాన సత్క్రియలతో పాటు సునీతిని చేర్పించింది. తాను రూపొందించిన సన్మార్గంలో సునీతి లేని సమాజం చుక్కాణి లేని, ఉత్తరముఖంకాని, దీపస్తంభం లేని పడవ లాంటిది. అది బందరును చేరే ముందే రాతికి తగిలి పగిలిపోవచ్చు. నైతికమైన పునాదిని, బలాన్ని, అధికారాన్ని పోగొట్టుకున్న శాసనాంగం (Legislature), న్యాయాంగం (Judiciary) కార్యాంగం (Executbox), మఠాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, చైత్యాలయాలు, విహారాలు ప్రభావశూన్యం కావడాన్ని మనం కళ్ళారా చూస్తున్నాం. ఇపుడిపుడే నైతికాధికారపు ఆధారం లేని ఏ అధికారమూ నిలువజాలదనే జ్ఞానోదయం అక్కడక్కడ జరుగుతోంది!





బసవాచరణలోని 52 వివరాల్ని వర్ణించడంలో అక్క నీతిసంహిత రూపుదాల్చింది; "....మా బసవణ్ణ జగత్తు మేలుకోసం భూలోకంలో అవతరించి 52 వివరాలు నీతిసంహితను పాలిసన్తా సంచరించారన్న వేళ – గురుకారుణ్యవేద్యుడు, పంచాక్షరీ భాషాసమేతుడు, లింగాంగ సంబంధి అర్పణ చేయడంలో అవధాని, త్రివిధకాయ తనువు, త్రికరణశుద్ధుడు, భవిసాగత్యం చేయడు. పరసతితో కలవడు. పరధనాన్ని అపహరించడు, పరనింద చేయడు. అసత్యాన్ని పలకడు. హింస చేయడు. తామస భక్తులతో సాంగత్యం చేయడు. గురు – లింగ – జంగమానికి అర్థం – ప్రాణాభిమానం మున్నగు వాటిని అన్నిటిని సమర్పించి ప్రసాదం మున్నగు వాటిని స్వీకరిస్తాడు. ఇతరులకు ఆశ చూపించడు. యోగ్యుడు– అయోగ్యుడెవరు అనే అంశం తెలిసినవాడు. చతుర్విధ పదవుల విప్రుడు. అరిషడ్వర్గాలకు వశం కాని వాడు, కులాది మదాలు లేని వాడు, ద్వైతాద్వైతాల్ని చెప్పేవాడు కాడు. సంకల్ప వికల్పాలు చేసేవాడు కాడు. కాలోచితమైనదేదో తెలిసినవాడు. క్రయంతో షట్స్థల భరితుడు, సర్వాంగలింగి, దాసోహ సంపన్నుడు – ఇలా 52 విధాలుగా నిపుణుడై విరాజిల్లినాడు మా బసవణ్ణా !

వీటన్నిటి గురించి వివరించడం ఈ చిన్న పరిమాణం కల్గిన పుస్తకానికి సాధ్యం కాని మాట! ఒక విషయం గురించి అక్క మాటల్లోనే అర్థ వివరణ అవసరం. 'భవిసాంగత్యం చేయవద్దు' అనే వివరణ అపార్థానికి దారితీయకుండనీ అని చెబుతూ అక్కమహాదేవియే అందించిన 'భవి' శబ్ద వ్యాఖ్యానాన్ని ఉదాహరించాల్సిందే !

**"శీలం శీలం అంటారయ్యా -**
**శీలం పునాదులు తెలిస్తే చెప్పండి!**
**తెలియకుంటే వినండోయి-**

కామం ఒకటవ భవి
క్రోధం రెండో భవి
లోభం మూడో భవి,
మోహం నాల్గో భవి
మదం ఐదవ భవి
మాత్సర్యం ఆరో భవి
ఆమిషం (ఎర) ఏడవ భవి

ఇలా ఏడు భవుల్ని తమలో పెట్టుకుని
లింగంలేని వాళ్లను భవి భవి అంటున్నారు !
తమ అంతరంగంలోని లింగాంగం సమాచారం.
ఎరుగక, అచ్చమైన ప్రసాది, నిత్య
ప్రసాది, సమయప్రసాది అని
జలానికి కన్నం వేసి ఉదకం తెచ్చి
లింగానికి అభిషేకం చేసే
పగలు దోపిడీగాళ్లను మెచ్చుకుంటాడా
చెన్నమల్లికార్జునుడు!"

పై వచనం అర్థంలో భవిసంగత్యాగం ఉపాదేయం. ఈ అర్థంలో భవి సాంగత్యాన్ని బహిష్కరించడం మినహాయించి లింగం లేని వాళ్ళను "భవి" అని పిలిచి, వారితో స్నేహాన్ని, విహార యాత్రను, భోజనాదుల్ని బసవాది ప్రమథుల అనుయాయులే త్యజించడం దురదృష్టకరమైన సంగతి. అక్క వివరించిన ఏడు భవుల్ని దూరం పెట్టే గొప్ప శీలాన్ని సంపాదించేందుకు ప్రయత్నించకుండ పాకంలో, పాంనకాల్లో త్రాగే నీరు ప్రవహించే భూమిలో భ్రాంతి దాయకమైన శీలాన్ని సృష్టించుకుని బసవ ధర్మ ప్రచారానికి ఆటంకాలు కల్గించిన ఈ అనుయాయుల పట్ల జాలి కలుగుతోంది. ఇప్పటికైనా అక్క వివరించిన విశాలార్థంలోనే ఉదాత్త వ్యాఖ్యకు అనుగుణంగానే భవుల





సాంగత్యాన్ని పరిత్యజించాలి బసవానుయాయులు. మాదార చెన్నయ్య అంబలి, శివనాగమయ్య, కక్కయ్యల ప్రసాదం పవిత్రమని నమ్మిన బసవణ్ణ గారెటు? వారి అనుయాయుల్లోనే శీలవంతులు, శ్రేష్ఠులు, మిగతావాళ్ళని కనిష్ఠులని వాదించే వివేకశూన్యులెక్కడ?

పైన ప్రస్తావించిన 52 వివరాల్లో అక్కగారి నీతిసంహిత రూపురేఖలు స్పష్టంగా ఉన్నా వేరే వచనాల్లో ప్రస్తావించబడిన ఉపష్టంభక వాక్యాల్ని గమనించడం సముచితమైనది. వల వేసేవాడి ఉదాహరణను ఇచ్చి అహింస అనివార్యతను అక్క వివరించడాన్ని ఇదివరకే పరిశీలించాం. ఇక మిగతా విషయాన్ని ఇపుడు అవలోకిద్దాం-

"ఎక్కడికి వెళ్ళినా కలికి భయంలేదు;
ఖిన్నుడికి సుఖంలేదు; వినండన్నా!
ఇతనికి అవగుణం లేదు; దయగల
వానికి పాపంలేదు;
మిమ్మల్ని స్పృశించి పరధనాన్ని,
పరస్త్రీలను విడిచిన వాడికి
ముందు భయంలేదు చెన్నమల్లికార్జునా!"
గర్వం, మదం రెండింటినీ గ్రహించి నడుస్తాడా శరణుడు?
అసత్యమనేదే మాల !

"పంచేంద్రియగుణాలలో ఒక్కదానికి
ప్రియుడైతే చాలదా?
సప్త వ్యసనాలలో ఒకదానికి
ప్రియుడైతే చాలదా?
సంకెల రత్నాలతో చేసిందైనా
బంధిస్తుంది కదా! చెన్నమల్లికార్జునా?"

పాడితే నేమి? వింటే ఏమి?
తనలో ఉన్న అవగుణం పోతుందా?"

అన్నది అక్క.

"ప్రవర్తన పవిత్రం; మాట పవిత్రం.
మనసు రుచి - అంతరంగం శుచి
ఇలా ఈ పంచతీర్థాలతో కూడిన
వాళ్ళే శరణులు"

"తనువు శుద్ధం మనస్సు శుద్ధం
అంతరంగం శుద్ధమైన వారి నొకసారి చూపించవా?
ప్రవర్తన అంతా సదాచారం,
మాటలన్నీ శివాగమం -
నిత్యశుద్ధులైన వారి నొకసారి నాకు చూపించు"

"చేసేవాళ్లను చూసి చేసేవాడు కాడు!
చేయని వాళ్లను చూసి చేయనివాడు కాడు.
తాను చేసే ఇంద్రజాలానికి సాక్షిగా,
వెనుకముందు తెలియని శరణుడు"

"మా ఇంట్లో ఈ రోజు పండగ సందడి ఎక్కువ?
మిమ్మల్ని పలకరించేందుకు సమయం లేదు
వెళ్లండి విషయాల్లారా!"

"కులమదం అనేది లేదు,
పట్టుదల మదం అనేది లేదు.
ధనమదం అనేది లేదు
విద్యామదం అనేది లేదు.
మరెలాంటి మదమూ లేదు.





నీ అనుగ్రహం కారణంగా"

"కీటకం భ్రమరంతో సాంగత్యం చేసి
తానే భ్రమరమౌతుందిగా
తనను వదలడం సాధ్యమా అయ్యా!"

పైన పేర్కొన్న సునీతిసారం సర్వజనుల సర్వకార్యాలకు దిక్సూచి! ధృవతారగా మారితే కల్పనల స్వర్గం నిజమైన స్వర్గంగా ఈ లోకంలోనే ఆవిర్భవిస్తుంది! ఇలాంటి నీతిసంహితను సార్వత్రికంగా గాని, వైయక్తికంగా కానీ జీవితంలో అలవరచుకునే వాళ్ళే అపురూపులు. ఈ విరళ వ్యక్తులకు దుర్నీతుల దుర్జనులు ఎదురైన వేళ ఏం చేయాలి? "దుష్టుల్ని చూసే దూరంగా ఉండు" అని మాత్రం చెప్పవచ్చు. అయితే దీనివల్ల సామాజికంగా, నాగరికులుగా కర్తవ్యం ముగిసినట్లవుతుందా? కాదు ! దౌర్జన్యం ఎక్కడున్నా ఖండించాల్సిందే; ఈ నైతిక ధైర్యం మనకు తప్పక రావాలి. అక్కగారి నైతిక ధైర్యం వర్ణన చేయడం సాధ్యం కాదు.

"అయ్యా, సర్వమూలాహంకారాన్ని పట్టుకుని,
కులభ్రమ, ఛలభ్రమ, జాతి భ్రమ
నామ-వర్ణ- ఆశ్రమ- మతశాస్త్ర భ్రమ
తర్క భ్రమ, రాజ్యభ్రమ
ధన - ధాన్య-పుత్ర మిత్ర భ్రమ
కాయ - కరణ - విషయ భ్రమ
వాయు-మన - భావ-జీవమోహభ్రమ
నాహం - కోహం - సోహం
మాయా భ్రమ మొదలైన
32 పాశాలచే భ్రాంతికి లోనై తపించే
వేషధారుల్ని చూసి

శివశక్తి, శివభక్త, శివప్రసాది, శివశరణ,
శివైక్య, శివ జంగమ అని చెప్పడం రాక
నా మనస్సు సిగ్గుపడి మీ వైపుకు
అభిముఖం అయిందయ్యా
చెన్నమల్లికార్జునా!"

వేషధారుల్ని, ఆషాఢభూతుల్ని సజ్జనుల వేషాన్ని ధరించిన దుష్టుల్ని అక్క ఒక్కటే ఖండించలేదు. వేరే శరణులూ ఖండించారు. అయితే ఒక్కొక్కరి ఖండనలో భేదం ఉంది. బాధను కల్గించి కూడ లక్ష్యాన్ని సాధించిన ఖండన కొందరిదైతే, బాధను కల్గించకుండా ఉద్దేశాన్ని సాధించిన ఖండన కొందరిది; ప్రభావాన్ని కల్గించే ఖండన కొందరిది; అక్క గారి ఖండన రెండో రకం. "అడుగులు వేశాడు. లటలట మని... చెప్పినవాడు అంబిగర చౌడయ్య" లాంటి ఖండనలతో "నా మనసు సిగ్గుపడి నీకు అభిముఖమైందయ్యా!" అనే సూక్ష్మమైన, సుసంస్కృతమైన ఖండనతో పోల్చిన వేళ ఈ భేదం స్పష్టమౌతుంది. ఇంకొకటి – ఇలాంటిదే వచనం! దాన్ని పరిశీలిద్దాం –

"అయ్యా, చిదంగ, చిద్ఘనలింగం
శక్తి - భక్తి -హస్త-ముఖ - పదార్థ - ప్రసాదాలు
మున్నగు వాటి గురించిన స్వరూప స్వభావాల్ని ఎరుగక,
జిహ్వాచాపల్యాన్ని తెచ్చుకుని
గుహ్యా చాంచల్యంలో దాన్ని విసర్జించి
సకలేంద్రియ ముఖంలో మోహియై
సద్గురు కరుణామృత రసం తానని తెలుసుకోలేక-
ఉత్తుత్తిగా భక్తుడు - మహేశుడు-
ప్రసాది - ప్రాణలింగి-శరణుడు -
ఐక్య గురువు - చర - పర - అని





మొరిగే కుక్కల్ని చూడండి.
నా మనస్సు కకావికలం అయిందయ్యా
చెన్నమల్లి కార్జునా!"

ఇక్కడ "మొరిగే కుక్కలు" అనే రెండు భయంకర శబ్దాలున్నాయి. నిజం. అయితే వాటి గురించి అక్కగారి ప్రతిక్రియ ఎలాంటిది? "నా మనసు వికలం, కకావికలం అయిందయ్యా!" ఇది కుసుమం కూడ వజ్రమంతగా కఠినంగా మారిపోతుందనేందుకు ఉదాహరణ. ఇలాంటి ప్రతిభటనతో దోహద పడడం సామాజిక బాధ్యతను సూక్ష్మగా నిర్వహించడమే!

ఇది అక్కగారి సుజ్ఞానం, సత్క్రియ, సునీతి, సన్మార్గాల విశదీకరణం. దీన్ని గురించి ఎంతైనా రాయవచ్చు. ఇంకా ఏం చెప్పను? అక్కగారే తన మరో వచనంలో ఈ 'సత్య సన్మార్గం' యొక్క సమగ్ర స్వరూపాన్ని చిత్రించింది.

"అయ్యా! సదాచారం - సద్భక్తి- సత్క్రియ-
సమ్యక్ జ్ఞానం - సత్త్రవర్తన - సగుణం - నిర్గుణం
నిజగుణం - సచ్చరిత్ర - సద్భావం, అక్రోధం,
సత్యవచనం, క్షమ, దయ, భవి భక్త భేదం,
సత్పాత్ర ద్రవ్యార్జన, గౌరవబుద్ధి, లింగలీల,
జంగమానుభావం, దశవిధ పాదోదకం,
ఏకాదశ ప్రసాదం, షోడశ భక్తి నిర్వాహం

త్రివిధ షడ్విధ నవ విధ లింగార్చన
త్రివిధ షడ్విధ నవవిధ జపం
త్రివిధ షడ్విధ నవవిధ లింగార్పణ
చిద్విభూతి స్నానం, విభూతి ధారణ
తాను చేసే సత్యకాయకం
తాను కోరే సద్భక్తి భిక్ష

తాను ఇచ్చి పుచ్చుకునే భేదం
తాను చేసే సత్యప్రవర్తన వాక్యాలు
తాను నిలచిన నిర్వాణ పదం
ఇలా 32 కళల్ని
సద్గురు ముఖం నుండి గ్రహించిన
బసవాది సమస్త ప్రథమగణాలు
నిర్లిప్త వీరశైవసన్మార్గం పట్టుకుని
ఆచరించారు చూడు!
ఇలా ప్రథమధగణాలాచరించిన
సత్యసన్మార్గాన్ని గ్రహించని
మూఢులు, అధములు శివభక్తి, శివభక్తుడు
శివ జంగముడంటారయ్య చెన్నమల్లికార్జున!"

ఇది వీరశైవసన్మార్గము! వీరశైవ పారిభాషిక పదాల్ని మార్చి మతాతీత పదాల్ని ప్రయోగిస్తే సర్వజనగ్రాహ్యం కాగల్గే సత్యసన్మార్గమూ ఇదే! ఇలాంటి ఒక సత్యసన్మార్గాన్ని, సుజ్ఞాన, సత్క్రియా సునీతుల - సంగమమైన సన్మార్గాన్ని మాకు చూపించిన అక్కమహాదేవి ఆధ్యాత్మిక లోకపు అమరజ్యోతి! సాహిత్యలోకపు స్వయంజ్యోతి. నారీ లోకానికి గౌరవజ్యోతి !

ముగించే ముందు 'వద్దు' అనిపించుకునే ప్రవర్తనను, మాటల్ని పరిత్యజించాలన్న అక్కమహాదేవి బోధించిన జీవనసూత్రాన్ని స్మరిద్దాం.

మీ తీరుకు మీకు సిగ్గుపడరాదా?
ఇతరుల చేతిలో 'వద్దు' అనిపించుకున్న ప్రవర్తన,
మాట ఎందులకు?
'వద్దు' అనిపించుకోవడం కన్న
అదే క్షణంలో మరణించడమే మంచిది
చూడు చెన్నమల్లికార్జునా !





'వద్దు' అనిపించకుండా జీవించడం
ఇది లక్ష్యం. దీనికి దారి ఇక్కడుంది.
"గురువుల్ని, పెద్దల్ని దర్శించడం కంటికి శృంగారం
పురాతనుల సంగీతాన్ని వినడం చెవికి శృంగారం
సత్యం పలకడం వచనానికి శృంగారం
సద్భక్తులతో మాట్లాడడం సంభాషణకు శృంగారం
సత్పాత్రదానం చేయడం చేతికి శృంగారం
జీవించే జీవితానికి జనులతో సమ్మేళనం శృంగారం
ఇవన్నీ లేని జీవి జీవితం ఎందుకు?
అయ్యా - చెన్నమల్లికార్జునా?".

ఇవన్నీ లేని జీవితం వ్యర్థం. వీటన్నిటిని అలవరచుకుంటే అక్కకు నిజమైన గౌరవాన్ని మర్యాదను సమర్పించినట్లే! మనల్ని మనం మన అభివృద్ధి పథంలో నడిపించుకున్నట్లే.

# అక్క వ్యక్తిత్వం

నారీప్రపంచం మనకు ఒకరికన్న ఎక్కువమంది చక్రవర్తినుల్ని, స్వాతంత్ర్య సేనానుల్ని, యోగనుల్ని, విరాగిణుల్ని, కలావిలాసినుల్ని, విద్యావినోదినఃనుల్ని అందించింది. అయితే ఒకే ఒక్క అక్కమహాదేవిని మనకు అందించింది. గ్రీక్ దేశానికి చెందిన ' సోఫో', ఏసుక్రీస్తు వాళ్ళ 'థెరేసా', కాశ్మీరుల 'లల్లేశ్వరి', అరేబియాలోని 'రాబియా', తమిళుల 'ఆండాళ్', రాజస్థాన్లోని 'మీరా', కర్ణాటకకే చెందిన 'ముక్తాయక్క, హెళవన కట్టె గిరియమ్మ' మున్నగు వారు లేరా? అని అడగవచ్చు. వీళ్ళంతా ఆధ్యాత్మిక సాగరంలోని అమూల్యరత్నాలే! అయితే అక్క వ్యక్తిత్వం వీరందరి కన్న ఎక్కువ సమగ్రమైనది, సంపూర్ణమైనది, అనన్యమైనదిగా కన్పిస్తోందనడం అభిమానంతో చెప్పే ఉత్ప్రేక్ష కాదు. అపూర్వత్వం, అతిశయత్వం, ఉజ్వలత అక్క వ్యక్తిత్వానికి ఆశ్చర్యకరమైన మెరుగును, గౌరవాన్ని, గరిమను అందించాయి.

'సోఫో' కవితలన్నీ కళాత్మకాలు, మోహకాలు, మాదకాలు! అయితే వాటిలో బహిర్ముఖత్వం పొందిన విజయాన్ని అంతర్ముఖత్వం పొందలేదు. అలాగే ఆమె కవితల్లో నర్తించే ఉల్లాసం ఆమెను నైరాశ్యం నుండి గట్టెక్కించలేదు. నైరాశ్యంలోనే సముద్రం పాలైంది. 'థెరెసా' వైరాగ్యం, ఆధ్యాత్మిక విరహం, దేవోన్మాదమయమైన దివ్యజీవనం కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. అయితే ఆమె ఉదాత్త సాహిత్యాన్ని అందించలేదన్నదొకటే కొరవ. 'రాబియా'లో చింతనశీలత ఉంది. జ్ఞాన పరిమళముంది. ప్రేమతో కూడిన మధుర వేదన ఉంది. అయితే





సంఘర్షజన్యమైన జీవనోజ్వలత లేదు. సంకీర్ణత్వం లేదు. కాశ్మీరపు లల్లేశ్వరి క్రీ.శ. 1335లో – అంటే అక్క శివైక్యం చెందిన తర్వాత ఆరేడు దశాబ్దాల తర్వాత పుట్టిన మహాయోగిని. అక్కకూ, ఈమెకూ ఒకటి రెండు విషయాల్లో విస్మయకరమైన సామ్యముంది. అక్క కౌశికుని ఇంటి నుండి బయటికి నిష్క్రమించినట్లు, లల్లేశ్వరి సాంపోరలోని తన పతి గృహం నుండి బయటికి వెళ్ళింది. ప్రేమించే మామ, పీడించే అత్త, ప్రీతియే ఎరుగని భర్త – అందరినీ, అన్నిటినీ వదిలి కట్టుకున్న చీరను కూడ విడిచి వేసి బయలుదేరుతుంది. కాశ్మీరీ భాషలో 'లల్ల' అంటే వ్రేలాడుతున్న పొత్తి కడుపు అట! అక్కకు మర్మాంగాన్ని కప్పేందుకు ఆమె పొడవైన వెంట్రుకలు ఉపకరించినట్లే, లల్లేశ్వరికి వ్రేలాడుతున్న పొత్తికడుపు ఆమె మర్మాంగాన్ని ముచ్చేందుకు ఉపకరించింది. అందువల్ల ఈమె లల్లదీది, లల్లమాత, లల్లయోగీశ్వరి అనే పేర్లతో విఖ్యాతురాలైంది. అక్క తనను దూషించేవారి నిందావాక్యాలకు కోపించక –

"కొండపైన ఒక ఇల్లు కట్టి మృగాలకు భయపడితే ఎలాగయ్యా... లోకంలో పుట్టాక నిందాస్తుతులు కల్గితే మనస్సులో కోపం పెంచుకోక ప్రశాంతంగా ఉండాలని" తనకు తానే సాంత్వన చెప్పుకుందట! లల్లేశ్వరి కూడ తనను పీడించిన, బాధించిన దుష్టుల్ని చూసి వ్యధించకుండా పలికింది:

**"నిందంతు వా మా మథవా స్తువంతు**
**కుర్వంతు వార్తాం వివిధైః సుపుష్పైః**
**న హర్షయామ్యథవా విషాదం**
**విశుద్ధ బోధామృతపానస్వస్థా"**

(నన్ను పొగడనీ, నిందించనీ, వివిధమైన సుగంధ పుష్పాలతో పూజించనీ, ఏం చేసినా విశుద్ధ జ్ఞానామృతాన్ని గ్రోలి స్వస్థురాలిగా ఉన్న నేను హర్షించను! విషాదించను కూడ).

కష్టాల, ఇబ్బందుల కారడవిని దాటి, కటిక చీకటిని తొలగించుకుని చివరికి లల్లేశ్వరి సిద్ధావస్థకు చేరుకుంటుంది. నందఋషి, నసరుద్దీన్‌లతో జరిగిన పారమార్థిక సంవాదంలో గెలుస్తుంది.

"కరోమి యత్కర్మ తదేవ పూజా
వదామి యచ్ఛాపి తదేవ మంత్రః
యదేవ చాయాతి తద్ధైవ యోగాద్
ద్రవ్యంత దేవాస్తిమమాత్ర తంత్రమ్"

(నేను చేసేదంతా పూజ, పలికేదంతా మంత్రం, పొందేదంతా పూజాద్రవ్యం, నడిపేదంతా తంత్రం) అని చాటే పరమోన్నత స్థితికి, స్థానానికి ఎదుగుతుంది.

అన్ని దృష్టులతో చూసినా ఆమెది అద్భుతమైన రమ్య జీవనం. అయితే అక్కగారి వచనాల్లో మనం భావ సౌందర్యం, భాషా సౌందర్యాన్ని అనుభావోద్దీపమైన బౌద్ధికత యొక్క హృదయం గమ సంగమ్మాన్ని చూసినట్లు లల్లేశ్వరి వాక్కుల్లో చూడలేమేమో ! జిజ్ఞాన, స్వాత్మ విమర్శ, స్వరూపానుసంధానం, యోగసాధన, అమృతత్వ ప్రాప్తికి చెందిన విధాననిరూపణ - ఇత్యాది గహనమైన విషయాల్ని శాస్త్రీయ పరిభాషలు వివరించే ఈ "వాక్కుల్లో" అక్కగారి అక్లిష్టమాధుర్యం విరళమనే చెప్పాలి. అంతేకాక, నందఋషి, నసరుద్దీన్‌లతో ఈమె నడిపించిన పారమార్థిక సంవాదాలు అనుభవ మంటపంలో అక్క ఎదిరించిన అగ్నిపరీక్ష ముందు తక్కువ కాంతియుక్తంగా కన్పించాయి.

ముక్తాయక్క మహాదేవి అక్కతో సమానమైన స్థానాన్ని పొందేదేమో ! ఆమె జీవితంలోని అనేక వివరాలు దొరికి ఉంటే- ఒక్కసారిగా కాంతి ప్రవాహమై ప్రవహించి వచ్చి ఇంకా కనులారా చూడాలనుకున్నంతలో బయలైపోయే వెలుగు రేఖలా గోచరిస్తుంది ఆమె! అల్లమ ప్రభువుల పరీక్షలో ఉత్తీర్ణురాండ్రైన కీర్తి





అక్కకు, ముక్తాయక్క గారలకు సమానంగా చెల్లుతుంది.

అయితే ఇక్కడితో అంతరిస్తుంది వారిరువురి జీవితాల్లోని సామ్యం. తర్వాత ముక్తాయక్క సరస్వతీనదిలా అదృశ్యవాహినిగా మారిపోతుంది. అక్క అయితేనో భావన అనే క్షీరగంగ, సుజ్ఞానమనే నీతి యమున, పరమార్థమనే చక్కెర సరస్వతులను కలుపుకుని త్రివిధామృత స్రవంతిగా ప్రవహిస్తుంది.

"ఆండాళ్" ఆత్మసమర్పణ కొక ఉదాహరణం. రంగనాథుని పెళ్ళాడాలనే జన్మించిన వ్యక్తి. ఆధ్యాత్మిక విరహిణిగా పాడిన సుందర, సుమధురమైన 'పాశురాలు' తమిళ సాహిత్యానికి ఆభరణంలా శోభిస్తున్నాయి. రంగనాథుని సగుణోపాసకురాలైన ఆమెకు ఆ విశ్వమోహనుణ్ణి మోహించేంతగా తాను సుందరిగా కనిపించాలనే ఉబలాటం. అందుకే అతనికి వేసేందుకు తయారైన సుందర మాలల్ని తానే మొదలు ధరించి, అద్దంలో తన రూపం చూసుకుని 'వాడు ప్రేమించేంతగా నేను అందంగా లేనా?' అని తనను తానే ప్రశ్నించుకుంటుంది. తపోనిరతురాలైన గిరిజలా మన్మథుని సహకారాన్ని అభిలషిస్తుంది. అదృష్టం కొద్దీ ఇక్కడ మన్మథుడు దహించబడడు. పార్వతిలా మరింత తీవ్రతపస్సు చేయాల్సిన అవసరం రాదు.

రంగనాథుడు కలలో వచ్చి పూజారికి చెబుతాడు. మనిషి స్థాయిలో పెళ్ళి జరిగిపోతుంది. అయితే అక్కలా వద్దనుకున్న భర్త చేయి పట్టుకుని "బురదలో పడిన పశువులా అడుగడుగునా నోరు పారేసుకునే" అవసరం కానీ, దారిపొడవునా దుష్టుల నుండి కష్టాల పాలు కావాల్సిన సందర్భం కానీ, ప్రభుదేవుని చేత పరీక్షింపబడే సన్నివేశం కానీ ఆండాళమ్మ జీవితంలో కన్పించదు. హెళవనకట్టె గిరియమ్మది కూడా దాదాపు ఆండాళమ్మ చేసినంతటి సాధనే !

అక్కతో వివిధ రకాల పోలికలున్న ఆధ్యాత్మిక జ్యోతి అంటే - ఆమెయే మీరాబాయి. వీరిరువురి నడుమ దాదాపు 3 శతాబ్దాల అంతరం ఉన్నా కన్నడ రాష్ట్రంలోని ఉడుతడికి చెందిన మహాదేవి, రాజస్థాన్‌లోని కుడకికి చెందిన మీరా - వీరిరువురి జీవితం, సందేశాల్లో ఆశ్చర్యకరమైన పోలికలున్నాయి. మహాదేవియే మళ్ళీ మీరాగా జన్మించిందా అన్నంతగా సాదృశ్యాలున్నాయి - ఇరువురిలో! బాల్యం నుంచి అక్క మల్లికార్జునుని భార్య అయ్యేందుకు తపన పడింది. తహతహలాడింది. మీరా గిరిధర గోపాలుని సతి కావాలని పరితపించింది. "చచ్చే, చెడిపోయే భర్తల్ని పొయ్యిలో పెట్టు" అని అక్క అంటే, "ఐసే వర్ కో క్యా కరూఁ జో జన్మే ఔర్ మర్‌జాయె, వర్ వరియే ఏక్ సావరియారీ" (పుట్టి మరణించే వరుణ్ణి నేనేం చేయను? ఒక్కడే ఒక్కడైన కృష్ణుని చేతినే పట్టుకుంటా) అని మీరా పలికింది. ఇరువురూ పుట్టింటిని వదలి, సంప్రదాయ విరోధులై "సంతలో ఒక ఇల్లు కట్టి శబ్దానికి సిగ్గు పడితే ఎలాగయ్యా?' అనీ; "కోయ నిందో, కోయి బిందో గుణ గోవింద్ కా గాస్యా" అని బయలు దేరింది (ఎవరు నిందించినా ఎవరు పొగడిన గోవిందుని గుణాన్ని ప్రశంసిస్తా). "గొడ్రాలు ప్రసవవేదనను ఎరుగదు, సవతితల్లి ప్రేమిస్తుందా? నొప్పిని, వేదనను అనుభవించని వారెలా ఎదుగుతారు?" అనీ, "మేరా దరద్ కోయీ న జానే ఘాయల్ కీ గతి ఘాయల్ జానే" అనీ (నా బాధ ఎవరికి తెలుసు, గాయం వేదనను గాయపడినవాడే తెలుసుకోగల్గుతాడు); పూవుల పడకను త్యజించి ముళ్ళు పరచిన మార్గంలో ముందుకు సాగిన వాళ్ళు "ఎవరూ లేని ఆమె అని ఏడ్పులూ పెడబొబ్బలు వద్దు రా! ఏం చేసినా నేను భయపడే దాన్ని కాను! తరంగం పై నేను నిలిచాను, సుడిగుండంపై పడి నేనున్నాను? చెన్నమల్లికార్జునయ్య, దట్టమైన అరణ్యాన్ని చూసినంతనే శరీరాన్ని ప్రాణాన్ని మీకు అప్పగించి శుద్ధిరాలినయ్యా"నని, "లోక్ లాజకీ కుణనయానూ, నిరభై





నిసాన ఘుస్యా హోమాయి; మీరా సరణ సబల గిరిధారకీ" (లోకం పోకడలకు బెదరను. నిశ్చలంగా నిర్భయంగా ఉంటాను సబలుడైన గిరిధరుని పత్నిని నేను" అనీ చాలా ధైర్యంతో వణికించే పుంస్త్వధైర్యంతో ముందుకు సాగారు! అన్ని కష్టాలనూ సహిస్తూ, నిందల విషబిందువుల్ని మ్రింగుతూ ముందుకు సాగిన వీరికి "ఆకలైతే భిక్షాన్నాలున్నాయి; దప్పికైతే ఏరులు, చెరువులు బావులున్నాయి. పడుకునేందుకు పాడుపడ్డ దేవాలయాలున్నాయి. చెన్నమల్లికార్జునుడు నాకు సాంగత్యం చేయడానికి ఉన్నాడు." చంపాలనుకుని రాణా పంపించిన విషమే మీరాకు అమృతమైపోయింది.

ఈ కష్టాలనన్నిటినీ అధిగమించి, కత్తులపై నడక సాగించాక అక్క కల్యాణానికి, మీరా బృందావనానికి వెళ్ళాక వారిద్దరికీ లభించిన స్వాగతం ఒకే రకమైనది.

"సతి! నీవిక్కడికెందుకు వచ్చావమ్మా! నీ పతి గుర్తులు చెప్పి వచ్చి ఇక్కడ కూర్చో. లేకుంటే వెళ్ళిపో తల్లి!" అని అల్లమ ప్రభువులు అక్కమహాదేవితో అన్నారు. వృందావనంలోని జీవగోస్వాములు ఆడదైనందున మీరాబాయిని చూచేందుకూ నిరాకరిస్తారు.. అల్లమ ప్రభువు, అక్క మహాదేవిగార్ల సంభాషణను ఇదివరకే చూశాం. మీరా జీవగోస్వాములవారికి ఇచ్చిన సమాధానం చాలా గట్టిది. దాన్నిపుడు చూడాలి! "స్వామీజీ, కృష్ణుడొక్కడే పురుషడని నేను గ్రహించి ఉన్నా. బృందావనంలో అతనికి ఒక్క శత్రువు (పోటీ) ఉన్నాడని ఇపుడిపుడే నాకు అర్థమైంది. స్త్రీ ముఖం చూడడమే పాపమని భావించే మీరు రాధాపూజను ఎలా చేస్తారు? రాధా మాధవుల మధుర భక్తిని ఎలా బోధిస్తారు?"

అక్కగారి అభిప్రాయమూ ఇదే! గండరగండడు లాంటి వారిని ఏలే మహాపురుషుడు ఆమెకు చెందిన చెన్నమల్లికార్జునుడు "నా దేవుడు చెన్నమల్లికార్జునుడనే గర్వానికి జగత్తంతా స్త్రీయే చూడు!" అని అన్న అక్క,

"పురుషుడొక్కడే కృష్ణుడు" అన్న మీరా స్త్రీ పురుష భేదం అనేది భ్రాంతిమూలకమని చాటారు. స్త్రీ పురుష సమానత్వ సందేశాన్ని తెలిపారు.

ఎవరు మెచ్చినా, మెచ్చకున్నా తాము సరైనది అని తోచిందాన్ని నిర్భయంగా నిరూపించారు. "తమ అంతరంగంలోని ఆరాధ్యదైవం మెచ్చకుంటే ఎలా?" అనే ప్రశ్న వారి ధైర్యాన్ని క్రుంగదీయలేదు. అతడు మెచ్చనీ, మెచ్చకుండా ఉండనీ తాము అతణ్ణి మెచ్చుకుంటే చాలదా? అతడు మెచ్చుకోవాలనే కోర్కె కూడ ఎందుకుండాలి? అలాంటిది ఈ ఆత్మ ప్రత్యయంతో కూడిన ఘోషణ. "అయ్యా, నీవు వింటే విను. వినకుంటే మాను. నేను నీ గురించి పాడకుండా ఉండలేనయ్యా! అయ్యా! నీవు మెచ్చుకొంటే మెచ్చుకో లేదంటే మాను. నేను నిన్ను కౌగిలించుకోకుండా ఉండజాలనయ్యా!" ఇలాంటి శపథమే మీరా చేసింది. "జావో హరి, నిరమోహడారె జాణి థారి ప్రీత" (వెళ్ళు హరి! నీవు నిర్మోహివి! నీ ప్రీతి నాకు తెలుసు).

మగాడి ముందు తలవంచని తాము ప్రేమించిన పరమాత్ముణ్ణి చేతులు చాచి అడగని, దైన్యానికి అవకాశమివ్వని, ఆత్మవిశ్వాసాన్ని వదలని ఈ ఇరువురూ స్త్రీ గౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకు పోయిన వాళ్ళే! అయినా అక్క గారి వైశిష్ట్యం, విశేషం ఇక్కడ మనల్ని ఆకర్షించకమానదు.

ఉడుతడి నుండి కల్యాణానికి, కల్యాణం నుండి శ్రీశైలానికి అక్క చేసిన పయనం ఆధ్యాతికమైన పయనం. పులకింతలు కల్గించే యాత్ర. కౌశికుని ప్రకరణం ఎన్నో అంతరంగ సంఘర్షణలకు, మమకారపు కోలాహలాలకు కారణమైందన్న కాని. స్మరించిన వేళ అక్క తప్పించి ఇంకెవ్వరూ ఈ అగ్ని పరీక్షలో విజయం పొందేవారు కారని అన్పిస్తోంది. అల్లమ ప్రభువు - అక్కమహాదేవి - వీళ్ళ సంభాషణ ఎంతో ఆసక్తికరం. దాని ముందు జీవగోస్వామి -మీరాల సంవాదం చాలా పేలవం. అక్కగారి వచనాలన్నీ వైశిష్ట్యభరితాలనే





అంశం సరే! ఆమె ఎన్నో కవితల్ని, పాటల్ని, యోగాంగ త్రివిధిని, సృష్టి వచనాన్ని, కొరవంజి వచనాల్ని రచించారు. ఇది ఆమె అద్భుత ప్రతిభకు నిదర్శనం.

అక్కగారి అపూర్వత్వం ఆశ్చర్యకరమైనది. ఆమె అపూర్వత్వం అనన్యత, అనుపమ వ్యక్తిత్వం రహస్యమేమి? డా॥ అలెక్సిస్ కరెల్ చెప్పిందే నిజమేమో! "It is dangerous to exclusively an intellectual or a mystic, a logocian an intuitive, a scientist or a poet. It is by the by the simultaneous upward trend of her intellectual, moral, aesthetic and religious faculty that each can attain the highest level compatible with her inherited latent powers".

(కేవలం ఒక మేధావిగానో, ఒక తాంత్రికుడుగానో, ఒక తార్కికుడుగానో లేక ఒక అంతర్దృష్టి కలవాడుగానో, ఒక విజ్ఞానిగానో లేదా ఒక కవిగానో ఉండడం చాలా ప్రమాదకరం. ఏ వ్యక్తి అయినా తన మేధస్సు, నీతి, కళాత్మకత, మతం, ధార్మికత - అంశాల్లో అత్యున్నతమైన, ఉర్ధ్వముఖీనమైన ప్రస్థానం కల్గి ఉంటేనే, ప్రతి వ్యక్తి తనలో అంతర్నిగూఢమైన శక్తులతో సామంజస్యం కల్గిన ఒక అత్యున్నత స్థితిని పొందడం సాధ్యం).

అక్కలో ఈ సహజ శక్తులన్నీ ఉన్నాయి. బుద్ధిశక్తి, నైతికశక్తి, సౌందర్యోపాసనాశక్తి, ధర్మానుసంధానశక్తి - ఇవన్నీ ఆమె వరాలుగా పొందింది. వాటన్నిటిని సమాజ సమున్నతికై ఆమె సర్వస్వాన్ని త్యాగం చేసింది. కేవలం ఆమె మేధావిగా మిగిలిపోక, కేవలానుభావాన్ని కానీ, తార్కికశక్తినిగాని, అతర్దృష్టినికాని, వైజ్ఞానికత్వాన్ని కానీ, కావ్యానుభవాన్ని కానీ, సాధించక, వీటన్నిటి సుమధురమైన, హితకరమైన సమ్మిశ్రణాన్ని సాధించింది. ఇది రాసాయనిక సమ్మిశ్రవణం. ఒట్టి భౌతిక సమ్మిశ్రణం కాదు. అక్క రచనలలో మేధావిత్వపు విద్యుదాలింగనం ఉంది. ఇది సర్వానుమతమైన విషయం; వాటిలో అంతర్దృష్టి, అనుభావాలు పడుగుపేకల్లా కలిసిపోవడం కూడ అందరూ

అంగీకరించిన అంశమే! ఆమె స్పందనశీలి! సంవేదన శీలి! ఈ విషయంలోనూ అభిప్రాయభేదాలు లేవు. అయితే తార్కికత్వం, వైజ్ఞానికత ఇందులో ఉన్నాయా? సూక్ష్మగ్రాహులకు ఇక్కడ తర్కబద్ధమైన ఆలోచనల సరణి, వైజ్ఞానిక దృక్పథం – కనిపించకుండా మానవు. ఉదాహరణలు అనవసరం. పాఠకులకు అప్రయత్నంగా లభించవచ్చు. ఉదాహరణలు అక్కగారి అద్వితీయత్వం ఇక్కడే ఉంది.

మొత్తానికి అక్క గారు ఒక అద్భుత మహిళ. "శారీరకలజ్జను, కల్పితాన్ని తొలగించుకుని, జీవనలజ్ఞామోహాల్ని నిర్మూలించుకుని, అంతరంగాన్ని దిగంబరత్వంతో బయలు చేసి, తన స్వానుభావోదయంతో తనను తాను తెలుసుకున్న నిజమైన శక్తి స్వరూపిణి అక్కమహాదేవి.

'పేరుతో మహిళ అయినా భావించేందుకు పురుష రూపం' అని చాటిన మహాదేవి, 'చెన్నమల్లికార్జునుడు కాముని చంపి మనసిజుడుగా మిగిలిపోతే మనసిజుని తలరాతను తుడిచేశా' అని ఘోషించిన అక్కమహాదేవి, "మా ఇంట్లో ఇవాళ పండగ; మాకు సందడి ఎక్కువ; మిమ్మల్ని పలకరించేందుకు సమయం లేదు. వెళ్ళండి విషయాల్లారా!" అని హెచ్చరించిన అక్కమహాదేవి "విడుచు విడుచు కర్మమా! నిన్ను చంపకమానను' అని ప్రకటించిన అక్క మహాదేవి; "మీ మాయకు నేను భయపడేదాన్ని కాదు చెన్నమల్లికార్జున దేవా! మీపై ఆన" అని విస్ఫోటకంగా పలికిన మహాదేవి, "నిన్ను తెలుసుకునే నరకమే మోక్షం. నిన్నెరుగని ముక్తియే నరకం" అని నమ్మిన మహాదేవి తన గురించి తానే ఇలా చెప్పుకోవడంలో ఆశ్చర్యమేముంది?

**"కాముని తల కోసి**
**కాలుని కళ్ళు పీకి**





**సూర్యచంద్రుల్ని తొలగించి**
**పొడిచేసి తినే దానికి**
**పేరు పెట్టేవారెవరు? చెప్పండి?"**

ఔను! పేరు పెట్టే వాళ్ళెవరు? తల ఆడించని వాళ్ళెవరు? తలదించని వాళ్ళెవరు?

శుభం